సోమవారం
29-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 98
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

తిరగబడ్డ గిరిజనం

రాయ్‌గఢ్ జిల్లాలో బొగ్గు తవ్వకాలపై నిరసనలు

తమ్నార్ ప్రాంతంలో ఉద్రిక్తత... పోలీసులపై దాడి

అనేక వాహనాలు, ఆస్తుల ధ్వంసం

రాయ్‌గఢ్: చత్తీస్‌గఢ్ రాష్ట్రం... రాయ్‌గఢ్ జిల్లా బొగ్గు గని ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గిరిజనులు ఉవ్వెత్తున ఉద్యమించారు. ప్రాజెక్టును రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తమ్నార్ ప్రాంతంలో జిందాల్ పవర్ లిమిటెడ్ బొగ్గు గనుల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఫలితంగా పోలీసులు, పోలీసుల ఆస్తులపై దాడులు జరిగాయి. కొన్ని సామాజిక వ్యతిరేక శక్తులు నిరసనకారులను రెచ్చగొట్టాయని జిల్లా యంత్రాంగం పేర్కొంది. అయితే రాష్ట్ర ప్రభుత్వ మొండితనం శాంతియుత నిరసనకారులను రెచ్చగొట్టిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. తమ్నార్‌లోని గారే పెల్మా సెక్టార్-1 బొగ్గు బ్లాక్ పరిధిలోని 14 ప్రభావిత గ్రామాల ప్రజలు డిసెంబరు 8న ధౌరభటలో ఈ ప్రాజెక్టు కోసం నిర్వహించిన ప్రజా విచారణకు వ్యతిరేకంగా డిసెంబరు 12 నుంచి లిబ్రా గ్రామంలోని సీహెచ్‌పీ చౌక్ వద్ద ధర్నా చేస్తున్నారు. ప్రతిపాదిత మైనింగ్ ప్రాజెక్టు క్లియరెన్స్ కోసం నిర్వహించిన ప్రజా విచారణ నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఉందని పేర్కొంటూ, దానిని రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... శనివారం నిరసనకారులు జిందాల్ పవర్ లిమిటెడ్ బొగ్గు నిర్వహణ ప్లాంట్‌లోకి కూడా చొరబడి ప్రాంగణాన్ని ధ్వంసం చేశారు. రాళ్లు రువ్వడం, ఒక పోలీసు బస్సు, జీపు, అంబులెన్స్‌కు నిప్పు పెట్టడం, అనేక ఇతర ప్రభుత్వ వాహనాలను ధ్వంసం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది.

బొగ్గు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిరసన

జిల్లా యంత్రాంగం విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, శనివారం ఉదయం

- మిగతా 2 లో

రాజ్యమేలుతున్న ధనస్వామ్యం - భూస్వామ్యం

దేశభక్తి ముసుగులో దేశ సంపద దోపిడీ

పేదల సంక్షేమం పణంగా కార్పొరేట్లకు ఊడిగం

మోదీ విధానాలపై కూనంనేని విమర్శలు

విశాలాంధ్ర బ్యూరో-ములుగు/భూపాలపల్లి: దేశంలో ప్రజాస్వామ్యం పేరుతో ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. దేశభక్తి ముసుగులో కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను బీజేపీ దోచిపెడుతున్నదన్నారు. కోట్ల సంవత్సరాలు చరిత్ర కలిగిన ఆరావళి పర్వతాలను ఆదానీ మైనింగ్ కంపెనీకి కట్టబెట్టే కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. ప్రకృతిని, పర్యావరణాన్ని నాశనం చేస్తూ దేశ సంపదను, సహజ వనరులను కార్పొరేట్‌లకు దోచి పెడుతున్న మోదీ ప్రభుత్వం చర్యలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మోదీ హయాంలో పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ప్రజా సంక్షేమం అటకెక్కిందని, మతోన్మాదం పేట్రేగిందని కూనంనేని సాంబశివరావు

- మిగతా 2 లో

ఇండిగోకు షాక్

పడిపోయిన దేశీయ మార్కెట్ వాటా

ముంబై: దేశంలో అతిపెద్ద విమాన యాన సంస్థ ఇండిగోకు మరో షాక్ తగిలింది. నవంబరులో ఇండిగో దేశీయ మార్కెట్ వాటా 63.6 శాతానికి పడిపోయింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తాజా డేటాలో ఈ విష యం వెల్లడైంది. ఈ నెల ప్రారం భంలో ఇండిగో విమాన సేవలు సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. వరుసగా విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. ప్రయాణికులు పెద్దఎత్తున ఇబ్బంది పడ్డారు. దీంతో ఇండిగో సంస్థ విమర్శలను ఎదుర్కొన్నది. ఈ నేపథ్యంలోనే సంస్థ షేర్లు పతనమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.



తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా సురేశ్ బాబు

హైదరాబాద్: తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా నిర్మాత సురేశ్ బాబు ఎన్నికయ్యారు. ప్రోగ్రెసివ్ ప్యానెల్ మద్దతుతో గెలిచారు. కార్యదర్శిగా అశోక్ కుమార్, ఉపాధ్యక్షులుగా సూర్య దేవర నాగవంశీ, భరత్ చౌదరి ఎన్నిక కాగా, కోశాధి కారిగా ముత్యాల రామదాసులు, సంయుక్త కార్యదర్శిగా మోహన్ వడ్లపట్ల, విజయేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. తెలుగు ఫిల్మ్‌ఛాంబర్‌లో మొత్తం 3,355 మంది సభ్యులు ఉన్నారు. ఛాంబర్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 12 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా

- మిగతా 2 లో

నేడు ఏపీ మంత్రి మండలి సమావేశం

విశాలాంధ్ర - సచివాలయం: రాష్ట్ర సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రి మండలి సమావేశం జరగనుంది. రాష్ట్ర మంత్రులందరూ హాజరుకాను న్నారు. వివిధ అంశాలపై చర్చ జరగనుంది. ముఖ్యంగా మూడు కొత్త జిల్లాల ఏర్పాటు, వివిధ రెవెన్యూ డివిజన్లకు అమోదం తెలపనున్నట్లు తెలుస్తోంది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ప్రాంగణంలో రెండు ఎకరాల్లో రూ.103.96 కోట్లతో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు అమోదించనున్నారు. అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలకు అదనపు సౌకర్యాల కల్పనకు రూ.109 కోట్ల కేటాయింపునకు

- మిగతా 2 లో

కమ్ముకొస్తున్న వాయు కాలుష్యం

భారతదేశం వాయు కాలుష్యం నుంచి అతిపెద్ద ముప్పు ఎదుర్కోబోతోందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దీన్ని నివారించడానికి వెంటనే కార్యాచరణ చేపట్టకపోతే పరిస్థితి ఏటేటా దిగజారిపోతుందని చెబుతున్నారు. వాయు కాలుష్యం వల్ల కంటికి కనిపించకుండా శ్వాసకోశ వ్యాధులు ఏకమవుతున్నాయని, ఏదో ఒకరోజు అవన్నీ నిశ్శబ్ద సునామీలా విరుచుకుపడతాయని వెల్లడించారు.

2 లో

ఉన్నావ్ కేసులో సీబీఐ పిటిషన్‌పై నేడు సుప్రీం విచారణ

ఉన్నావ్ అత్యాచార కేసులో బహిష్కృత బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌కు విధించిన జీవిత ఖైదును సస్పెండ్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు సోమవారం విచారణ జరపనుంది.

5 లో

దేశం కోసమే కాంగ్రెస్ పోరాటం

మల్లికార్జున ఖర్గే

భారతదేశ ఆత్మకు స్వరం కాంగ్రెస్: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అనేది ఒక సిద్ధాంతమని, అది ఎప్పటికీ నశించదని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. కాంగ్రెస్ పోరాడకపోతే రాజ్యాంగాన్ని, దేశాన్ని ఎవరు పరిరక్షిస్తారని ఖర్గే అన్నారు. కాంగ్రెస్ నిర్మించిన సంస్థలను మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో బలహీనపరిచిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పోరాటం అధికారం కోసం కాదని దేశం కోసమని స్పష్టం చేశారు. రాజ్యాంగం, లౌకికవాదం, హక్కుల రక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఖర్గే మాట్లాడారు. యూపీఏ హయాంలో ఆర్‌టీఐ, ఎంజీ నరేగా, ఆహార భద్రత, అటవీ హక్కులు, భూసేకరణ చట్టాలు తెచ్చామని గుర్తు చేశారు. బీజేపీ నేత ృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులను అణచివేస్తోందని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు జాతీయ జెండా, రాజ్యాంగాన్ని అగౌరవపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియా గాంధీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో యూపీఏ ప్రభుత్వం ప్రజల హక్కుల పరిరక్షణను విస్తరించిందని..మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు సమాచార హక్కు, విద్యా హక్కు, ఆహార భద్రత, ఉపాధి హామీ, అటవీ హక్కులు, భూ సేకరణ చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. గత 11 ఏళ్లుగా మోదీ

- మిగతా 2 లో

ఉపాధి హామీ చట్టం రద్దుకు బీజేపీ కుట్ర

- మత-విద్వేష రాజకీయం సమాజానికి నష్టం
- మల్లు భట్టి విక్రమార్క

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: కాంగ్రెస్ భావజాలంతోనే దేశానికి రక్షణ అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నొక్కిచెప్పారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ ఆవిర్భవించిన చరిత్రాత్మకమైన రోజు డిసెంబర్ 28వ తేదీ అని అన్నారు. దేశ సంపద, వనరుల దోపిడీకి గురవుతుంటే... బ్రిటిష్ సామ్రాజ్యానికి ఎదురొడ్డి నిలిచింది కాంగ్రెస్ అని గుర్తుచేశారు. రాజకీయ లబ్ధి కోసం కొందరు కులాలు-మతాల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని, ఇది సమాజానికి చేటన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి మోదీ ప్రభుత్వం తూట్లు పొడిచిందని, పేదలకు అన్యాయం చేస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. గొప్ప ఆశయంతో ఉపాధి హామీ పథకానికి లక్ష కోట్ల బడ్జెట్‌ను కాంగ్రెస్

- మిగతా 2 లో

ప్రతి గ్రామం డిజిటలైజ్

- గ్రామ స్వరాజ్యానికి కట్టుబడి ఉన్నాం
- గ్రామాలు బలంగా ఉంటేనే రాష్ట్రం- దేశాభివృద్ధి సాధ్యం
- మంత్రి శ్రీధర్ బాబు
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సర్పంచ్‌లకు సన్మానం

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రజల ముంగిటకు పౌర సేవలు చేరేలా అన్ని గ్రామా లను 'డిజిటల్ విలేజ్'లుగా తీర్చిదిద్దాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. సాంకేతికతను అందిపుచ్చు కునేలా పంచాయతీలకు తమ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. గ్రామీణులకు మేలుచేసే గొప్ప సంకల్పంతో యూపీఏ హయాంలో తెచ్చిన ఉపాధి హామీ పథకం నిర్వీర్యానికి కేంద్రప్రభుత్వం కుట్ర చేస్తున్నదన్నారు. గ్రామాలే ప్రజాస్వామ్యానికి పునాదులని, అవి బలంగా ఉన్నప్పుడే రాష్ట్రం- దేశం అభివృద్ధి బాటలో పయనించగలవని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రతి గ్రామం డిజిటల్ విలేజ్ కావాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లను

- మిగతా 2 లో

నేటి నుంచి అసెంబ్లీ

అస్త్రశస్త్రాలతో అధికార-విపక్షాలు సిద్ధం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. శాసనసభలో అనుసరించాల్సిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల మంత్రులతో చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల తరువాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సుదీర్ఘ కాలం తరువాత పార్టీ ఎల్పీ సమావేశం నిర్వహించ డంతో పాటు ముఖ్య నాయకులతో భేటీ అయ్యారు. త్వరలోనే ప్రజా క్షేత్రంలోకి వస్తానని ఆయన ప్రకటించారు. కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలనే ఉద్దేశంతో ఇంతకాలం వేచి చూసినట్లు చెప్పారు. పాలనాపరంగా కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. ప్రాజెక్టుల పనులను నిర్లక్ష్యం చేసినట్లు ఆరోపించారు. దీంతో మంత్రులందరూ కూడా కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. దీంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది. సమావేశాలకు కేసీఆర్ హాజరవుతున్నట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. దీంతో సభలో అధికార-విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగే అవకాశం లేకపోలేదు. అభివృద్ధి విషయంలో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ వ్యూహాలు సిద్ధం చేసుకున్నాయి. ప్రతిపక్షాల దాడిని ఎదుర్కొనేందుకు అధికార కాంగ్రెస్ కూడా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మన భజనే .. భవిష్యత్తులో మనల్ని కాపాడవచ్చు!

అన్యాయమైన న్యాయం

ఆర్వీ రామారావ్

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు సుబ్రహ్మణ్యం ప్రసాద్, హరీశ్ వైద్యనాథన్ ఉన్నావ్ కేసులో బీజేపీ మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగర్ కు విముక్తి కల్పిస్తూ ఇచ్చిన తీర్పు న్యాయం ఎంత అన్యాయంగా ఉంటుందో నిరూపించింది. ఈ తీర్పును ఉన్నావ్ బాధితురాలి కుటుంబం, మహిళా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దేశవ్యాప్తంగా అనేక చోట్ల భారీ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి.

ఢిల్లీ హైకోర్టులోని ఇద్దరు న్యాయమూర్తుల బెంచి కుల్దీప్ సింగ్ సెంగర్ కు అనుకూలంగా తీర్పు ఇవ్వడంలో వింత వాదనలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగర్ ప్రజా సేవకుడు కాదన్నారు. పోస్కో చట్టం ప్రకారం ప్రజాసేవకులు అత్యాచారాలకు పాల్పడితే ఎక్కువ శిక్ష విధించవలసి ఉంటుంది. లేకపోతే శిక్ష ఏడేళ్లకు పరిమితం అవుతుంది. కానీ సెంగర్ ప్రజా సేవకుడు కాదని భావించిన న్యాయమూర్తులు ఆయన ఇప్పటికే ఏడున్నరేళ్లు జైలులో గడిపారు కనక ఇంకెంత కాలం జైలులో ఉంచుతాం అని ప్రశ్నించారు. అందువల్లే ఆయనకు పడ్డ యావజ్జీవ కారాగార శిక్షను నిలిపివేశారు. సెంగర్ ప్రజా సేవకుడు కారని ఇద్దరు న్యాయమూర్తులు భావించడం వింతే.

ప్రజా సేవకులు ఎవరు అన్న అంశం భారత శిక్షా స్మృతి (ఐ.పి.సి.) సెక్షన్ 21లో స్పష్టంగా నిర్వచించారు. ప్రభుత్వాధికారులు, న్యాయాధికారులు, సైనికాధికారులు, పోలీసు అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే అధికారులు ఆ నిర్వచనం ప్రకారం ప్రజా సేవకులవుతారు. ప్రజా ప్రతినిధులను ఆ జాబితాలో చేర్చక పోవడాన్ని ఆసరాగా తీసుకుని సెంగర్ కు వెసులుబాటు కలించారు. అయితే ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజా సేవకులు కాకుండా ఎలా ఉంటారు? ప్రజా ప్రతినిధులను ప్రజలు ఎన్నుకుంటారు. వాళ్లు అందుకునే వేతన భత్యాలు, పింఛన్ కూడా ప్రజలు చెల్లించిన పన్నుల ద్వారా సమకూరిచిన నిధుల నుంచే వస్తాయి. అలాంటప్పుడు సెంగర్ సైతం ప్రజా సేవకుడు అవుతారుగదా. ప్రజా జీవనంలో ఉన్నవారందరూ ప్రజా సేవకులే. చట్టాలు చేసేది ప్రజలకోసమే. అలాంటప్పుడు ప్రజా ప్రతినిధులు కూడా ప్రజా సేవకుల జాబితాలోకి రావాల్సిందే.

దాణా కుంభకోణంలో లాలూ ప్రసాద్ నిందితుడైనప్పుడు ఆయనను ప్రజా సేవకుడిగానే భావించారు. ఐ.పి.సి. సెక్షన్ 21 ప్రకారం ముఖ్యమంత్రులు, మంత్రులు ప్రజాసేవకులేనని అప్పుడు స్పష్టంగా చెప్పారు. ఆ దశలో లాలూ బీహార్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. 1981లో మహారాష్ట్ర ప్రభుత్వానికి, కేశవ్ బాబూలాల్ పాఠక్ కు మధ్య నడిచిన కేసులో కూడా ప్రజా ప్రతినిధులను ప్రజా సేవకులుగానే గుర్తించారు. సెంగర్ కేసులో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులిద్దరికీ ఈ వాస్తవాలు తెలియవనుకోలేం. కానీ బీజేపీ నాయకుడైన సెంగర్ ను రక్షించడం కోసం ఆయనను ప్రజా సేవకుడు కాదని అన్నారు. ఈ వక్రీకరణకు కారణాలేమైనా కావొచ్చు.

1984లో ఆర్.ఎస్.నాయక్ కు అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.ఆర్.అంతులే మధ్య నడిచిన కేసులో అంతులేను ప్రజా సేవకుడిగానే భావించారు. 1979లో ఎం.కె.కరుణా నిధికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య నడిచిన కేసులో కూడా కరుణానిధిని ప్రజా సేవకుడి కిందే పరిగణించారు. కానీ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులిద్దరు చట్టంలలోని భాషనే పరిగణనలోకి తీసుకుని వాటి స్ఫూర్తిని వదిలేసి సింగర్ ప్రజా సేవకుడు కాదనేశారు. ఉన్నావ్ వ్యవహారంలో బాధితురాలికి ముప్పు ఉందని ఇద్దరు

- మిగతా 2 లో

అవసరమైతే ప్రత్యేక సైనిక ఆపరేషన్: పుతిన్

మాస్కో: యుద్ధానికి ముగింపు పలికి శాంతి స్థాపించుకునే విషయంలో ఉక్రెయిన్‌కు తొందరేమీ లేదనట్లు ఉన్నదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వ్యాఖ్యానించారు. శాంతియుతంగా యుద్ధాన్ని పరిష్కరించుకునే ఉద్దేశం ఉక్రెయిన్‌కు లేనట్లయితే రష్యా తన అన్ని లక్ష్యాలను ప్రత్యేక సైనిక ఆపరేషన్ ద్వారా బలంతంగానైనా సాధించుకోగలదని హెచ్చరించారు. ఆదివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ఫ్లోరిడాలో భేటీ అయ్యే నేపథ్యంలో పుతిన్ ఈ హెచ్చరికలు చేశారు. రష్యా సైనిక కమాండ్ పోస్టును సందర్శించిన క్రమంలో చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ వాలెరీ గెరిసిమోవ్, రష్యన్ దళాలతో పుతిన్ చర్చలు జరిపారు. అనంతరం మాట్లాడుతూ శాంతియుత పరిష్కారానికి ఉక్రెయిన్ ముందుకు రాని పక్షంతో ప్రత్యేక సైనిక చర్యలకు వెనుకాడబోమని పుతిన్ తేల్చిచెప్పారు. శాంతి చర్చలపై ఉక్రెయిన్ ఆసక్తి కనబర్చడంలేదన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకుందామన్న చిత్తశుద్ధి ఆ దేశానికి లేటనట్లున్నదని వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌లోని డెంట్స్క్ పరిధిలోని మైర్నోహార్డ్, రోడిన్‌స్కీ, అర్టెమిక్కా పట్టణాలతో పాటు జపోరిజ్జియా ప్రాంతంలోని హులైపోలే, స్టెప్నోహిర్ఫ్‌ను తమ దళాలు కైవసం చేసుకున్నట్లు పుతిన్‌కు సైన్యాధికారులు తెలిపారు. అటు ఉక్రెయిన్ భిన్న వాదన వినిపించింది. మైర్నోహార్డ్, హులైపోలే వైపునకు రష్యా దళాలను రానివ్వకుండా తమ సైన్యం సమర్థంగా అడ్డుకున్నట్లు ఉక్రెయిన్ సైన్యం పేర్కొంది. అదే విధంగా తాము శాంతిని కోరుకుంటుంటే రష్యా యుద్ధం కొనసాగించాలని భావిస్తోందని జెలెన్‌స్కీ కూడా వ్యాఖ్యానించారు.

ఐదేళ్ల తర్వాత ఓటేసిన మైన్మార్

పౌర యుద్ధం నడుమ సార్వత్రిక ఎన్నికలు

నే పీ డా: మైన్మార్‌లో ఐదేళ్ల తర్వాత సార్వత్రిక ఎన్నికల కోసం ఓటింగ్ ఆదివారం మొదలైంది. ప్రజలు ఉదయం నుంచే క్యూలైన్లలో కనిపించారు. ఇన్నేళ్లుగా పడుతున్న కష్టానికి ఈ ఎన్నికలు ఏమైనా ఊరట కల్పిస్తాయోనని ఆశిస్తున్నారు. ప్రజా పాలనకు దూరమై ఐదు సంవత్సరాలుగా జుంటా నిరంకుశ రాజ్యంలో బిక్కుబిక్కుమంటున్న తమ బతుకుల్లో వెలుగు నింపే ప్రజా నాయకులు కోసం వేచిఉన్నారు. అయితే రెండవ విడత పోలింగ్ మరో రెండు వారాల్లో జరగబోతోంది. చివరి దశ జనవరి 25న జరుగుతుంది. ఇక ఓట్ల లెక్కింపు, ఫలితాల తేదీలను ప్రకటించాల్సి ఉంది. కాగా, 2020 సార్వత్రిక ఎన్నికల్లో చారిత్రక విజయం అందుకున్న నేషనల్ లీగర్ ఫర్ డెమొక్రసీ 2021లో జరిగిన సైనిక తిరుగుబాటుతో కుప్పకూలింది. అప్పటి అధినేత్రి ఆంగ్ సాన్ సూకీ జైలుకు పరిమితమయ్యారు. అనేక కేసులు పెట్టి ఆమెను నిర్బంధంలో సైనిక ప్రభుత్వం ఉంచింది. అయితే పౌర యుద్ధం నడుమ తాజా పోలింగ్ జరిగింది. ఎన్నిక పారదర్శకంగా జరుగుతుందా అన్న అనుమానాలు అనేకం వ్యక్తమయ్యాయి. జుంటా బానిసత్వ రాజ్యాన్ని కొనసాగించడమే ఈ ఎన్నికల ఉద్దేశమని కొందరు మేధావులు అన్నారు. మైన్మార్‌లో తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనగలవా లేదా అనేది పక్కకుపెడితే పోలింగ్ స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతుందన్న నమ్మకం లేదని అంతర్జాతీయ పరిశీలకులు అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వారు, పార్టీల ప్రతినిధులు, ప్రత్యర్థులు సహా 30వేల మందికిపైగా రాజకీయ నాయకులు 2021 నుంచి నిర్బంధంలో ఉన్నారని ఐక్యరాజ్య సమితి (ఐరాస) గుర్తుచేసింది. దీంతో ఈ ఎన్నికలకు అర్థం లేదని పేర్కొంది. వీటిని మిథ్యగా కొందరు ప్రతినిధులు వ్యాఖ్యానించారు. అయితే జుంటా బలపర్చిన పార్టీనే ఈ ఎన్నికల్లో గెలుస్తుందని తెలుస్తోంది.

హమాస్ నిరాయుధీకరణను ఒప్పుకోం: పాక్

లాహోర్: గజాలో అంతర్జాతీయ సుస్థిరత దళంగా తమ సైనికులను పంపించడానికి పాకిస్థాన్ ఒప్పుకున్నది. అయితే అమెరికా ప్రతిపాదిత 20 అంశాల ప్రణాళికలో హమాస్ నిరాయుధీకరణ షరతు తొలగించాలని మెలిక పెట్టింది. ఈ మేరకు పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్ వెల్లడించారు. ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్ (ఐఎస్ఎఫ్)లో తమ దేశం భాగం కావడం చాలా సున్నితమైన అంశమన్నారు. శాంతిని పరిరక్షించే దళంగానే పాకిస్థాన్ కొనసాగుతుందని తెలిపారు. హమాస్ నిరాయుధీకరణలో భాగం చేయకుండా శాంతి పరిరక్షణకు కట్టుబడితే తమ దళాన్ని పంపిస్తామని స్పష్టంచేశారు. అయితే అమెరికా ప్రణాళికలో హమాస్ నిరాయుధీకరణ ముఖ్యాంశంగా ఉంది. గజాలో శాంతి సాపనకు ఇదే ఉత్తమ మార్గంగా అమెరికా భావిస్తోంది. గజాకు బలగాలు పంపుతామని పాకిస్థాన్‌తో పాటు మరికొన్ని దేశాలు ముందుకొచ్చాయని వెల్లడించింది.

నేటి నుంచి అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

సర్వసన్నద్ధంగా ఉంది. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చిస్తామని ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించారు. ఈ అంశం పై చర్చ తరువాతే ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికలు జరుగతాయని రేవంత్ స్పష్టంచేశారు. ఈ అంశంపై కాంగ్రెస్‌ను లక్ష్యం చేసుకునేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. కృష్ణా జలాల కేటాయింపు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, కాళేశ్వరంపై అసెంబ్లీలో మాటల యుద్ధం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఉద్యోగ అవకాశాలు, ఎన్నికల హామీలు, తదితర అంశాలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుపట్టనున్నాయి. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ నిలదీయబోతోంది.

దేశం కోసమే కాంగ్రెస్ పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

సర్కారు కాంగ్రెస్ నిర్మించిన వ్యవస్థలను బలహీనపరిచిందని, ఆర్ఎస్ఎస్--బీజేపీ నాయకులు జాతీయ జెండా, రాజ్యాంగం, అశోక చక్రం, వందేమాతరంను అవమానించారన్నారు. వారు ప్రజల హక్కులను అణిచివేస్తున్నారని, స్వాతంత్ర్య ఉద్యమంతో వారికి ఎలాంటి సంబంధం లేదని, ప్రజల హక్కులను లాక్కుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ కార్యకర్తలకు పార్టీ ఫౌండేషన్ డే శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగం కోసం పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'ఈ రోజు భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతి కాంగ్రెస్ వాదికి శుభాకాంక్షలు" అని ఆయన పేర్కొన్నారు. 'కాంగ్రెస్ అనేది కేవలం ఒక రాజకీయ పార్టీ కాదు. ఇది భారతదేశ ఆత్మకు స్వరం లాంటింది. ప్రతి బలహీనుడికి, ప్రతి అణగారిన వర్గానికి, కష్టపడి పనిచేసే ప్రతి వ్యక్తికి ఇది అండగా నిలిచింది. ద్వేషం, అన్యాయం, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా మా పోరాటం కొనసాగుతుంది. సత్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం మరింత బలంగా పోరాడాలన్నదే మా సంకల్పం' అని రాహుల్ గాంధీ హిందీలో ట్వీట్ చేశారు. అలాగే, భారతదేశానికి స్వేఛను సాధించి పెట్టిన మహనీయులు, త్యాగధనులకు నివాళులు అర్పిస్తున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. ఆ మహనీయులు రాజ్యాంగానికి పునాది వేశారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వ విలువలను బలోపేతం చేశారని స్పష్టం చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ 1885 డిసెంబర్ 28న ఏర్పాటైంది. ముంబైలోని దాస్ తేజ్‌పాల్ సంస్కృత కళాశాలలో పార్టీ ఆవిర్భవించింది. దీని వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా ఏవో హ్యూమ్ వ్యవహరించారు. చంద్ర బెనర్జీ తొలి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ తనదైన ముద్ర వేస్తూ వస్తోంది.

అన్యాయమైన న్యాయం

(మొదటిపేజీ తరువాయి)

న్యాయమూర్తులూ అంగీకరించారు. ఆమెకు రక్షణ కల్పించాల్సిందేనన్నారు. కానీ ఆమె రక్షణను దృష్టిలో పెట్టుకుని సెంగర్ ను జైలులో ఉంచలేమని చెప్పి అందరినీ ఆశ్చర్య పరిచారు. ఆశారాం బాపు, రాం రహీం సింగ్ కేసుల్లో సాక్షుల మీద వచ్చిన తీవ్ర ఒత్తిడిని విస్మరించడం ఈ న్యాయమూర్తులకు ఎలా సాధ్యం అయిందో మరి.

దిల్లీ న్యాయమూర్తుల తీర్పు ఒక మేరకు సాంకేతిగా సరైందే అనిపించినా అది న్యాయమేనా అన్న ప్రశ్న ఉండనే ఉంది. ఈ తీర్పు మీద హాహాకారాలు చూసి మోదీ ప్రభుత్వం వెనకడుగు వేయక తప్పలేదు. అందుకే సీబీఐ సుప్రీంకోర్టులో దిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ఇద్దరు న్యాయమూర్తుల తప్పుడు తీర్పు మీద సుప్రీంకోర్టు అంతిమ నిర్ణయం ఏమిటో వేచి చూడాల్సిందే. అయినా హైకోర్టు తీర్పును సునిశితంగా పరిశీలించాల్సిందే. ఈ ఇద్దరు న్యాయమూర్తుల తీర్పు అన్యాయమైందిగా భావించి సుప్రీంకోర్టు వీరిని ఏ రూపంలోనైనా శిక్షిస్తుందా లేదా అన్న అంశం కూడా ఆసక్తి కలిగించే విషయమే. కింది కోర్టు జడ్జి సరైన న్యాయం చేయలేదనిపించినప్పుడు అలాంటి వారిని హైకోర్టు సస్పెండ్ చేసిన ఉదంతాలు ఉన్నాయి.

ఉదాహరణకు అదనపు సెషన్స్ జడ్జిగా ఉన్న శశికాంత్ రాయ్ ఆరేళ్ల బాలికపై అత్యాచారం జరిగితే ఆ కేసును విచారణను ఒక్క రోజులో పూర్తి చేసి నిందితుడికి జీవిత ఖైదు విధించారు. అంతకు ముందు మరో సందర్భంలో ఆయన ఒక అత్యాచార కేసు విచారణను నాలుగు రోజుల్లో ముగించి నిందితుడి నేరాన్ని నిర్ధారించి, దోషిగా తేల్చి మరణ శిక్ష విధించారు. ఈ తొందరపాటు వల్లే పట్నా హైకోర్టు శశి కాంత్ రాయ్ ను 2022 ఫిబ్రవరి ఏడున సస్పెండ్ చేసింది.

మరో కేసులో విచారణ తొమ్మిదిది రోజుల్లో ముగించి మరణ శిక్ష విధించారు. ఈ తీర్పును సుప్రీంకోర్టు నిలిపి వేసి 2019లో పునర్విచారణ కోసం సెషన్స్ కోర్టుకు తిప్పి పంపింది.

ఏ కేసులోనైనా విచారణ పూర్తి అయిన వెంటనే తీర్పు వెల్లడించకూడదన్న సుప్రీంకోర్టు నిర్దేశాలు ఉన్నాయి. అత్యుత్సాహం ప్రదర్శించకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన నిర్దేశాలే ఇచ్చింది. శశికాంత్ జీవిత ఖైదులు, మరణ శిక్ష విధించినప్పుడు ఆ నిర్ధారణకు రావడానికి కారణాలు వెల్లడించలేదు. దీన్ని న్యాయ పరిభాషలో నాన్ స్పీకింగ్ ఆర్డర్ అంటారు.

తీర్పులో తప్పు జరిగితే జడ్జీ మీద చర్య తీసుకునే అవకాశం ఉండదు. తమకు వ్యతిరేకంగా తీర్పు వచ్చిందనుకున్నప్పుడు పిటీషనర్లు పై కోర్టుకు వెళ్లొచ్చు. సెంగర్ కేసులో తీర్పు చెప్పిన దిల్లీ హైకోర్టు న్యాయ మూర్తులిద్దరూ సెంగర్ ప్రజా సేవకుడు కాదనడం ఆశ్చర్యంగా ఉంటుంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజా సేవకులు కాకుండా ఎలా ఉంటారో!

కమ్ముకొస్తున్న వాయు కాలుష్యం

భారత్‌కు అతి పెద్ద ముప్పు

న్యూదిల్లీ: భారతదేశం వాయు కాలుష్యం నుంచి అతిపెద్ద ముప్పు ఎదుర్కోబోతోందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దీన్ని నివారించడానికి వెంటనే కార్యాచరణ చేపట్టకపోతే పరిస్థితి ఏటేటా దిగజారిపోతుందని చెబుతున్నారు. వాయు కాలుష్యం వల్ల కంటికి కనిపించకుండా శ్వాసకోశ వ్యాధులు ఏకమవుతున్నాయని, ఏదో ఒకరోజు అవన్నీ నిశబ్ద సునామీలా విరుచుకుపడతాయని వెల్లడించారు. బ్రిటన్‌లోని భారత సంతతి శ్వాసకోశ వ్యాధి నిపుణులు మనీశ్ గౌతమ్, రజయ్ నారాయణ్‌లతో పాటు బ్రిటిష్ మిడ్ ల్యాండ్ మెట్రోపాలిటన్ విశ్వవిద్యాలయ ఆస్పత్రి ఆచార్యుడు డెరెక్ కానల్లీ ఈ పరిశోధనలో పాల్గొన్నారు. "విమానాలు, ముఖ్యంగా మోటారు వాహనాలు వెదజల్లే కర్బన ఉద్గారాలు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా హ ృదయ, రక్తనాళాల వ్యాధులకు దారితీస్తున్నాయి. స్థూలకాయం కన్నా వాయు కాలుష్యమే ఈ వ్యాధులకు మూలకారణం. వాహనాల పొగలకు తోడు పంట వ్యర్థాల దహనం వల్ల ఏర్పడుతున్న వాయు కాలుష్యంతో ఉత్తర భారతంలో కోట్లమంది ప్రభావితం అవుతున్నారు." అని పరిశోధన వెల్లడించింది. ప్రపంచంలో అత్యంత తీవ్రంగా వాయు కాలుష్యం బారిన పడిన నగరంగా దిల్లీ రికార్డులకెక్కింది. ఈ డిసెంబరులో దిల్లీ ఆస్పత్రుల్లో చేరిన శ్వాసకోశ రోగుల సంఖ్య 20 నుంచి 30 శాతం పెరిగింది. వీరిలో యువజనులు, మొదటిసారి శ్వాసకోశ వ్యాధుల బారినపడినవారు కూడా ఉన్నారు. వాయు కాలుష్యం వల్ల శ్వాసకోశ రోగాలతోపాటు హ ృదయ, రక్తనాళ వ్యాధులు, నాడీ సంబంధ వ్యాధులు కూడా వస్తాయని శ్వాస కోశ వైద్య నిపుణులు రజయ్ నారాయణ్ పేర్కొన్నారు. అలాగే వాయుకాలుష్యం శారీరక ఆరోగ్యాన్నే కాదని, మానసిక ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఐక్యూ పడిపోవడంతో పాటు అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) వచ్చే ప్రమాదమూ పెరుగుతుందని వివరించారు. మానసిక ఆరోగ్యానికి, వాయు కాలుష్యానికి మధ్య ఉన్న సంబంధంపై జరుగుతున్న వివిధ పరిశోధనల గురించి కొందరు సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు వెల్లడించిన వివరాల ప్రకారం వాయు కాలుష్యం ప్రభావానికి ఎక్కువగా లోనైతే ఒత్తిడి, కంగారు, జ్ఞాపకశక్తి క్షీణత మొదలైన సమస్యలు తలెత్తుతాయి. కొన్నిసార్లు అల్జీమర్స్, పార్కిన్సన్స్ బారినా పడొచ్చు. అంతగా కాలుష్యం లేని నగరాలతో పోలిస్తే కాలుష్యంతో సతమతమవుతున్న దిల్లీలో ఒత్తిడి, ఆందోళనతో ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య 40 శాతం ఎక్కువగా ఉందని సైకియాట్రిస్ట్ డాక్టర్ అంజల్ మిగ్లానీ వివరించారు. వాయు కాలుష్యాన్ని మెంటల్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించి, ఆ కోణంలో విధివిధానాలను రూపొందించాలని ప్రభుత్వాలకు ఎయిమ్స్‌లో సైకాలజిస్ట్ డా.దీపికా దహిమా, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ జితేందర్ నాగ్‌పాల్ సూచించారు.

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా సురేశ్ బాబు

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహరించనున్నారు. నూతన కార్యవర్గం 2027 వరకు కొనసాగనుంది. మన ప్యానల్ పేరిట చిన్న నిర్మాతలు, ప్రోగ్రెసివ్ ప్యానల్ పేరుతో పెద్ద నిర్మాతలు ఆదివారం పోటీ పడ్డారు. 48 మంది కార్యవర్గానికి జరిగిన ఈ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి 31 మంది, మన ప్యానెల్ నుంచి 17 మంది గెలుపొందారు.

ఉక్రెయిన్‌కు కెనడా అదనపు సాయం

టొరంటో: ఉక్రెయిన్‌కు కెనడా ఆపన్నహస్తం అందించింది. అదనంగా 2.5 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం ప్రకటించింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి నిధి పొందేందుకు తమ తోడ్పాటు ఉక్రెయిన్‌కు సహాయపడుతుందని కెనడా ప్రధాని మార్క్ కార్నీ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీకి ముందు కెనడా ప్రధానితో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమావేశమయ్యారు. శాంతి స్థాపనపై చర్చించారు. ఉక్రెయిన్‌కు అదనంగా 2.5 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని ఈ సందర్భంగా కార్నీ ప్రకటించారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా భారీగా డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో దాడులు చేయడాన్ని జెలెన్‌స్కీ ఖండించారు. తాము శాంతి కావాలంటే... మాస్కో యుద్ధాన్ని కొనసాగిస్తోందని ఆయనన్నారు. తాము అందించిన సాయం ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి ఉపయోగమవుతుందని కార్నీ తెలిపారు. ట్రంప్‌తో భేటీ కోసం ఫ్లోరిడా వెళ్లేందుకు ముందు హాలిఫాక్స్‌లో ఆగిన జెలెన్‌స్కీ... అక్కడ నుంచే యూరప్ నాయకులతో వీడియో సమావేశాన్ని నిర్వహించినట్లు తెలుస్తోంది. 20 అంశాల శాంతి ప్రణాళిక అజెండాగా ట్రంప్‌తో చర్చలు జరగబోతున్నాయి. శాంతి కోసం కీవ్ చేస్తున్న కసరత్తుకు బదులుగా అర్ధరాత్రి దాదాపు 10 గంటల పాటు బాంబుల వర్షం కురిపించడం ద్వారా మాస్కో బదులిచ్చిందని జెలెన్‌స్కీ తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తంచేశారు. తద్వారా పుతిన్ ఏ మాత్రం శాంతిని కోరుకోవడం లేదని స్పష్టమైందని వ్యాఖ్యానించారు.

నేడు ఏపీ మంత్రి మండలి సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి మండలి అమోదం తెలపనుంది. శాఖమూరు లో 23 ఎకరాల్లో ఆయుష్ మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో భవనాల నిర్మాణం, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు తుళ్లూరులో ఆరు ఎకరాల భూ కేటాయింపునకు అమోదం తెలపనున్నట్లు సమాచారం. 8400 క్యూసెక్కుల కెపాసిటీతో రూ.444 కోట్లతో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ ఏర్పాటు, ఎల్పీఎస్ జోన్-8లో లే-అవుట్ల అభివృద్ధికి రూ.1,358 కోట్లు కేటాయింపు, 202 ఎకరాల భూమి జరీబు, మెట్ట ప్రాంతమా అని నిర్ధారణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటుకు మంత్రి మండలి అమోదం తెలపనుంది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులతోపాటు, రుషికొండ నిర్మాణాలకు సంబంధించి క్యాబినెట్ లో చర్చ జరగనుంది. మెడికల్ కాలేజీల పీపీపీ విధానం, టెండర్లు... తాజా రాజకీయ పరిణామాలపై సీఎం చంద్రబాబు మంత్రులకు దిశా నిర్దేశం చేయనున్నారు.

తిరగబడ్డ గిరిజనం

(మొదటిపేజీ తరువాయి)

దాదాపు 300 మంది నిరసనకారులు ఆ ప్రదేశంలో గుమికూడారు. వారిలో కొందరు రోడ్లను దిగ్బంధించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని ఆరోపించారు. రెవెన్యూ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు ఉదయం 10 గంటల ప్రాంతంలో జోక్యం చేసుకుని వారిని వారి నియమించబడిన నిరసన స్థలానికి తిరిగి వెళ్లేందుకు ఒప్పించారు. అయితే సమీప గ్రామాల నుంచి ప్రజలు నిరసనలో చేరడంతో జనసమూహం పెరిగింది. దీంతో దాదాపు 1,000 మంది వరకు చేరారు. 'శాంతిని కాపాడాలని అధికారులు లౌడ్ స్పీకర్ల ద్వారా అనేక సార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో ఆందోళన హింసాత్మకంగా మారిందని, పోలీసు బారికేడ్లను బద్దలు కొట్టి, రాళ్లు, కర్రలతో సిబ్బందిపై దాడి చేశారని' ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్-డివిజనల్ పోలీస్ ఆఫీసర్ అనిల్ విశ్వకర్మ, తమ్నార్ పోలీస్ స్టేషన్ ఇంఛార్జ్ కమల పుసం, ఒక కానిస్టేబుల్ ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. అనేక మంది ఇతర పోలీసు సిబ్బంది కూడా గాయపడ్డారు. ఆ తర్వాత నిరసనకారులు ఒక పోలీసు బస్సు, ఒక జీపు, ఒక అంబులెన్స్‌ను తగలబెట్టిందని, అనేక ఇతర ప్రభుత్వ వాహనాలను ధ్వంసం చేసిందని పోలీసులు తెలిపారు. అటుతర్వాత నిరసనకారులు జిందాల్ కంపెనీ బొగ్గు నిర్వహణ ప్లాంట్ (సీహెచ్‌పీ) వైపు కదిలి, లోపలికి బలవంతంగా ప్రవేశించి, కన్వేయర్ బెల్ట్, రెండు ట్రాక్టర్లు, ఇతర వాహనాలను తగలబెట్టారని, కార్యాలయ ప్రాంగణాన్ని ధ్వంసం చేశారని ఆ ప్రకటన పేర్కొంది. ఈ సంఘటన గురించి విన్న స్థానిక శాసన సభ్యుడు విద్యావతి సిదార్, రాయ్‌గఢ్ కలెక్టర్ మయాంక్ చతుర్వేది, పోలీసు సూపరింటెండెంట్ దివ్యాంగ్ పటేల్ నివాసితులను శాంతింపజేయడానికి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే పరిస్థితి సద్దుమణగలేదు. నిరసనకారులు మళ్లీ రాళ్లు విసిరారు. సీహెచ్‌పీ ప్లాంట్ లోపల మరొక మంటలు చెలరేగినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. అయితే పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ నియంత్రణలో ఉందని, ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశామని పోలీసులు తెలిపారు.

మైనింగ్ ప్రాజెక్టు రద్దు చేయాల్సిందేనని డిమాండ్

డిసెంబరు 27న పోలీసులు ప్రదర్శన స్థలం నుంచి నిరసనకారులను తొలగించడానికి ప్రయత్నించిన తర్వాత పరిస్థితి ఉద్రిక్తంగా మారిందని స్థానిక నివాసితులు ఆరోపించారు. ఆందోళనకారులలో ఒకరైన తమ్నార్ ప్రాంతంలోని కాస్డోల్ గ్రామానికి చెందిన రాజేష్ సింగ్ మార్కం శనివారం రాయ్‌గఢ్ ఎస్పీకి స్థానిక ఎస్‌హెచ్‌వో నుంచి బెదిరింపులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేశారు. కాగా ఈ ఘర్షణలకు సంబంధించిన కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. జనసమూహంలో ఉన్న మహిళలు ఒక మహిళా పోలీసు అధికారిపై దాడి చేయడాన్ని వారు చూపించగా, మరికొందరు ఆమెను కాపాడటానికి ప్రయత్నిస్తున్నట్లు కనిపించారు. ఇదిలాఉండగా, కాంగ్రెస్ పార్టీ చత్తీస్‌గఢ్ అధ్యక్షుడు దీపక్ బైజ్ ఈ ఘర్షణను దురదృష్టకరమని, రాష్ట్ర ప్రభుత్వ 'మొండితనమే' దీనికి కారణమని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్తులను, గిరిజన ప్రజలను బొగ్గు తవ్వకాల కోసం వారి అడవులు, భూమి నుంచి బలవంతంగా బహిష్కరిస్తోందని బియాజ్ విమర్శించారు. బొగ్గు గనుల బలవంతపు కేటాయింపు, తమ్నార్‌లోని గారే పెల్మా సెక్టార్-1 లో 'నకిలీ' ప్రజా విచారణను నిరసిస్తున్న గ్రామస్తులు, గిరిజన ప్రజలపై పారిశ్రామిక వేత్తల ఆదేశాల మేరకు పోలీసుల లాఠీచార్జి చేశారని తెలిపారు. ఆ తర్వాత ఆందోళన చెందిన గ్రామస్తులు ప్రతీకారం తీర్చుకున్నారని ఆయన పేర్కొన్నారు.

రాజ్యమేలుతున్న ధనస్వామ్యం - భూస్వామ్యం

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. యుద్ధోన్మాదానికి కూడా బీజేపీ తెరలేపిందన్నారు. మతోన్మాదులు, యుద్ధోన్మాదులు దేశానికి ప్రమాదకరమన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో ఐదు లక్షల మందితో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందని వక్కాణించారు. ఎంతోమంది అమరవీరులను అందించిందని, భూమిలేని నిరుపేదలకు భూమి కోసం భూపోరాటాలు చేసిందని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ-రైతాంగ పోరాటాన్ని చేసిందన్నారు. వామపక్షాలు ఐక్య పోరాటాలను ఉధృతం చేస్తూ లౌకిక-ప్రజాస్వామిక శక్తుల్ని ఏకం చేస్తూ... ప్రజాస్వామ్య పోరాటాలతో ముందుకెళ్లాలని కూనంనేని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖమ్మం సభకు అన్ని జిల్లాల నుంచి తరలిరావాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోరిమి రాజ్కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, నాయకులు మోటపలుకుల రమేశ్, సుధాకర్ రెడ్డి, సోతుకు ప్రవీణ్, కొరిమి సుగుణ, కేతరాజు సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం రద్దుకు బీజేపీ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం నాడు కేటాయిస్తే... ఆ పథకం బుట్టదాఖలుకు కుట్ర జరుగుతోందన్నారు. స్వాతంత్రం వచ్చి ఆరు నెలలు గడవక ముందే ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులు మహాత్మాగాంధీని హత్య చేయడం అత్యంత దారుణమన్నారు. ప్రపంచ ఆదరణ పొందిన గాంధీ పేరును ఉపాధి హామీ పథకం నుంచి తొలగించడం ఆక్షేపణీయమని, దీనిని వ్యతిరేకించడం కోసం అధిష్ఠానం పిలుపుమేరకు గ్రామ గ్రామాన పోరాటాన్ని కాంగ్రెస్ ఉధృతం చేస్తుందని అన్నారు. జనవరి 26న రాష్ట్రమంతటా కాంగ్రెస్ జెండా పండుగ జరగాలని పార్టీ శ్రేణులకు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపైన కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. పార్టీ కండువాలు ధరించాలని, కాంగ్రెస్ భావజాలాన్ని వివరిస్తూ కరపత్రాలు పంచాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. లౌకికవాదం, మహిళా సాధికరత, అంటరానితనం నిర్మూలన, ఓటు హక్కు కల్పించింది కాంగ్రెస్ అని అన్నారు. స్వాతంత్రం సాధించినప్పుడు గుండుసూది కూడా ఉత్పత్తి చేయలేని పరిస్థితిని కాంగ్రెస్ నాయకత్వంలో అధిగమించగలిగామని గుర్తుచేశారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం తెచ్చింది కాంగ్రెస్సేనన్నారు. కాంగ్రెస్ పంచవర్ష ప్రణాళికలతో ప్రపంచానికి ఆహార ధాన్యాలు సరఫరా చేసే స్థాయికి భారత్ ఎదగగలిగిందని భట్టి విక్రమార్క అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో బతికేందుకు 20 సూత్రాల కార్యక్రమం, భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయాకరణ, బ్యాంకు రుణ సదుపాయం వంటివన్నీ కాంగ్రెస్ నాయకత్వంలోనే వచ్చాయన్నారు. ఆర్టీఐ చట్టం, యూజీసీ, నవోదయ విద్యాలయాలను కాంగ్రెస్ తెచ్చిందని గుర్తుచేశారు. శాస్త్రీయ సాంకేతిక వికాసానికి తొలి ప్రధాని నెహ్రూ నుంచి యువ ప్రధాని రాజీవ్ గాంధీ కాలం వరకు అనేక వ్యవస్థలు ఏర్పాటయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఐఐటీలు, ఐఐఎంలు కాంగ్రెస్ పాలనలోనే స్థాపించబడ్డాయన్నారు. ఓటు హక్కు పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. భారతజాతి ఔన్నత్యం కోసం ప్రతి కార్యకర్త కంకణబద్ధుడై పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం, మహిళా సాధికారత, బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, ఎస్సీ ఎస్టీలకు సబ్ ప్లాన్ ద్వారా నిధుల కేటాయింపు, ఆత్మీయత- ప్రేమాను రాగాలు- సౌభ్రాతృత్వం కాంగ్రెస్ మూల సిద్ధాంతమని చెప్పారు. దేశ సమగ్రత, సమైక్యత కోసం మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ తమ జీవితాలు అంకితమిచ్చారని భట్టి విక్రమార్క అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర పంచాయతీ రాజ్ సంఘటన ఇంచార్జి సుభాష్ ఎక్కర, కాంగ్రెస్ నాయకులు నాగండ్ల దీపక్ చౌదరి, మహమ్మద్ జావేద్, చోటాబాబా, వద్దేబోయిన నరసింహారావు, యడ్లపల్లి సంతోష్, జెర్రిపోతుల అంజనీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామం డిజిటలైజ్

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం శంషాబాద్‌లోని కేఎల్ సీసీ ఫంక్షన్ హాల్‌లో మంత్రి సన్మానించారు. పదవీ కాలం పూర్తయ్యేలోపు, 'మా సర్పంచ్ మా గ్రామాన్ని పూర్తిగా మార్చేశాడు' అని ప్రజలతో చెప్పించుకోగలగాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి అందేలా పారదర్శకంగా పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. గ్రామ స్వరాజ్యానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాబోయే రోజుల్లో గ్రామ పంచాయతీలకు దండిగా నిధులు కేటాయిస్తుందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేయాలని కొత్త సర్పంచ్‌లకు మంత్రి సూచించారు. గ్రామాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేయాలని, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని శ్రీధర్‌బాబు దిశానిర్దేశం చేశారు. సర్పంచ్‌లకు దశలవారీగా ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. అదే సమయంలో శాసనసభ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న విషయాన్ని ప్రస్తావిస్తూ సమావేశాలు హుందాగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని తిప్పికొడతామని శ్రీధర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, గారు, రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ధారా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌కు అధికారులు హాజరుకావాలి

విశాలాంధ్ర - భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. గిరిజనులు వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై దర్బార్ లో లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలన్నారు. సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో విధిగా హాజరుకావాలన్నారు. గతంలో వచ్చిన అభ్యర్థనలు, ఫిర్యాదులకు సంబంధించిన అన్ని వివరాలు ఈ దర్బార్ లో సమీక్షించాలన్నారు. తమ పరిధిలోని సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గిరిజనుల ముఖ్యమైన సమస్యల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని స్పష్టం చేశారు.

గ్రామీణ వైద్యంలో ఆర్ఎంపీల పాత్ర కీలకం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర, అశ్వరావుపేట : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అత్యవసర సమయాల్లో వైద్యం అందిస్తూ ఎంతో సేవచేస్తున్న ఆర్ఎంపీ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కొనియాడారు. ఆదివారం వినాయకపురంలోని చిలకలగండి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఆర్ఎంపీల సంక్షేమ సంఘం ఆర్.ఎం.పి డబ్ల్యూఏ మండల స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో వైద్య సదుపాయాలు తక్కువగా ఉన్నచోట ఆర్ఎంపీలే వేలాది మందికి ప్రాథమిక చికిత్స అందిస్తున్నారన్నారు. చిన్న చిన్న రోగాలు వస్తే పట్టణాలకు వెళ్లే పరిస్థితులు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉండవని తెలిపారు. ఆర్ఎంపీలు తమ పరిమితులకు లోబడి మాత్రమే వైద్యం అందించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించవద్దని సూచించారు. ఆర్ఎంపీల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తనకు మొదటి నుంచీ విద్య, వైద్య రంగాలు అంటే ఎంతో మక్కువన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఈ రెండు రంగాలకే తొలి ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ డబ్ల్యూఏ జిల్లా అధ్యక్షులు కొమరయ్య, ప్రతినిధులు రామ్మూర్తి, రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, మండలంలోని గ్రామీణ వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మేడారంలో భక్తుల సందడి

విశాలాంధ్రములుగు జిల్లా బ్యూరో: మేడారం సమ్మక్క-సారలమ్మ ఆలయానికి జాతరకు నెలరోజుల ముందే నుండి భక్తులు వస్తున్నారు. ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ములుగు జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రామనాథ్ కేకాన్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది పోలీస్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టగా, అదనపు ఎస్పీ (ఓ ఎస్ డి) శివమ్ ఉపాధ్యాయ, అదనపు ఎస్ పీ సదానందం, ఏఎస్పీ మనన్‌బట్, డీఎస్పీ ములుగు, జిల్లాలోని అన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు బందోబస్తులో పాల్గొన్నారు. ప్రస్తుతం ఆలయ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నప్పటికీ, ముందస్తు ప్రణాళికతో పోలీసులు సమర్థవంతంగా జనసందోహాన్ని నియంత్రించారు. ప్రత్యేకంగా రూపొందించిన ట్రాఫిక్ నిర్వహణ ప్రణాళిక ద్వారా ఆలయం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఎస్ పి చర్యలు తీసుకున్నారు. భక్తులకు సాఫీగా, శాంతియుతంగా దర్శనం కల్పించడంలో పోలీసులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్‌కు ప్రాధాన్యత

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : స్థానిక సంస్థల ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్‌కు ప్రాధాన్యత ఇస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశంలో వారు మాట్లాడారు.యూత్ కాంగ్రెస్ పార్టీకి గుండెకాయ లాంటిదని, స్వర్గీయ మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి చూపిన మార్గంలోనే యువతకు అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలని సూచించారు.యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. అనంతరం ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన యూత్ కాంగ్రెస్ నాయకులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో పార్టీ నేతలు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకుల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: హవేలి ఘనపూర్ మండలం జక్కన్నపేటలో ప్రమాదవశాత్తు చాపల కిష్టయ్య నివాస పూరిగుడిసె దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిదైన విషయం తెలుసుకుని బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి అందజేశారు. యంగ్ స్టార్ ఫౌండేషన్ ప్రతినిధులు రాగి వనజ, గౌరీ సంతోష్, మౌనిక, సుమన, స్థానిక సర్పంచ్ చామంతుల సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, తేజిందర్ సింగ్ తదితరులు బాధితుడికి భరోసానిచ్చారు. మెదక్ పట్టణానికి చెందిన పిప్పిరి రవి వంట సామాగ్రి అందజేసి ఆదుకున్నారు.

సమగ్రాభివృద్ధికి పంచాయతీలే పట్టుకొమ్మలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- చర్ల : గ్రామాల సమగ్రాభివృద్ధికి గ్రామ పంచాయతీలే పట్టుకొమ్మలని భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ఆదివారం చర్ల మండల పరిధిలోని గోంపల్లి, కేశవాపురం, కలివేరు, మరియు సత్యనారా యణపురం గ్రామాలలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త భవనాల అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు స్థానిక పాలన మరింత చేరువవుతుందన్నారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ఇవి వేదికలుగా నిలుస్తాయని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పనే తన లక్ష్యమన్నారు. పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచులను, వార్డ్ నెంబర్లను తెల్లం వెంకట్రావు అభినందించినారు. పంచాయతీలలో అభివృద్ధి కొరకు తన వంతు పూర్తి సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పంచాయతీలలో ఏ సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని సర్పంచులను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు నల్లపు దుర్గాప్రసాద్, చీమలమర్రి మురళీకృష్ణ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆవుల విజయ భాస్కర్ రెడ్డి, పోలిన లంక రాజు, బ్రహ్మానంద రెడ్డి, ముమ్మినేని అరవింద్, జవాది రవికుమార్, బి. రామకృష్ణ, జి. భాస్కరరావు, నాయుడు సతీష్, బుచ్చిబాబు, వాసు, సర్పంచ్ పూజారి సామ్రాజ్యం కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

18న సీపీఐ సభకు భారీ జన సమీకరణ చేయాలి

విశాలాంధ్ర ఖమ్మం రూరల్ : మండలం నుంచి జనవరి 18న జరిగే సభకు భారీ జన సమీకరణ చేయాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా కోరారు. ప్రతి గ్రామం నుంచి ప్రత్యేక వాహనాల్లో సభకు తరలి వచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఖమ్మం రూరల్ మండల సమితి సమావేశం ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మౌలానా మాట్లాడుతూ జనవరి 18న జరిగే సభకు ఒక గొప్ప విశిష్టత ఉందని భారతదేశంలో ఏ అధికారం లేకుండా వందేళ్ల పాటు ప్రజల పక్షాన పనిచేసిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. నాటి స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, ఆ తర్వాత స్వతంత్ర భారతదేశంలోనూ అనేక నిర్బంధాలను ఎదుర్కొని అనేక త్యాగాలు చేసినటువంటి పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఏ రాజకీయ పార్టీకి లేని ఒక గొప్ప చారిత్రిక పోరాట నేపథ్యం సిపిఐకి ఉందన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం అనేక కుట్ర కేసులను నమోదు చేశారని వేల మంది కమ్యూనిస్టు కార్యకర్తలను జైళ్ల పాలు చేశారని అదే పంథాను భారతదేశ పాలకులు సైతం కొనసాగించారన్నారు. కమ్యూనిస్టుల త్యాగాలు లేకుంటే భారతదేశపు -నడిబొడ్డున తెలంగాణ మరో కాశ్మీర్లో రగులుతూనే ఉండేదని మౌలానా తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో -నాలుగున్నర వేల మంది అమరులయ్యారని ఆ పోరాటం తెలంగాణ ప్రజల జీవనగతిని మార్చివేసిందన్నారు. భారతదేశం ఒక సంక్లిష్టస్థితిని ఎదుర్కొంటుందని నేటి యువతకు గత పోరాట నేపథ్యాన్ని వివరించి భవిష్యత్తు మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా -జరిగే పోరాటాలకు యువతను కార్యోన్ముఖులను చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర -సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, నాయకులు ఉన్నం -రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించేలా బీసీ రిజర్వేషన్ల ఉద్యమం: వెంకట్

విశాలాంధ్ర, ఇల్లందు : చరిత్ర తిరగరాసేలా బీసీ రిజర్వేషన్ల ఉద్యమం ఉంటుందని, అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించుకునేందుకు బీసీ సంఘాలంతా ఏకమై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని బిసి సంఘాల రాష్ట్ర జేఏసీ కన్వీనర్ మడత వెంకట్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏక్తా భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అగ్రవర్ణానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ సంఘాల అభివృద్ధి కోసం 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న సంకల్పంతో అసెంబ్లీలో చట్టసభల్లో ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. బీసీల కోసం సీఎం పట్టుదల, కృషికి ప్రత్యేక అభినందనలు ఈ సందర్భంగా తెలియజేశారు. దీన్ని పూర్తిస్థాయిలో సాధించాలంటే బీసీ సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్ర నాయకత్వంతో పాటు రాష్ట్రంలోని అన్ని పార్టీలకు చెందిన అధినాయకులు అందరిని కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. 42 శాతం రిజర్వేషన్ కల్పన కోసం ఈనెల 31న హైదరాబాదులో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘ ఉద్యమ కార్యచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. బస్సు యాత్ర, పాదయాత్ర, సకలజనుల వంట వార్పు, కులవృత్తులతో ప్రదర్శనలు, రైలు రోకో, తదితర అంశాలతో దశల వారి ఉద్యమాలను చేపట్టనున్నట్ల తెలిపారు. అన్ని పార్టీలో ఉన్న బీసీ సంఘాల మద్దతు కూడగట్టి రిజర్వేషన్ సాధనకై రాష్ట్రవ్యాప్త పోరాటాలకు బీసీ సంఘం జేఏసీ సిద్ధమైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏక్తా హౌస్ సభ్యులు, బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాలికలు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి: మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర-నల్గొండబ్యూరో : బాలికలు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మాడుగులపల్లి మండల కేంద్రంలో రూ.6.74 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ పాఠశాల-కళాశాల భవనాలను ఆయన ఆదివారం ప్రారంభించారు. అలాగే రూ.64.50 లక్షలతో నిర్మించనున్న ప్రహరికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేజీబీవీ నుంచి మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు ప్రోత్సాహం అందిస్తామని, ఈ ఏడాది ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థినుల చదువు ఖర్చులు భరిస్తానన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రజలు ప్రైవేట్ పాఠశాలల వైపు మళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర కీలకం

విశాలాంధ్ర బ్యూరో, సంగారెడ్డి : దేశ నిర్మాణంలో ఎంతో మంది కాంగ్రెస్ నాయకుల తమ ఆస్తులు, ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ముందుకు వెళ్లారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో కాంగ్రెస్ పార్టీ 140 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జండా ఆవిష్కరించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నిర్మలాజగ్గారెడ్డి .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ అన్నారు 140 ఏళ్ల చరిత్ర కలిగిన గొప్ప పార్టీ అన్నారు. ఈ రోజులో బీజేపీ పార్టీ కి సంబంధించిన సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ పై దుష్ప్రచారాలు కాంగ్రెస్ నాయకులు ఫోటోలు మార్ఫింగ్ చేసి యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని యువత వారి కుట్ర ను గ్రహించాలని అన్నారు ఇట్టి కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ఆంజనేయులు,సిడిసి వారికి రామ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సదాశివపేట మండల అధ్యక్షులు సిద్దన్న, సంగారెడ్డి పట్టణ అధ్యక్షులు జార్జ్, బుచ్చి రాములు, నర్సింహారెడ్డి,నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్,మహేష్, శ్రీకాంతగౌడ్, బల్వంత్ రెడ్డి, అనిల్, చారి, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి : ఎస్ఐ

విశాలాంధ్ర- కొండమల్లేపల్లి : నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే వారు జాగ్రత్తలు పాటించాలని కొండమల్లేపల్లి ఎస్సై అజ్మీర రమేష్ తెలిపారు మద్యం మత్తులో వాహనాలు నడపడం అధిక వేగం బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు జరుపుకోవడం అనుమతి లేకుండా డీజేలు మైనర్లకు వాహనాలు ఇవ్వడం ట్రిబుల్ రైడింగ్ చేయడం ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు రాత్రి వేళల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పెట్రోలింగ్ తో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు.

పేద ప్రజల గొంతుక సీపీఐ : శ్రీరామ్

విశాలాంధ్ర-వనపర్తి : దేశంలోని పేద ప్రజల గొంతుక సిపిఐ అని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ అన్నారు. సిపిఐ ఆవిర్భవించి 1925 , డిసెంబర్ 26 కు వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో పానుగల్ మండలం కేతేపల్లిలో శతజయంతి వారోత్సవాలను నిర్వహించారు. గ్రామపంచాయతీ వద్ద సిపిఐ జెండాను సీనియర్ నేత కమ్మావుల పెంటయ్య ఆవిష్కరించగా శ్రీరామ్ మాట్లాడుతూ.. శ్రమజీవుల కష్టాలను కడగళ్లను చట్టసభల్లో ప్రజా పోరాటాల్లో వినిపించి పరిష్కారం సాధించిందన్నారు. ప్రతి క్షణం పేదవాడి రక్షణ అభివృద్ధే ధ్యేయంగా సిపిఐ పనిచేస్తోందన్నారు. 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్ కాన్పూర్ లో ఆవిర్భవించిన సిపిఐ స్వాతంత్ర సమరంలో దూకి,సంపూర్ణ స్వాతంత్రం ఇవ్వాలని తొలిసారిగా పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. వందేళ్ళ ప్రయాణంలోకార్మిక కర్షక బడుగు బలహీన వర్గాల కు అనుకూల చట్టాల నుపోరాడి సాధించిందన్నారు. కష్టమొచ్చినా అన్యాయం జరిగినా పేదలకు మొదట కనిపించేది ఎర్రజెండా సిపిఐ మాత్రమే అన్నారు. దున్నే వాడికి భూమి, గూడు లేని వారికి నీడ అప్పుల్లో ఉన్న వారికి పోరాటాల ద్వారా రుణ విముక్తి కలిగించిందన్నారు.ఆకలితో అలమటిస్తున్న గ్రామీణకూలీలకుఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల పని సిపిఐ కల్పించిందన్నారు. బిజెపి ఈ పథకం పేరు మార్చి నిధులు తగ్గించి నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని తిప్పి కొట్టాలన్నారు. నైజాం నవాబు ఉక్కు పాదాల కింద తెలంగాణ నలిగిపోతున్న తెలంగాణలో సాయుధరైతాంగ పోరాటం సాగించిందని,4500 మంది పోరాటంలో అమరులయ్యారన్నారు. బాంచన్ నీకాల్మొక్త అనే సామాన్యులచే బంధూకులు పట్టించి దొరలు భూస్వాములను తరిమి కొట్టిందన్నారు. దొరల పీడన నుంచి 3000 గ్రామాలను దొరల నుంచి విముక్తం చేసి ఎర్రజెండాలు పాతిన మొనగాడు సిపిఐ అన్నారు. 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిందన్నారు. దేశంలో బిజెపి మతత్వాన్ని రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటోందని, సంపన్నులు అనుకూల పేదల వ్యతిరేక పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు.హామీలను విస్మరించి, వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించే కుట్ర చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు కావటం లేదన్నారు. ఉపేక్షిస్తే ప్రజలతో తిరస్కరణ తప్పదు అన్నారు. పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమని, ప్రజలు ఎర్రజెండా కింద సంఘటితమై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కేతేపల్లి గ్రామ ఉపసర్పంచ్ కృష్ణవేణి,సిపిఐ మండల కార్యదర్శి డంగు కురుమయ్య, మాజీ వార్డు సభ్యులు లక్ష్మీనారాయణ పెంటయ్య, గ్రామ శాఖ కార్యదర్శి కాకం చిన్న నారాయణ, నేతలు కాకం కాశన్న, పరశురాముడు, సంతోష్, రామాంజనేయులు,ఎలగొడ్డు రాముడు, నరసింహ, బోయ చిన్న కురుమయ్య, వెంకటమ్మ, శంకరమ్మ, అంజనమ్మ, దేవమ్మ, బాలపీరమ్మ, ఎల్లమ్మ, దొడ్ల బీరయ్య, ఎజ్జు బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజావాణి

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ : జిల్లా ఈ సోమవారం (29 వ తేదీ) నుంచి ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఇన్ని రోజులు వాయిదా పడిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం నుంచి తిరిగి ప్రారంభమవుతుందని అన్నారు. ప్రజలు ఎవరైనా తమ సమస్యల గురించి దరఖాస్తులు ఇవ్వదలుచుకుంటే, ఈ విషయాన్ని గమనించి, కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై నేరుగా తమ సమస్యలపై ఫిర్యాదులను సమర్పించవచ్చునని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు

గ్రామాభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ను ఆదివారం వైరా మండలం సిరిపురం గ్రామ బిఆర్ఎస్ కూటమి సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సిరిపురం గ్రామ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని ప్రతి గ్రామ పంచాయతీని అభివృద్ధిలో ముందుకు నడుపుతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫైడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కామినేని శ్రీనివాసరావు, పర్చూరి రామారావు ,అయినాల కనకరత్నం తదితరులు పాల్గొన్నారు

యాప్ ద్వారానే యూరియా అమ్మకాలు

విశాలాంధ్ర కారేపల్లి: మండలంలోని యూరియా కావలసిన రైతులందరూ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని యాప్ లోనే యూరియా బుక్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్ ఆదివారం తెలిపారు. నేటినుండి ప్రతి రైతు తమ సెల్ ఫోన్ లోని ప్లే స్టోర్ ద్వారా యాప్ ను డౌన్లోడ్ చేసుకొని యాప్ ద్వారా బుక్ చేసుకున్న వారికి మాత్రమే యూరియాను అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని యూరియా కావలసిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సూచించారు.

దంపతుల సేవలు అభినందనీయం

విశాలాంధ్ర, దమ్మపేట : ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూనే, సామాజిక బాధ్యతను చాటుకున్న మెచ్చు వెంకటేశ్వర్లు, విజయరాణి దంపతుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అభినందించారు. ఆదివారం మండలంలోని పట్వారిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు దంపతులు తమ కుమార్తె తేజస్విని జ్ఞాపకార్థం సుమారు రూ. 50 వేల సొంత ఖర్చుతో పుస్తకాలు, అలమారలు, ఇతర వసతులు కల్పించారు. తమ వ్యక్తిగత బాధ్యతగా విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమం చేయడం ఇతరులకు ఆదర్శమని ఎమ్మెల్యే జారే కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కీసరి లక్ష్మి, మద్దిశెట్టి సత్యప్రసాద్, వాసం రాణి, కాకా రమేష్, పాదిలి జ్యోతి, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికి శతాబ్ది సంబురాల సందేశం...

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు సంబురాల సందేశాన్ని ఇంటింటికి చేరవేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కోరారు. జనవరి 18న జరిగే చారిత్రిక సభకు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని ఖానాపురం హవేలి శాఖ ఆధ్వర్యంలో సిపిఐ బహిరంగ సభ ప్రచార వాహనాన్ని హేమంతరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో వారం రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖానాపురం హవేలితో పాటు ఖమ్మం నగరంలోని అన్ని టౌన్ల శాఖలు కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నాయన్నారు . ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా -సమితి సభ్యులు వరదా నర్సింహారావు, జాకీర్, నాయకులు ఆముదాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఈ సభచిరస్థాయిగా నిలిచిపోతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సిపిఐ నగర కౌన్సిల్ సమావేశం ఆదివారం స్థానిక బోనకల్ రోడ్డులో వరదా నర్సింహారావు అధ్యక్షతన జరిగింది . సమావేశంలో నూనె శశిధర్, జాకీర్, యాకూబ్, సైదా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ-నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత్ జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం జరుపుకున్నారు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొణతం చిన్న వెంకటరెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల సందీప్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సురేష్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొణతం చిన్న సీతారాంరెడ్డి పేరబోయిన వీరయ్య,మాజీ సర్పంచ్లు చింతమల్ల సైదులు, జంగిలి వెంకటేశ్వర్లు, ఆకార వెంకటేశ్వర్లు, దేవులపల్లి శంకరాచారి గజ్జల కోటేశ్వరరావు, కొణతం రాంరెడ్డి,ఆదిరెడ్డి, గుంటూరు శ్రీనివాస్ మంగ్యా నాయక్ శ్రీనివాస్ రెడ్డి మండల యూత్ అధ్యక్షుడు ఇసాక్, ఇంజమూరి శ్రీకాంత్, వీరబాబు, సాయి, చింతలచెరువు సైదులు,ఉదయ్, శ్రీకాంత్, సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : నల్గొండ పట్టణంలోని ఎస్వీ హైస్కూల్‌లో 1996-97 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం చిన్న వెంకటరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. దాదాపు 28 సంవత్సరాల అనంతరం దేశ విదేశాల్లో స్థిరపడిన సుమారు 30 మంది పూర్వ విద్యార్థులు ఒకేచోట కలుసుకుని బాల్య స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో లండన్ సోలిహుల్ కౌన్సిలర్ శేషేంద్ర శేషు భట్టర్, స్టేట్ టీచర్స్ యూనియన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రాథోడ్ పాల్గొని మాట్లాడారు. బాల్యం అమూల్యమైందని, పిల్లలకు కల్మషం లేని బాల్యాన్ని అందించడమే సమాజ బాధ్యతని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ అనుభూతులను పంచుకోగా, మృత పూర్వ విద్యార్థులకు నివాళులు అర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థుల నిధి ఏర్పాటు చేసి, విద్యాపరంగా అవసరమైన వారికి సహాయం చేయాలని నిర్ణయించారు.

ఏడుపాయలలో భద్రత పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో ప్రతి ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, ఆలయ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ఆదివారం పరిశీలించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే రోజుల్లో ప్రత్యేకంగా క్విక్ రెస్పాన్స్ టీమ్ బందోబస్తును ఏర్పాటు చేస్తూ, జిల్లా పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు నీటి లోతు, ప్రవాహ తీవ్రత తెలియక ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉండటంతో, సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించడం వల్ల ఇటీవల అనేక ప్రమాదాలను నివారించగలిగామని పేర్కొన్నారు. అనంతరం వనదుర్గామాతను దర్శించుకున్నారు.

సాహితీ విమర్శకు మార్గదర్శి రాల్ఫ్ ఫాక్స్

సాహితి

డా॥ జె. రవీంద్రనాథ్
8978131585

రాల్ఫ్ ఫాక్స్ రచించిన నవల -ప్రజలు (The Novel And The People) పుస్తకాన్ని సాహితీ విమర్శకుడు వల్లంపాటి వెంకట సుబ్బయ్య ఎంతో కష్టపడి తెలుగులోకి 1991 లో తెచ్చారు. రాల్ఫ్ ఫాక్స్ (1900-1936) బ్రిటీష్ కమ్యూనిస్టు , పాత్రికేయుడు, నవలా రచయిత మరియు చరిత్రకారుడు. మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన రాల్ఫ్ ఫాక్స్ ఆక్స్ఫర్డ్ విశ్వ విద్యాలయంలో చదువుకుంటూ రష్యా, చైనాలు సందర్శించి తిరిగి వచ్చి పుస్తకాలు రాశారు. ఆయన ఏ డిఫెన్స్ ఆఫ్ కమ్యునిజం, ది కలోనియల్ పాలసీ ఆఫ్ బ్రిటీష్ ఇంపీరియలిజం, బ్రిటన్‌లో వర్గ పోరాటం, లెనిన్ జీవిత చరిత్ర తదితర గ్రంథాలు రచించారు. స్పానిష్ అంతర్యుద్ధంలో ఫాసిస్టులకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక రిపబ్లిక్ తరఫున పోరాడుతూ యుద్ధ రంగంలో మరణించారు.

మార్క్సిస్టు సాహితీ విమర్శలో రాల్ఫ్ ఫాక్స్ రాసిన నవల- ప్రజలు, అలెక్ వెస్ట్ రాసిన పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభం, క్రిస్టోఫర్ కాడ్వెల్ యొక్క భ్రాంతి -వాస్తవికత పునాది రాళ్ల వంటి మూడు ప్రధాన పుస్తకాలు.

రాల్ఫ్ ఫాక్స్ పుస్తకంలోని పన్నెండు అధ్యాయాలలో దీనిలో మార్క్సిజం - సాహిత్యం, సత్యానికి, నవల -వాస్తవికతల మధ్య సంబంధం, విక్టోరియన్ యుగంలో నవల వెనుకంజ, బాల్జాక్, ఫ్లబేల లాంటి సృజనాత్మక వైతాళికుల గురించి, నవలలో నాయకునిమరణం, సామ్యవాద వాస్తవికత, సజీవ మానవుడుగా నిలిచిన ఫాసిస్టు వ్యతిరేకయోధుడు బల్గేరియన్ శ్రామిక జాతికి చెందిన కమ్యూనిస్టు డిమిట్రోవ్, మనం మరిచిన వచన రచన, సాంస్కృతిక వారసత్వం మొదలగు అంశాల గురించి మార్క్సిస్టు సాహితీ విమర్శ ఉంది.

నేటి పరిస్థితిలో ప్రగతిశీల రచయితకు, విమర్శకునికి ముందుకు సాగటానికి ఈ పుస్తకం ఎంతో ఉపకరిస్తుంది. భారతదేశంలో కుల ప్రభావం నిరాకరించడం ఎంత అవివేకమో, వర్గ ప్రభావం, చైతన్యం నిరాకరించడం అంతకన్న తక్కువ అవివేకం కాదు. ఈ వ్యవస్థ సమూలంగా మారాలంటే మార్క్సిజం అనే ఆయుధాన్ని వదిలివేయడం మూర్ఖత్వం. రాజ్య దారుణ దమనకాండవల్ల, మార్క్సిజం గురించి మోటుగా లేదా యాంత్రిక అవగాహన వల్ల మరోచివరకు కొట్టుకుపోవడం జరుగుతోంది. మార్క్సిజం అగ్రవర్ణాలకో, అగ్రవర్గాలకు చెందిన సిద్ధాంతం కానే కాదు. దానిని పీడిత బహుజనులు సొంతం చేసుకున్నప్పుడే మార్క్సిజం భౌతిక శక్తిగా మారుతుంది. ఈ వ్యవస్థలో అణగారిన కులాలు, ప్రజలకు నిజమైన, శాశ్వతమైన విమోచన లభిస్తుంది. అయితే వర్గ బలాబలాల్లో ఎక్కువతేడా ఉన్నపుడు, హింసాయుత మార్గం మరింత అణచివేతకు దారితీసే తరుణంలో రాజ్యాంగ బద్ధ పోరాటాలను తిరస్కరించకూడదు.

మార్క్సిజం చెప్పిన గతితార్కిక భౌతిక వాదం ఆర్థిక వ్యవస్థకు, కళా రూపాలకు మధ్య పరస్పర ప్రభావం గురించి వివరిస్తుంది. గతంలో యాంత్రిక అవగాహన వల్ల మార్క్సిస్ట్ విమర్శ పక్కదారి పట్టింది. ఆర్థిక పునాది ప్రధానమని, కళారూపాలు, న్యాయం, రాజకీయాలు, సంస్కృతి ఇవి అన్నీ ఉపరితలంలో ఉండి అనుబంధంగా మాత్రమే ఉంటాయి అనే యాంత్రిక అవగాహన ఆర్థిక తగ్గింపు వాదానికి దారితీసింది.

సమాజంలో భిన్న శక్తుల ఘర్షణలో ఒకోసారి అనూహ్య పరిణామాలు జరగవచ్చని, తాము అంతిమంగా మాత్రమే ఆర్థిక వ్యవస్థ ప్రాధాన్యం గురించి చెప్పామని ఎంగెల్స్ భావన కూడా ఈ పుస్తకంలో రాల్ఫ్ ఫాక్స్ ఉటంకించారు.

పాత కళా రూపాలు పెట్టుబడిదారీ విధానంలో పూర్తిగా అంతరించి పోవు. అయితే పెట్టుబడిదారీ కళా రూపాలైన నవల, కథ, సినిమా ఈ యుగంలో ప్రాబల్యంలో ఉన్నాయి. ఇప్పుడు సోషల్ మీడియా జనావళిని మరింతగా ప్రభావితం చేస్తోంది. మార్క్సిజం మానవుని విధికి బానిసగా, కళను తక్కువగా చూడదు. ప్రతి ఒక్కరిపై, రచయితలపై వర్గ ప్రభావం ఉంటుంది. వర్గ సమాజాన్ని మార్చే క్రమంలో మనిషి తన్ను తాను మార్చుకుని తీరాలి. తీరక తప్పదు కూడా. ఆచరణలో లేని మార్క్సిజం మనిషి జీవితంలో హిపోక్రసీకి దారితీస్తుంది.

నవల బూర్జువా యుగ సృష్టి. పెట్టుబడిదారీ విధానం డబ్బును మనుషుల మధ్య ప్రధాన సంబంధంగా చేసి కళాకారులను కూలీలుగా మార్చింది. పాల్ గాగిన్‌లా తాహితి ద్వీపానికి వెళ్లినా, వాంగోలా పిచ్చి పట్టినా ఈ రోజుల్లో ఈ కరెన్సీ పిశాచం ఎవర్నీ వదలదు.

రాల్ఫ్ ఫాక్స్ దృష్టిలో నవలా రచయితలు నవ సమాజానికి మహా కావ్య నిర్మాతలు. రేబలై, సెర్వాంటీస్‌లు జీవితంతో పోరాడుతూ దాన్ని ప్రేమించిన వారు. Sterne సమాజంలో ఉన్నత వర్గంతో సర్దుకు పోయేందుకు యత్నించాడు. 18వ శతాబ్దంలో నవల జనాన్ని మేలుకొల్పింది. ఫీల్డింగ్, స్విఫ్ట్, వోల్టేర్, రూసోలను చదివి బాహ్య ప్రపంచాన్ని తెలుసుకోమంది. నాటి నవల అసంపూర్ణత్వాన్ని దాటి టాల్స్టాయ్, బాల్జాక్‌లు సంపూర్ణ ఆదర్శానికి దగ్గరగా వచ్చారు. 20 వ శతాబ్దిలో నవల పరిస్థితి ఇంకా దిగజారింది అని 1936 లో మృతిచెందిన రాల్ఫ్ ఫాక్స్ భావన. 19 వ శతాబ్దంలో నవల అభివృద్ధి చెందిన క్రమంలో నాయకుడు మాయమయ్యాడు. మనిషికున్న చారిత్రక లక్షణం దూరమైతే సృజనాత్మక శక్తి దూరమవుతుంది. వాస్తవికతకు దూరంగా జీవితాన్ని ఉంచితే, కాలం, సంఘటనల మధ్య అంతర్గత తర్కం, పాత్రల మధ్య పరస్పర సంబంధం దెబ్బ తింటుంది. మనిషిని విడిగాకాక చారిత్రక మానవుడిని గుర్తించడం అంటే బూర్జువా వర్గ ప్రాపంచిక దృక్పథాన్ని తిరస్కరించడం. ఆనాటి రచయితలు కొందరు మినహా మిగతా వారు శ్రామిక వర్గ ప్రజలను, శాస్త్రవేత్తలను, కోటీశ్వరులను నాయకులుగా చిత్రించలేదు.

నవలా రచనలో సగటు సందర్భాల్లో సగటు మనిషి ప్రవర్తనలో ఒక అంశాన్ని మాత్రమే తీసుకొని అదే ప్రధానంగా భావించడంతో నవలకు మహా కావ్య రూపం పోయింది. నూతన వాస్తవిక వాదం నిరాశామయ మనిషిని కాకుండా ఉద్యమిస్తున్న మనిషిని, చరిత్రలో పురోగామిని చిత్రించాలి. విప్లవ రచయిత వాస్తవికతను చూసి భీతిల్లకుండా సంపూర్ణ మానవుడిని చిత్రించడానికి వెనుకాడరాదు. మనో విశ్లేషణాత్మక రచన అంతరంగం లోలోతుల్లోకి పోయి విశ్లేషిస్తూ వ్యక్తి సమాజంలో భాగమని తెలుసుకోలేకపోయింది. సామ్యవాద రచయితలు కూడా కేవలం సామాజిక నేపథ్యానికి కాక దానిలో సంపూర్ణ వికాసం పొందిన మనిషికి ప్రాముఖ్యత ఇవ్వాలని గుర్తించలేక పోయారు. సమకాలీన పోరాటం పట్ల రచయిత ఒక వైఖరి తీసుకుని దానికి అక్షర రూపం ఇవ్వాలి. ఆ వైఖరి కూడా పురోగామి వర్గ వైఖరి కావాలి. రచయిత పని వాస్తవికత చిత్రీకరణ కానీ నినాదాలు, పాత్రలతో ఉపన్యాసాలు ఇప్పించడం కాదు. తన పాత్రలకు సొంత గొంతుక, చరిత్ర ఉండాలి. పాత్రలోని సజీవ అంశాన్ని తీసుకొని భవిష్యత్తు కోసం వర్తమానంలో ఏ అంశాన్ని కూడా కాదనడు.

దాస్తోవస్కీ, తుర్గేనీవ్, కాన్రాడ్‌లు పెట్టీ బూర్జువా వర్గం నుంచి వచ్చిన విప్లవకారుడినీ తీసుకుని విమర్శనాత్మకంగా చిత్రించారు. మార్క్ రూథర్ఫోర్డ్ "రెవల్యూషన్ ఇన్ టానాస్ లేన్" నవల్లో నాయకుడు జకారయా రాజీలేని సజీవ చైతన్యశీలి. చార్లెస్ డి కోస్టర్ రచన "థైల్ ఉలెన్‌స్పీగెల్ మరియు లామ్ గోడ్జాక్ యొక్క పురాణం" విప్లవ మహా కావ్యం. ఈ రెంటిలో జాతీయ భావం నిండుగా ఉంది అని రాల్ఫ్‌ఫాక్స్ రాశాడు.

మానవ జాతి శత్రువులపై జయానికి, ఆత్మ బలానికి సంకేతం డిమిట్రోవ్. జర్మనీలో పార్లమెంటు భవనం తగలబడటం సాకుగా తీసుకొని హిట్లర్ కమ్యూనిస్టులపై నింద మోపి బల్గేరియా కార్మిక నేతగా ఉండి, ఆ సమయంలో జర్మనీలో ఉన్న డిమిట్రోవ్, ఇతరులను దారుణ నిర్బంధానికి గురిచేశాడు. కానీ కోర్టులో ఆ కుట్రను ఎదుర్కొని డిమిట్రోవ్ సాహసోపేత పోరాటం చేశాడు. మన ఆధునిక సాహిత్యంలో రచనలో బలహీనతకు పునరుజ్జీవాన్ని ఇచ్చే సజీవ స్రవంతులకి మేధావులు దూరంగా ఉండటం ముఖ్య కారణం.

గొప్ప నవలలో రచయితకు, పాత్రలకి, పాఠకులకు మధ్య సజీవ సంబంధం ఉంటుంది. రచయిత తన దేశ సాంస్కృతిక సంప్రదాయాన్ని వినియోగించగలగాలి. కేవలం అతని శ్రామికవర్గ సానుభూతి చాలదు. దానిని చరిత్ర ఉత్తేజితం చేయాలి. బ్రిటన్‌లో షేక్స్పియర్, మిల్టన్, ఫీల్డింగ్, వర్డ్స్‌వర్త్, బైరన్ తదితరులు తమ సమకాలీన సమాజం నాడిని పట్టుకున్నవారే.

రాల్ఫ్‌ఫాక్స్ ఫాసిస్టు ఇటలీ దేశం అబిసీనియాను, జర్మన్, ఇటాలియన్ ఫాసిస్టులు కాలి జెనరల్ ఫ్రాంకోకు సాయం చేసి స్పానిష్ ప్రజాస్వామిక రిపబ్లిక్‌ను ఓడించడం బ్రిటన్ చూస్తూ ఉండి పోవటాన్ని తీవ్రంగా ఖండించాడు. ఇండియా విషయంలో బ్రిటన్‌లో పాలన శ్రామికవర్గ హస్తగతం అయితేనో లేక భారతీయులు బానిస సంకెళ్లను ముక్కలు ముక్కలు చేస్తేనేగాని నూతన సామాజిక ఫలాలు భారతీయులు అనుభవించ లేరు అనే మార్క్స్ మాటలు రాల్ఫ్ ఫాక్స్ తన పుస్తకంలో ఉటంకించారు.

బ్రిటీష్ సామ్రాజ్యవాదం భారత, ఆఫ్రికా, పశ్చిమాసియాపై చేసే వలస దోపిడీ వ్యతిరేకించి వలస దేశాల జనానికి తన స్నేహ హస్తం అందించాడు రాల్ఫ్. చెడు కంటే చెడును కోసే కత్తిని ఏవగించుకోవటం హక్స్లీ తప్పని అన్నాడు. రష్యన్ విప్లవం, దాని సాహిత్య బలాన్ని పొగిడాడు. జగంలో సాగే వర్గ పోరులో నవలా రచయిత ఆధునిక నాగరికత మహా కావ్య సృష్టి చేస్తాడని ఆశించాడు.

ఆధునిక విప్లవ ఊహ రూపొందటంలో స్పష్టత, ఊహా కల్పన, వ్యంగ్యం లేమి దాని లోపం అన్నాడు. తూర్పు దేశాల నుంచి తాము పోగొట్టుకున్న ఊహాశక్తిని పొందాలని, ఆఫ్రికన్, లాటిన్ అమెరికాలోని ఇన్డో స్పానిష్ జాతుల బలం అజ్ఞాతంగా ఉందని, జీవిత దృక్పథంకు ఆ జాతులు బలాన్నిస్తాయని రాశాడు. చివరగా ప్రపంచ మార్కెట్, ఆధునిక ఉత్పత్తి విధానాలను ఒక గొప్ప సామాజిక విప్లవం తన అధీనంలోకి తెచ్చుకుని అభ్యుదయశీలుర సమష్టి చేతికి ఇచ్చినపుడే మానవ జాతి ప్రగతి తాను చంపిన వారి పుర్రెలలో అమృతం తాగే భీకర దేవతా విగ్రహరూపులో ఉండదు అని రాల్ఫ్ ఫాక్స్ రాశాడు.

నేటి పరిస్థితిలో సాంస్కృతిక కళాకారులు ఏ విధంగా ప్రజల సజీవ సంస్కృతిలో భాగస్వాములు కావాలో, పోరాటంలో అగ్రభాగాన నిలబడాలో తెలియడానికి స్పానిష్ అంతర్యుద్ధంలో అసువులు బాసిన రాల్ఫ్ ఫాక్స్ అందించిన ఈ గ్రంథం ఒక కరదీపిక.

నువ్వు ఒక రాయి అయితే

నువ్వు ఒక రాయి అయితే
ఈ దారి వెంట రాముడు రాడు
వచ్చినా పాదాల ధూళి సోకి
నువ్వు అహల్యవై ఆకారం తీసుకోలేవు

అయితే గియితే
నువ్వు వడ్డెర చేతిలో
ముక్క చెక్కల కంకరగా మారి
రానున్న తరాల కోసం
బాటను నిర్మించబడతావు

లేదు కాదు కూడదంటే
నాలుగు మూలలు కత్తిరించబడి
నువ్వు చెమటతో కట్టు రాయివై
అనాదిగా కనిపించకుండా పునాదివై
ఇంటి ఇంటినీ నిలబెడతావు
లేక వాళ్ల దయలేక నిన్ను తొక్కుకుంటూ
పైకి ఎక్కిపోయే మెట్లుగా మారిపోతావు
అయినా నీవు అవ్వాలనుకుంటే
శిల్పి సుత్తె ఉలి దెబ్బలకు
నిశ్శబ్దంగా బొబ్బ పెడుతూ
ముక్క ముక్కలై పోయి
ఒక ఆకారం తీసుకొని
అమాయక ప్రజలచే
దేవతగా కొలువు తీరవచ్చును

అయినా ఉలుకు పలుకూ లేకుండా
ఒకానొక రాయివలె బతుకుతానంటే
ఏ ఒక్కరికీ పెద్దగా అభ్యంతరం ఉండకపోవచ్చు

నువ్వెంత అరాటపడి బాట వెంట
కళ్లు కాయలు కాసేలా వేచి చూసినా

రాముడూ దేవుడూ కదిలి రాడు
అల్లా వచ్చి అందమైన తోటను ప్రసాదించలేదు
గొర్ల కాపరి ఏతెంచి తోడేళ్ల బారి నుంచి
గొర్రెలను కాపాడలేదు లేదు

ఒకవేళ వస్తే గిస్తే
నెనరు గల్ల మనిషి వస్తాడు
కానీ అతని పాద దుమ్ముతో
శవ ఆకారం తప్ప
నవజీవ రూప విమోచనం
పొందలేవు గాక పొందలేవు

జూకంటి జగన్నాథం

దిక్సూచి

పీడిత తాడిత జనమొకటైతే
ప్రపంచమంతా సొంతముగా ॥పీడిత॥

కులాల మతాల కుమ్ములాటలు
బలహీనతనే చాటుకదా
పీడిత తాడిత శ్రామికులంతా
పోరు సల్పితే విజయముగా ॥పీడిత॥

విడివడిపోయిన సోదరులంతా
పునరాలోచన సబబుకదా
ఎర్రెర్రని ముక్కలు ఒక్కటిగుంటే
విజయముతధ్యమునిక్కముగా॥పీడిత॥

మతాలచుట్టూ మనిషి తిరిగిన
మూఢత్వమునే నేర్పుకదా
మతాల కులాల గోడలు కూల్చిన
ప్రగతి ప్రయాణం సాగుకదా ॥పీడిత॥

ఇస్తారంటూ తెస్తారంటూ
ఎదురుచూడటం తప్పుకదా
నవసమాజ స్థాపనకోసం
పోరాడటమే మార్గముగా ॥పీడిత॥

అజ్ఞానపు విశ్వాసాలతో
ఇంకెన్నాళ్లని గడిపెదవూ
విజ్ఞానపు చైతన్య దీప్తితో
అడుగులువేయుటేమార్గముగా ॥పీడిత॥

పీడిత తాడిత జనమొకటైతే
ప్రపంచమంతా సొంతముగా
పాలితులంతా పాలకులవుటే
నవ సమ సమాజ స్థాపనగా ॥పీడిత॥

లెనిన్ కోసమో, మావో కోసమో
ఎదురు చూడటం తప్పుకదా
పోరుసల్పుటకు మళ్లీ మళ్లీ
లెనిన్లూ మావోలూ రారు కదా॥పీడిత॥

నిప్పుల వాగులో నిప్పుకణిలై
రథసారధులై పోరుసల్పితే
ఈ రాజ్యం అసలే మీది కదా
మీ రాజ్యం మీరే ఏలాలికదా ॥పీడిత॥

**బంగారు వి బి ఆచార్యులు,
98495 79569**

మానవత్వం, మనిషితత్త్వం తెలిపే కథలు

గ్రంథ సమీక్ష

కూర చిదంబరం
సెల్: 8639338675

"కనిపించే భావాలను, వాటి చరిత్రను అర్థం చేసుకుని వాటిని సాహిత్యంలోకి వంపుకుంటూ, సృజనాత్మకంగా, ఆలోచనలు రేకెత్తించే విధంగా రాయటం చేయి తిరిగిన రచయితకే సాధ్యం." అన్న కొటేషన్ గుర్తుకు వస్తుంది గన్నవరపు నరసింహామూర్తి రచనలు చదువుతోంటే... వీరి రచనలు చదువుతోంటే, గురజాడ వారి మరో మాట కూడా గుర్తుకు వస్తుంది. అదే..."సాహిత్యం యొక్క ప్రయోజనం పాఠకుడిని సంస్కారవంతుడిగా చేయటం."

సుమారు 800 కథలు, 40 నవలలు రాసి తెలుగు పాఠకులను మెప్పిస్తోన్న ఈ రచయిత లేటెస్ట్ కథాసంపుటి "పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం" చదువుతున్న పాఠకుడికి మళ్లీ మరోసారిపై సంగతులు స్ఫురణకు వస్తాయి.

సామాజిక సంబంధాలు కొరవడినపుడు మనిషి జనారణ్యంలో ఉన్నా, ఒంటరే నంటారు. "భూమి గుండ్రంగా ఉంటుంది" అన్న కథలో. 55 ఏళ్ల జీవితంలో ఎన్నో ఆనందాలు, విషాదాలు రెప్పపాటులా గడిచిపోయాయి. సాఫ్ట్‌వేర్ ప్రవాహంలో కొట్టుకుపోయి అమెరికా చేరాడు. అక్కడి జీవితానికి అలవాటుపడి అమ్మానాన్నలు, వారియెడ తనకు ఉండాల్సిన బరువు బాధ్యతల్ని విస్మరించాడు. కాల ప్రవాహంలో పూచికపుల్లల్లా భార్య, పిల్లలు, ఆస్తులు అంతస్తులు తోడయ్యాయి. వీడిపోయాయి. తిరిగి ఇండియాకు వస్తే తన జీవితంలానే శిథిలావస్థకు చేరుకున్న ఇల్లు. ఒంటరితనం వెక్కిరించాయి. జీవితం చేతిలోంచి జారిపోవటమే కాదు, చెప్పినట్లు వినటం మానేసింది. జారుడుబండ మీంచి జారిపోయి ఎక్కడికో చేరినట్లనిపించింది. నిర్ధామధామం లాంటి ఇల్లు చూశాక. తాను తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, తర్వాతి కాలంలో భార్యాపిల్లలు తనని నిర్లక్ష్యం చేసి, భూమి గుండ్రంగానే ఉంటుందని నిరూపించారు. పై చదువులు, సంపాదనకు అమెరికా వెళ్లిన మన యువత తన కాళ్ల కింది నేలను నిర్లక్ష్యం చేయవద్దు అన్న నీతి ఈ కథలో కనిపిస్తుంది.

ఇంచుమించు ఇలాంటిదే మరో కథ "చేటపెయ్య." సాంఘిక సమాజ స్థితిగతులపై నరసింహామూర్తి అవగాహన, అభివ్యక్తి అమోఘం అనిపించుతుందీ కథ చదివాక.

తల్లిదండ్రులు నిస్వార్థానికి ప్రతీకలు. తమ ప్రాణాన్ని ఒడ్డి అయినా, పిల్లల భవిష్యత్తును ఆకాంక్షిస్తారు. ఇంటరు రెండవ



సంవత్సరం. పుస్తకాలు, ఫీజులకు నాన్న దగ్గర డబ్బులేదు. చదువు ఆగిపోయే దుస్థితి. అమ్మ తన మెడలోని ఒకేఒక బంగారు గొలుసు కొడుక్కి ఇస్తుంది మరో ఆలోచన లేకుండా. లక్ష్మీదేవి, సరస్వతిదేవి సాయపడుతుంది. కాలక్రమేణా ఉద్యోగం వచ్చిన కొడుకు తల్లికి బంగారుగొలుసు బహుకరిస్తాడు. ఆ అమ్మ కళ్లలోని మెరుపు ఆ కొడుకే కాదు, చదువుతోన్న మనకూ కనిపిస్తుంది.

అమ్మత్యాగం కొడుకు మరిచిపోకుండా తన కృతజ్ఞత ప్రకటించుకోవటం...ఇద్దరి మధ్య గల ప్రేమాభిమానాలను 'హైలైట్' చేసి రాసిన ఈ కథ మంచి సందేశాన్నిస్తుంది.

చెట్టు చేమ, పక్షులు, పంటలు...ఇవన్నీ పర్యావరణంలో భాగం. పర్యవసానాలు గమనించకుండా పురుగుల మందులు, రసాయనిక ఎరువుల వల్ల పంట దిగుబడి పెరుగుతుంది. కాని ఇవి తినే ఆహారాన్ని, తాగేనీటిని కలుషితం చేస్తున్నాయి. సెల్‌ఫోన్ టవర్లవల్ల పిచ్చుకల సంతతి నశిస్తున్నదన్న సత్యం తెలిసి కూడా అప్రమత్తత ఉండటం లేదు. సమాజ స్పృహ కలిగిన నరసింహం నలుగురిలా తానూ మిన్నకుండలేదు. తన వంతు కర్తవ్యంగా మనల్ని ఎడ్యుకేట్ చేస్తున్నారు. అందరూ రచయితల్లా సమస్యను మన ముందుంచి చేతులు ముడుచుకోలేదు. ఓ అడుగు ముందుకు వేసి, కథద్వారా పరిష్కారమార్గాల్ని సూచించారు. ఫలితం ఆశా జనకంగా ఉంటుందన్న ఆశావహ దృక్పథాన్ని ప్రకటించటం బాగుంది.

'దేవుడెక్కడ కనిపిస్తాడు?' అన్నది మనం 'ప్రణవనాదం' కథలో తెలుసుకుంటాము. ఏడడుగులు వేస్తే ఏడుజన్మల బంధం ముడిపడుతుందంటారు. 'ఆడా, మగా సమానం' అన్న పదానికి అర్థం ఉంది. పెడ అర్థం ఉంది. చదువుకున్న యువత 'ట్రస్ట్' అన్న చిన్నమాటను సరిగ్గా అర్థం చేసుకోకుండా సంసారాలను విచ్ఛిన్నం చేసుకోకుండా నడవాలని ఈ కథ చెబుతుంది. ఈ కథలో కూడా రచయిత సమస్యని ప్రస్థావించటమే కాక పరిష్కారం సూచించటం బావుంది.

చదువు సంస్కారాన్ని నేర్పాలి. సాటిమనిషి యెడ ప్రేమని, ఆదుకునేతత్వాన్ని నేర్పాలి. ఎదుటి వ్యక్తి కష్టంలో ఉంటే, తనకెందుకు లెమ్మనకుండా, సాయంచేయాలి. శేఖర్ మనోహర్‌లు స్టేట్ గవర్నమెంటు ఉద్యోగులు. విద్యావంతులు. వారు ప్రయాణం చేస్తున్న కారుకు యాక్సిడెంట్‌కు గురి అయితే గాయపడి సాయంకోసం అర్థిస్తున్న వారిని అప్పన్న అనే గేంగ్‌మేన్, సాధారణ విద్యావంతుడు ఆదుకుని రక్షిస్తాడు. సమయానికి చికిత్స అందేలా చూసి రెండు నిండు ప్రాణాల్ని కాపాడుతాడు. అదే వ్యక్తులు, అదే అప్పన్న ఆపదలో చిక్కుకుంటే, తమకెందుకు లెమ్మని పట్టించుకోరు. విద్య, అంతస్థు ఆదుకునే తత్వాన్ని నేర్పాలని, ఇచ్చే సందేశం "ఓ మనిషీ! నువ్వెక్కడ?" చెబుతుంది. అందెశ్రీ పాట "మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు..." నేపథ్యంగా కథ చివర చేర్చటం రచయిత డీప్ ఇన్వాల్వ్‌మెంట్‌కు నిదర్శనం. ఈ చివరి వాక్యం పాఠకుల మనసుల్లో బలంగా నాటుకుంటుంది. 'సర్జికల్ స్ట్రయిక్" అంటే ఏమిటో, జవానులూ, మానవులే అని 'సరిహద్దు' కథ నిరూపిస్తుంది.

సంపుటిలో ఇచ్చిన 29కథలు వేటికవే సాటి అని నిరూపిస్తాయి. రచయిత గన్నవరపు నరసింహామూర్తి మానవత్వం, మనిషి తత్వానికి అద్దం పడతాయి.

పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం- కథలు
రచన: గన్నవరపు నరసింహమూర్తి,
వెల: రూ 150, కాపీలకు: పాలపిట్ట బుక్స్
ఫోన్: 9848787284, రచయిత 7752020123
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

సామాజిక సమస్యల కోణంలో వాడూ- నేనూ

విష్ణుభొట్ల రామకృష్ణ, 94406 18122

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ నుంచి వచ్చిన మరో నవల. వివినమూర్తి రాసిన వాడూ...నేనూ అనే నవలను పాఠకుల ముందుంచారు పబ్లిషర్స్. ఈ నవల మొత్తం ఇద్దరు వ్యక్తుల మధ్య నడిచే సంభాషణలుగా చెప్పవచ్చు. ఈ ఇద్దరు స్నేహితులుగా ఉండి ఎవరు ముందు చనిపోతే ఇంకొకరు అంత్యక్రియలు నిర్వహించాలనే ఒప్పందం చేసుకొని, వారిలో ఒకరు చనిపోగా మరొకరు అంత్యక్రియల కోసం ప్రయాణిస్తూ వారి బాల్యం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సాగేదే ఈ వాడూ- నేనూ.



ఇద్దరు విభిన్నమైన వ్యక్తులు, వేరు కులాలు, వేరు మతాలు, వేరు భావజాలాలు, వేరువేరు అభిప్రాయాలు కాని ఒకరి అభిప్రాయం మరొకరు గౌరవించుకుంటారు. ఇలా వారి మధ్య సాగే అనేక సామాజిక సమస్యలు, పరిష్కారాలతో నవల సాగుతుంది. మతం గురించి మాట్లాడుతూ రచయిత ఒకచోట యూరోపియా భావనలోని మతం రెలిజియన్ మనకు లేదు. జపాన్ వాళ్లని పాశ్చాత్యులు మీ మతం ఏమిటి అని అడిగితే వారికి ఆ ప్రశ్నే అర్థం కాలేదని అంబేద్కర్ రాశాడు. అలాగే మానవులు దైవం అనే చర్చ వచ్చినప్పుడు... మానవుడు, దైవం రెండూ ఊహలే. ఆలోచనలే. భౌతికంగా ఉన్నదానికి ప్రతీక మానవుడు. లేనిదానికి ప్రతీక దైవం అంటూ చెప్పడం వాటి విరుద్ధ స్వభావాలను తెలియజేస్తుంది. బాబ్రీ మసీదు కూల్చడం సాధ్యమా అని ప్రశ్న వచ్చినప్పుడు 'ఎమోషనల్ అంశాలను న్యాయస్థానాలు పరిష్కరించలేవు. జనాలే తేల్చేస్తారు అంటూ... తొలి కల్పనకి, మలి కల్పనకి మధ్య ఘర్షణే బాబ్రీ మసీదు అంటూ వివరించటం రచయిత దూరదృష్టికి నిదర్శనం. చివరిగా సాహిత్యం గురించి, నేడు సమాజంలో జరుగుతున్న విధానాన్ని చెప్పకనే చెప్పారు రచయిత. ఇలా విభిన్న అంశాలను తీసుకొని సమాజంలో నేడు జరుగుతున్న వాటితో పోల్చుతూ రచయిత నవలను మలిచారు. రెండు పాత్రల ద్వారా సమాజంలో జరిగే అంశాలను చక్కగా వివరించారు వివినమూర్తి. ఏది ఏమైనా అర్థం చేసుకొనే దాన్ని బట్టి నవల అర్థం అవుతుంది.

పుస్తకం: వాడూ-నేనూ, రచయిత: వివినమూర్తి, వెల: రూ 180/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, విశాలాంధ్ర 33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ. విశాలాంధ్ర బుక్‌హౌస్ విజయవాడ
విశాఖపట్టణం, అనంతపురం అన్ని స్టాల్స్‌లలో లభించును.

ఆరావళిని ముక్కలు చేసే చర్యలా?

- పర్యావరణ సమగ్రత విచ్ఛిన్నం చేసేలా పునర్నిర్వచనమా...
- పర్యావరణ మంత్రిని ప్రశ్నించిన జైరాం రమేశ్

న్యూఢిల్లీ: ఆరావళిని పునర్నిర్వచడమంటే దానిని ముక్కలు చేయడమేనని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ అన్నారు. ఆరావళి పర్వతాల పునర్నిర్వచనంపై వివాదం చెలరేగిన నేపథ్యంలో జైరాం రమేశ్ ఆదివారం పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్‌కు నాలుగు ప్రశ్నలు సంధించారు. ఈ చర్య మొత్తం పర్వత శ్రేణికి చెందిన భౌగోళిక, పర్యావరణ సమగ్రతను విచ్ఛిన్నం చేయడానికి, బలహీనపరచడానికి దారితీస్తుందని విమర్శించారు. కేంద్ర మంత్రికి రాసిన లేఖలో... ఆరావళి కొండలను 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భూభాగాలకు పరిమితం చేసే పునర్నిర్వచనంపై విస్తృత ఆందోళనలు ఉన్నాయని తెలిపారు. 'ఈ విషయంలో మీ పరిశీలన కోసం నాలుగు నిర్దిష్ట ప్రశ్నలను లేవనెత్తడానికి నన్ను అనుమతించండి. 2012 నుంచి రాజస్థాన్‌లోని ఆరావళి కొండలు, పర్వత శ్రేణుల నిర్వచనం, ఆగస్టు 28, 2010 నాటి ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) నివేదికపై ఆధారపడి ఉందన్నది నిజం కాదా? ఆ నివేదిక ఈ క్రింది విధంగా పేర్కొంది : మూడు డిగ్రీలు లేదా అంతకంటే ఎక్కువ వాలు ఉన్న అటువంటి అన్ని ప్రాంతాలను కొండలుగా గుర్తించాలి. అలాగే 20 మీటర్ల సమోన్నత రేఖ అంతరానికి సమానమైన 20 మీటర్ల కొండ ఎత్తుకు అనుగుణంగా సాధ్యమయ్యే విస్తరణను పరిగణనలోకి తీసుకోవడానికి, వాలుకు దిగువ వైపున ఏకరీతిగా 100 మీటర్ల వెడల్పు గల బఫర్‌ను కూడా జోడించాలి. ఈ నిర్దేశిత ప్రాంతాల పరిధిలోకి వచ్చే సమతల ప్రాంతాలు, పీఠభూములు, లోయలు, పల్లపు ప్రాంతాలు కూడా కొండలలో భాగంగానే పరిగణించబడతాయి' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సెప్టెంబరు 20, 2025 నాటి పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు ఎఫ్ఎస్ఐ పంపిన సమాచారంలో... 'ఆరావళి పర్వతాల చిన్న కొండ నిర్మాణాలు భారీ ఇసుక రేణువులను ఆపడం ద్వారా ఎడారీకరణకు వ్యతిరేకంగా సహజ అవరోధాలుగా పని చేస్తాయి. తద్వారా ఢిల్లీ, పొరుగు మైదానాలను ఇసుక తుపానుల నుంచి రక్షిస్తాయని' పేర్కొన్నది నిజం కాదా అని ప్రశ్నించారు. గాలి ద్వారా ఎగిరిన ఇసుక రేణువులకు వ్యతిరేకంగా ఒక అవరోధానికి రక్షణ ప్రభావం దాని ఎత్తుతో నేరుగా ఉంటుందని, అందువల్ల 10 నుంచి 30 మీటర్ల ఎత్తున్న చిన్న కొండలు కూడా బలమైన సహజ గాలి విరామాలుగా పని చేస్తాయని జైరాం రమేశ్ అన్నారు. 'సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) తన వంబరు 7, 2025 నాటి నివేదికలో అప్పటికి అమలులో ఉన్న ఎఫ్ఎస్ఐ నిర్వచనం ప్రకారం రాజస్థాన్‌లోని 164 మైనింగ్ లీజులు ఆరావళి కొండలు, పర్వత శ్రేణుల పరిధిలోనే ఉన్నాయని నిర్ధారించిందన్నది వాస్తవం కాదా?' అని ప్రశ్నించారు. 'ఈ పునర్నిర్వచనం వల్ల అనేక చిన్న కొండలు, భూస్వరూపాలు కనుమరుగవుతాయని, అలాగే నాలుగు రాష్ట్రాలలో విస్తరించి ఉన్న మొత్తం ఆరావళి కొండలు, పర్వత శ్రేణుల భౌగోళిక, పర్యావరణ సమగ్రతకు విఘాతం కలిగిస్తుందన్నది నిజం కాదా?' అని కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించారు. కొండల పునర్నిర్వచనం కింద ఆరావళి పర్వతాలలో 90 శాతానికి పైగా రక్షణ లభించదని, ఇది వాటిని మైనింగ్, ఇతర కార్యకలాపాల కోసం తెరిచి ఉంచుతుందని ప్రతిపక్ష కాంగ్రెస్ పేర్కొంది. ఈ విషయంపై వివాదం చెలరేగడంతో పర్వత శ్రేణి పరిధిలో కొత్త మైనింగ్ లీజులను మంజూరు చేయడంపై పూర్తి నిషేధం విధించాలని కేంద్రం రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది.

ఉన్నావ్ కేసులో సీబీఐ పిటిషన్‌పై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: ఉన్నావ్ అత్యాచార కేసులో బహిష్కృత బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌కు విధించిన జీవిత ఖైదును సస్పెండ్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు సోమవారం విచారణ జరపనుంది. కార్యకలాపాల జాబితా ప్రకారం, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరి, న్యాయమూర్తి జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌తో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల వెకేషన్ బెంచ్ ఈ విషయాన్ని విచారించే అవకాశం ఉంది. హైకోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ, దానిపై స్టే కోరుతూ న్యాయవాదులు అంజలే పటేల్, పూజా శిల్పకార్ దాఖలు చేసిన మరో పిటిషన్‌ను కూడా సుప్రీం కోర్టు విచారించనుంది. సుప్రీం కోర్టులో దాఖలు చేసిన తన అభ్యర్థనలో సీబీఐ... ఎల్.కె.అద్వానీ కేసులో ఇచ్చిన తీర్పును ప్రస్తావించింది. ఆ తీర్పులో ఎంపీలు లేదా ఎమ్మెల్యేల వంటి ప్రభుత్వ పదవులను కలిగి ఉన్న ఎవరైనా ప్రభుత్వ సేవకులుగా పరిగణించబడతారని పేర్కొంది. నేరం జరిగినప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న సెంగార్... పోక్సో చట్టం కింద విచారించబడటానికి ప్రభుత్వ సేవకుడు కాదని ప్రకటించి, అతనికి బెయిల్ మంజూరు చేయడంలో హైకోర్టు పొరపడిందని దర్యాప్తు సంస్థ వాదించింది. 'రాజ్యాంగ పదవిలో ఉన్నందున సిట్టింగ్ ఎమ్మెల్యేకు ప్రజల నమ్మకం, ఓటర్లపై అధికారం ఉంటుందని, అటువంటి పదవి రాష్ట్రానికి, సమాజానికి రుణపడి ఉన్న విధులకు సంబంధించి అధిక బాధ్యతను కలిగి ఉంటుందని హైకోర్టు పరిగణించడంలో విఫలమైంది. పోక్సో చట్ట ఉద్దేశం, లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయోజనాత్మక వ్యాఖ్యానాన్ని స్వీకరించడంలో విఫలమై, అది చట్టంలో పొరపాటు చేసింది' అని సీబీఐ పేర్కొంది. ఉన్నావ్ అత్యాచార కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న సెంగార్ ఇప్పటికే ఏడు సంవత్సరాల ఐదు నెలలు జైలులో గడిపారని పేర్కొంటూ, డిసెంబరు 23న హైకోర్టు అతని జైలు శిక్షను సస్పెండ్ చేసింది. అత్యాచార కేసులో తన దోషిగా నిర్ధారణ, శిక్షను సవాలు చేస్తూ దాఖలు చేసిన అభ్యర్థన పెండింగ్‌లో ఉన్నంత వరకు సెంగార్ శిక్షను హైకోర్టు సస్పెండ్ చేసింది. అతను ఈ కేసులో డిసెంబరు 2018 నాటి ట్రయల్ కోర్టు తీర్పును సవాలు చేశాడు. అయితే, బాధితురాలి తండ్రి కస్టడీ మరణం కేసులో కూడా అతను 10 సంవత్సరాల జైలు శిక్ష అనుభవిస్తున్నందున, ఆ కేసులో అతనికి బెయిల్ మంజూరు చేయనందున అతను జైలులోనే ఉంటాడు. మైనర్‌గా ఉన్నప్పుడు బాధితురాలిని కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన సెంగార్‌కు అనేక షరతులు విధిస్తూ, హైకోర్టు రూ.15 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు అంతే మొత్తానికి ముగ్గురు పూచీకత్తుదారులను సమర్పించాలని ఆదేశించింది. బాధితురాలి ఢిల్లీలోని నివాసానికి 5 కిలోమీటర్ల పరిధిలోకి రాకూడదని, ఆమెను గానీ, ఆమె తల్లిని గానీ బెదిరించకూడదని కూడా కోర్టు అతన్ని ఆదేశించింది. ఈ షరతులలో దేనినైనా ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు చేయబడుతుందని హైకోర్టు పేర్కొంది. ఆగస్టు 1, 2019న సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అత్యాచార కేసు, దానికి సంబంధించిన ఇతర కేసులను ఉత్తరప్రదేశ్‌లోని ఒక ట్రయల్ కోర్టు నుంచి ఢిల్లీకి బదిలీ చేశారు. బాధితురాలి తండ్రి కస్టడీలో మరణించిన కేసులో తన శిక్షపై సెంగార్ దాఖలు చేసిన అప్పీల్ కూడా పెండింగ్‌లో ఉంది. అందులో తాను ఇప్పటికే గణనీయమైన సమయం జైలులో గడిపినందున శిక్షను నిలిపివేయాలని అతను కోరాడు.

కర్నాటకలో 'బుల్డోజర్' చిచ్చు

కాంగ్రెస్ అధిష్టానం సీరియస్

బెంగళూరు: కర్నాటక రాజధాని నగరం బెంగళూరు శివార్లలోని కోగిలు గ్రామంలో చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమం అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టింది. నిరుపేదల ఇళ్లను కూల్చివేయడంపై స్థానికుల నుంచి నిరసనలు వ్యక్తమవడమే కాకుండా రాజకీయంగానూ పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత కేసీ వేణుగోపాల్ శనివారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లతో మాట్లాడారు. కూల్చివేతల విషయంలో ప్రభుత్వం అనుసరించిన తీరుపై ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇటువంటి సున్నితమైన విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని, పేదల పట్ల సానుభూతితో వ్యవహరించాలని వేణుగోపాల్ సూచించారు. బాధితులకు తక్షణమే పునరావాసం కల్పించి, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కూల్చివేతలపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఫేస్‌బుక్ వేదికగా తీవ్రంగా స్పందించారు. బెంగళూరులోని ఫకీర్ కాలనీ కూల్చివేత దిగ్భ్రాంతికరమని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉత్తరాది రాష్ట్రాల తరహాలో 'బుల్డోజర్ రాజకీయాలను' ప్రోత్సహించడం బాధాకరమని విమర్శించారు. అయితే, ఈ విమర్శలను డీకే శివకుమార్ గట్టిగా తిప్పికొట్టారు. బయటి నాయకులు ఇక్కడి పరిస్థితులు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదని, తాము ప్రభుత్వ భూములను పరిరక్షించడానికే ఈ చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. అది వ్యర్థాలను పారబోసే ప్రాంతమని, అక్కడ నివాసాలు ఉండటం సురక్షితం కాదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వివరించారు. ఆక్రమణదారులకు ముందే నోటీసులు ఇచ్చామని, స్పందించకపోవడంతోనే ఈ చర్య తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. అయినప్పటికీ, మానవీయ కోణంలో అక్కడ నివసిస్తున్న వలస కూలీలకు తాత్కాలిక వసతి, ఆహారం అందించాలని బీబీఎంపీ అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.

మధ్యప్రదేశ్‌లో బీజేపీ నేత అకృత్యం

మహిళపై అత్యాచారం... ఆపై బెదిరింపులు

భోపాల్: అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, బాధితురాలిని బెదిరించాడో బీజేపీ నాయకుడు. బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్ లోని సత్నా జిల్లాలో ఈ దారుణ ఘటన జరిగింది. అత్యాచారం చేస్తూ వీడియోలు తీసి నెలల తరబడి వేధింపులకు గురిచేశాడంటూ బాధితురాలు కన్నీళ్లతో న్యాయం చేయాలని వేడుకుంటోంది. ఈ విషయంపై బాధితురాలు నిలదీయగా... తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ నిందితుడు విర్రవీగుతున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. సత్నా జిల్లా రాంపూర్ బాఘేలన్ నగర్ పరిషత్ కౌన్సిలర్ భర్త అశోక్ సింగ్ అధికార బీజేపీకి చెందిన స్థానిక నాయకుడు. ఆరు నెలల క్రితం అశోక్ సింగ్ ఓ మహిళ ఇంట్లోకి చొరబడి, కత్తితో బెదిరించి ఆమెపై అత్యాచారం చేశాడు. ఆ దృశ్యాలను తన మొబైల్‌లో రికార్డు చేశాడు. అత్యాచారం చేసిన విషయాన్ని బయటకు చెబితే వీడియోను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. ఆమెతో పాటు ఆమె కుటుంబం మొత్తాన్నీ అంతమొందిస్తానని హెచ్చరించాడు. భయంతో బాధితురాలు మౌనంగా ఉండడాన్ని అలుసుగా తీసుకున్న అశోక్ సింగ్... ఆ తర్వాత కూడా లైంగిక వేధింపులకు గురిచేశాడు. ఈ నెల 20న మరోసారి బాధితురాలిని వేధిస్తూ.. తాను చెప్పినట్లు వినకపోతే వీడియోను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో అశోక్‌సింగ్ ను బాధితురాలు నిలదీసింది. వీడియో రికార్డు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పగా... అశోక్ సింగ్ అహంకారంతో మాట్లాడాడు. ఎవరికి ఫిర్యాదు చేసినా తనకేమీ కాదని ధీమా వ్యక్తం చేశాడు. తనను అడిగే వారు లేరని విర్రవీగడం వీడియోలో కనిపించింది. 'నీ ఇష్టం వచ్చిన చోట ఫిర్యాదు చేసుకో.. పోలీసులే కాదు ఎవరూ నన్నేమీ చేయలేరు. నాకేం కాదు' అంటూ బాధితురాలిని హేళన చేశాడు. బాధిత మహిళ ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ అశోక్ సింగ్ నుంచి తనను కాపాడాలని, అతడికి తగిన శిక్ష పడాలని విజ్ఞప్తి చేసింది. ఈ వీడియో చూసిన స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అశోక్ సింగ్‌కు నేరచరిత్ర ఉందని, అయినా అధికార పార్టీ అండతో అతడు యథేచ్ఛగా తిరుగుతున్నాడని ఆరోపించింది. ఐదు రోజుల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేసినా సరైన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. నిందితుడి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణాపాయం ఉందని.. తమకు ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యతని ఆమె హెచ్చరించింది. బాధితురాలి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పోలీసులు అశోక్ సింగ్ పై కేసు నమోదు చేశారు. సత్నా ఎస్పీ హంసరాజ్ సింగ్ స్పందిస్తూ.. డిప్యూటీ ఎస్పీ మనోజ్ త్రివేది అధ్వర్యంలో కేసు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. నిందితుడిని న్యాయస్థానం ముందు నిలబెడతామని, చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చూస్తామని చెప్పారు.

జమ్మూలో 30 మంది పాకిస్థాన్ ఉగ్రవాదులు?

భద్రతాబలగాల అప్రమత్తం

శ్రీనగర్: జమ్మూ ప్రాంతంలో 30 మందికి పైగా పాకిస్థానీ ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాలు వెల్లడిం చాయి. దాంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉగ్ర స్థావరాలు గుర్తించడానికి కొండలు, అడవులు, మారుమూల లోయల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఉగ్రవాదులను ట్రాక్ చేయడానికి డ్రోన్లు, థర్మల్ ఇమేజర్లు, గ్రౌండ్ సెన్సార్లను మోహరించి నట్లు చెప్పారు. జమ్మూలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోవడంతో ఉగ్రవాదులపై నిరంతర నిఘా కోసం పర్వత ప్రాంతాల్లో తాత్కాలిక నిఘా స్థావరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు జమ్మూకశ్మీర్‌లో మంచు కురుస్తుండటంతో చొరబాట్లకు ఇదే అదునుగా భావించిన ఉగ్రమూకలు అంతర్జాతీయ సరిహద్దును దాటుకుని దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ విషయాన్ని సరిహద్దు భద్రతా దళం అధికారులు వెల్లడించారు. అయితే ఉగ్రవాదుల చొరబాటు యత్నాలను తమ దళాలు తిప్పికొడుతున్నా యని అన్నారు. సరిహద్దుల్లో ఉగ్ర కదలికల నేపథ్యంలో కశ్మీర్‌లోని గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ లేక్ ప్రాంతాలతో సహా వివిధ సున్నితమైన ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించినట్లు తెలిపారు.

భారత్ గర్వించదగినది 'ఆపరేషన్ సిందూర్'

మన్‌కీ బాత్‌లో మోదీ

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌తో భారత్ ప్రపంచ దేశాలకు తన బలాన్ని చూపించిందని... దేశ భద్రతపై తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని ప్రధాని మోదీ అన్నారు. 'మన్‌కీ బాత్' 129వ ఎపిసోడ్‌లో మోదీ ప్రసంగిస్తూ... 2025లో భారతదేశం గర్వించదగిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. దేశంలో ఉన్న ప్రతిపౌరుడికి ఈ ఆపరేషన్ గర్వకారణంగా మారిందన్నారు. 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు కూడా దేశ ప్రజల్లో ఇదే స్ఫూర్తి కనిపించిందని పేర్కొన్నారు. క్రీడల పరంగా కూడా ఈ ఏడాది చిరస్మరణీయమని మోదీ పేర్కొన్నారు. 12 ఏళ్ల తర్వాత టీమ్ ఇండియా పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకుందని... మహిళల క్రికెట్ జట్టు మొదటిసారి వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకుందన్నారు. మహిళల అంధుల జట్టు టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకొని చరిత్ర సృష్టించిందని గుర్తు చేసుకున్నారు. అంతరిక్ష రంగంలోనూ ఈ ఏడాది భారత్ తన ప్రతిభను చాటుకుందని అన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన శుభాన్షు శుక్లాను ఈ సందర్భంగా ప్రశంసించారు. కోట్ల మంది పాల్గొన్న మహా కుంభమేళాను దిగ్విజయంగా నిర్వహించి భారత్ ప్రపంచ దేశాలను ఆశ్చర్యపరిచిందని మోదీ పేర్కొన్నారు. అయోధ్య రామాలయంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమం ప్రతి హిందువు గర్వపడేలా చేసిందని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలు, ఇతర విషయాలను గుర్తు చేసుకున్నారు. 2025లో దేశ ప్రజలు ఏ విధంగా ఐక్యతతో సామరస్యంగా ఉన్నారో అదే విధంగా కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. నరసాపురం లేస్ క్రాఫ్ట్ గురించి మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారు. ప్రస్తుత మార్కెట్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురంలో లేస్ క్రాఫ్ట్ చర్చనీయాంశంగా మారిందన్నారు. తరతరాల నుంచి మహిళలే ఈ అరుదైన కళను కాపాడుతూ వస్తున్నారన్నారు. ఏపీ ప్రభుత్వం నాబార్డ్‌తో కలిసి లేస్ క్రాఫ్ట్ కళాకారులకు కొత్త డిజైన్లు, నైపుణ్యాలు నేర్పిస్తోందని... ప్రస్తుతం దీని మార్కెట్ వేగంగా విస్తరిస్తోందన్నారు. ప్రభుత్వ మద్దతుతో నరసాపురం ప్రజలు ఈ కళకు కొత్త హంగులను చేర్చి ముందుకు తీసుకెళ్తున్నారన్నారని ప్రశంసించారు. లక్షలమంది మహిళలు ఉపాధి పొందుతున్న ఈ కళకు జీఐ గుర్తింపు కూడా ఉందన్నారు.

జలాంతర్గామిలో రాష్ట్రపతి ప్రయాణం

బెంగళూరు: దేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ము జలాంతర్గామిలో ప్రయాణించారు. కర్నాటకలోని కార్వార్ నౌకాదళ స్థావరం నుంచి కల్వరి శ్రేణి జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో బయలుదేరారు. రాష్ట్రపతి వెంట నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి ఉన్నారు. కల్వరి క్లాస్ జలాంతర్గామిలో రాష్ట్రపతి ముర్ము ప్రయాణించడం ఇదే తొలిసారి. గతంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కల్వరి శ్రేణి సబ్‌మెరైన్‌లో ప్రయాణించారు. ఆ తర్వాత సబ్‌మెరైన్‌లో ప్రయాణిస్తున్న రెండో రాష్ట్రపతిగా ముర్ము గుర్తింపు పొందారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్యాంగ్‌స్టర్ పోటీ

జైలు నుంచి వచ్చి నామినేషన్

ముంబై: సొంత మనవడి హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఓ గ్యాంగ్‌స్టర్ పూణే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేస్తున్నాడు. జైలు నుంచి అతడు రిటర్నింగ్ కార్యాలయానికి వచ్చి శనివారం నామినేషన్ దాఖలు చేశాడు. ముఖానికి నల్లటి ముసుగు కట్టి, చేతులను తాళ్లతో కట్టేసి పోలీసులు అతడిని రిటర్నింగ్ ఆఫీస్‌కు తీసుకొచ్చారు. అందుకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సొంత మనవడు ఆయుష్ కోమ్కర్ హత్య కేసులో గ్యాంగ్ లీడర్ బందు అందేకర్ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అతడికి ప్రత్యేక కోర్టు అనుమతిచ్చింది. దాంతో అతడు ఇండిపెండెంట్‌గా బరిలో దిగాడు. నామినేషన్ వేసేందుకు వస్తూ నినాదాలు చేశాడు. ఇదే హత్య కేసులో నిందితులుగా ఉన్న అందేకర్ కుటుంబంలోని మరో ఇద్దరు మహిళలు కూడా ఎన్నికల్లో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. కోర్టు అనుమతి ఆ ఇద్దరు మహిళలు కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఆయుష్ కోమ్కర్ సెప్టెంబరు ఐదో తేదీన నానాపేటలో జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయాడు. అందేకర్ ఆయన కుటుంబంలోని ఇద్దరు మహిళలతో పాటు మరో 15 మందికి ఈ హత్యలో ప్రమేయం ఉందనే ఆరోపణలు న్నాయి. ప్రస్తుతం వీరంతా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. పూణెతో సహా మరో 28 ప్రాంతాల్లో జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి.

బెంగాల్ ఎన్నికల ప్రధానాధికారికి వై-ప్లస్ కేటగిరీ భద్రత

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మనోజ్ అగర్వాల్‌కు కేంద్ర ప్రభుత్వం వై-ప్లస్ కేటగిరీ (సాయుధ) భద్రత కల్పించింది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా 58 లక్షలమంది పేర్లను తొలగించిన క్రమంలో కొందరు ప్రభుత్వ నేతలు ఎన్నికల కమిషన్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో బీఎల్‌వోలు, ఇతర అధికారులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో మనోజ్ అగర్వాల్‌కు కూడా ముప్పు పొంచి ఉందని పలు కేంద్ర సంస్థలు ఇచ్చిన సమాచారం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అగర్వాల్‌కు సీఐఎస్ఎఫ్ విభాగానికి చెందిన 12మంది సిబ్బంది సెక్యూరిటీగా ఉంటారు.

పెళ్లయిన 24 గంటలకే విడాకులు

ముంబై: వివాహ బంధం ఏడు జన్మలు ఉంటుందని అంటారు కానీ, ఓ డాక్టర్ల జంట పెళ్లయిన 24 గంటల్లోనే పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్న సంఘటన ఇటీవల పుణెలో జరిగింది. వివాహం జరిగిన వెంటనే ఇద్దరి మధ్య సైద్ధాంతిక విభేదాలు తలెత్తడంతో, వారు కోర్టుకు వెళ్లి చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేసి విడిపోవాలని నిర్ణయించుకున్నారు. వృత్తిరీత్యా డాక్టర్లయిన ఇద్దరు ప్రేమించి వివాహం చేసుకున్నారు. కానీ వివాహం జరిగిన తెల్లారి, భర్త పిడుగులాంటి వార్త చెప్పాడు. తాను మర్చంట్ నేవీలో పని చేస్తున్నానని, పని కారణంగా ఒకోసారి సంవత్సరం పాటు విదేశాల్లో ఉండాల్సి వస్తుందని భార్యకు చెప్పాడు. దాంతో ఆమె షాక్‌కు గురైంది. తనకు ముందే ఈ విషయం ఎందుకు చెప్పలేదని నిలదీయడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. భర్త నిజాయతీగా ముందే అసలు విషయం చెప్పి ఉంటే బాగుండేదని ఈ విషయం దాచడం తనను మోసం చేయడమేనని ఆమె భావించింది. దీంతో పెళ్లయిన 24 గంటల్లోనే విడిపోవాలని వారు సంచలన నిర్ణయం తీసుకున్నారు. వివాహం జరిగిన మరుసటి రోజే వారు విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. వారికి విడాకులు మంజూరు కావడానికి 18 నెలల సమయం పట్టింది.

ఆర్ఎస్ఎస్-అల్‌ఖైదా రెండూ ఒకటే

మాణికం ఠాగూర్

న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పై కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ సంస్థను అల్ ఖైదా ఉగ్రవాద సంస్థతో పోల్చారు. "ఆర్ఎస్ఎస్ ఒక విద్వేషపూరిత సంస్థ. అది విద్వేషాన్ని వ్యాప్తి చేస్తుంది. విద్వేషాన్ని పెంచి పోషిస్తుంది. ఆ సంస్థ నుంచి నేర్చుకోవాల్సింది ఏమీ లేదు. అల్ ఖైదా ఎలాగైతే రక్తపాతంతో పనిచేస్తుందో, దేశంలో ఆర్ఎస్ఎస్ కూడా విద్వేషాన్ని వ్యాప్తి చేస్తూ అదే పని చేస్తోంది" అని తీవ్ర విమర్శలు చేశారు. ఆర్ఎస్ఎస్ సంస్థాగత శక్తిని ప్రశంసిస్తూ దిగ్విజయ్ సింగ్ చేసిన సోషల్ మీడియా పోస్ట్‌పై స్పందిస్తూ ఠాగూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు అగ్రనేతల పాదాల వద్ద కూర్చున్న క్షేత్రస్థాయి కార్యకర్త (నరేంద్ర మోదీ) ప్రధాని కాగలగడం వారి సంస్థాగత శక్తికి నిదర్శనమని దిగ్విజయ్ పేర్కొన్నారు.

బీజేపీ మండిపాటు

మాణికం ఠాగూర్ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్.పి. సింగ్ ఘాటుగా స్పందించారు. "మాణికం ఠాగూర్ మాట్లాడే ముందు పదిసార్లు ఆలోచించుకోవాలి. లేకపోతే పరువునష్టం దావా ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని హెచ్చరించారు. దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యలను సింగ్ సమర్థిస్తూ, బీజేపీలో సామాన్య కార్యకర్త కూడా ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి కాగలరని, కానీ కాంగ్రెస్‌లో మాత్రం సోనియా, రాహుల్, ప్రియాంక అంటూ ఒకే కుటుంబం చుట్టూ రాజకీయాలు నడుస్తాయని విమర్శించారు.

పార్టీ బలోపేతాన్ని నేనూ కోరుకుంటున్నా...

దిగ్విజయ్‌కి శశిథరూర్ మద్దతు

న్యూఢిల్లీ: బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లకు ఉన్న సంస్థాగత బలాన్ని మెచ్చుకుంటూ... కాంగ్రెస్ శక్తిమంతం కావాల్సి ఉందని అభిప్రాయపడుతూ ఆ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆయన వ్యాఖ్యలను సొంత పార్టీ నేతలు తప్పుపడుతు న్నారు. ఈ నేపథ్యంలో దిగ్విజయ్ వ్యాఖ్యలకు మరో కాంగ్రెస్ నేత శశిథరూర్ మద్దతు పలికారు. కాంగ్రెస్ పార్టీ 140వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో థరూర్ వ్యాఖ్యలు ఆ పార్టీ వర్గాల్లో చర్చకు దారితీశాయి. దిగ్విజయ్ వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా... తమ సంస్థ బలోపేతం కావాలని తాను కూడా కోరుకుంటున్నట్లు థరూర్ తెలిపారు. దీనిపై ఎలాంటి చర్చ అవసరం లేదన్నారు. ఏ పార్టీలో అయినా క్రమశిక్షణ అవసమన్నారు. నేడు పార్టీకి చాలా ముఖ్యమైన రోజని, మనకు 140 ఏళ్ల చరిత్ర ఉందని, పార్టీ నుంచి మనం ఎంతో నేర్చుకోవచ్చని చెప్పారు. కాగా, శనివారం ప్రధాని మోదీకి చెందిన పాత ఫొటోను దిగ్విజయ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆర్ఎస్ఎస్‌లో సామాన్య కార్యకర్త నుంచి ప్రధానిగా మోదీ ఎదిగిన విధానాన్ని ఆయన కొనియా దారు. ఇది బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు ఉన్న సంస్థాగతమైన శక్తి అని అభివర్ణించారు. ఈ పోస్టుపై తర్వాత ఆయన మాట్లాడుతూ... బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు తాను వ్యతిరేకినన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర, ఎల్.బి.నగర్ : నూతనంగా మహాగ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏర్పాటు చేస్తున్నటువంటి నూతన సర్కిల్‌ను, డివిజన్‌లో ప్రజల సౌకర్యార్థం, ఆలోచన చేసి అందరికీ సెంటర్‌గా ఉండేటట్లు సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని, సిపిఐ ఉప్పల్ మండల, మేడ్చల్ జిల్లా సమితి నుండి డిమాండ్ చేస్తున్నట్లు, ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన పరిపాలన కార్యాలయం,పెద్ద అంబర్పేట్ లో తాత్కాలికంగా ఏర్పాటు చేయడానికి పూనుకున్న అధికారులు, ప్రజల అసౌకర్యాన్ని కూడా గమనించాలిఒక పక్కన మూడు డివిజన్లోప్రజలకు 12 కిలోమీటర్లుదూరం అవుతుంది, ప్రజలు వెళ్లి వారి యొక్క సంబంధిత సమస్యలు పరిష్కారానికి 12 కిలోమీటర్లు ప్రయాణం చేయవలసి వస్తుంది, పేద,మధ్యతరగతి, వర్గాలు వారికి తీవ్ర అసౌకర్యంగా ఉంటుంది. కావున ముందుచూపుతో సర్కిల్లోని అన్ని డివిజన్లో ప్రజల సౌకర్యార్థం తట్టి అన్నారం గ్రామంపరిధిలో గల ప్రభుత్వ భూమి ఉన్నందున శాశ్వత సర్కిల్ కార్యాలను ఏర్పాటు చేయాలని సీపీఐ పార్టీ నుంచి మేము డిమాండ్ చేస్తున్నాం

60మంది డిఈఈల బదిలీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధి విస్తరణతో పాటు పరిపాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎస్‌డబ్ల్యూఎం) విభాగంలో 60 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను బదిలీ చేస్తూ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి అనుగుణంగా జీహెచ్ఎంసీని 12 జోన్లు, 60 సర్కిల్స్‌గా పునర్వ్యవస్థీకరించింది. ఈ నేపథ్యంలో విస్తరించిన గ్రేటర్ పరిధిలో చెత్త సేకరణ, నిర్వహణ సమర్థవంతంగా సాగేందుకు ఈ బదిలీలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీ నగర్, షామ్‌షాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికిందరా బాద్, సేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లలోని వివిధ సర్కిల్స్‌కు ఈ ఇంజినీర్లను నియమించారు. బదిలీ అయిన ఇంజినీర్లు వెంటనే కొత్త పోస్టుల్లో బాధ్యతలు స్వీకరించాలని, సంబంధిత సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు దీనికి సహకరించాలని ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీ విస్తరించిన నేపథ్యంలో పరిశుభ్రతను మరింత మెరుగుపరచేందుకు ఈ చర్యలు దోహదపడనున్నాయి.

సమస్యల పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని తాళ్లబస్తి వద్ద స్థానికుల పిలుపు మేరకు కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్డు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల మార్పు, ఐరన్ పోల్ ఎర్తింగ్ వస్తుందని సిమెంట్ పోల్ ఏర్పాటు చేయాలని తదితర సమస్యలు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా కార్పొరేటర్ ప్రేం కుమార్ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బాలాజీ, మహంతి, రాఘవ, విజయ్ కుమార్, పూర్ణ, శాస్త్రి, సందీప్, సుబ్బారావు, సత్యనారాయణ, కిషోర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బస్ సర్వీస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-దుండిగల్: బస్ సర్వీస్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రణీత్ ప్రణవ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ జిహెచ్ఎంసి పరిధి బహదూర్ పల్లి ప్రణీత్ ప్రణవ్ ఫ్లోరా అపార్ట్మెంట్ కమిటీ సభ్యుల వినతి మేరకు మియాపూర్ డిపో ఎం వి వెంకటేశం, డిప్యూటీ ఆర్ఎం అపర్ణ కళ్యాణి స్పందించి ఆదివారం ఆయా ప్రాంతాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నిత్యం వృత్తి రీత్యా వేవ్ రాక్,మైండ్ స్పేస్,జేఎన్‌టీయూ,ప్రగతి నగర్ ప్రాంతాలకు ప్రయాణించే ఉద్యోగులు,ప్రయాణికుల సౌకర్యార్థం బహదూర్‌పల్లి క్రాస్ రోడ్స్ నుంచి ప్రణీత్ ప్రణవ్ ఫ్లోరా అపార్ట్మెంట్ల మార్గంగా రెండు నూతన బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు.ఈ బస్సు సేవలు ఉదయం 9:15 గంటలకు బహదూర్‌పల్లి క్రాస్ రోడ్స్ నుంచి ప్రయాణం మొదలు అయ్యి అలాగే సాయంత్రం తిరిగి వేవ్ రాక్ నుంచి 4:00,5:00 గంటలకు బస్సులు బహదూర్ పల్లికి ప్రయాణిస్తాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సేవల ద్వారా ఐటీ కారిడార్ ప్రాంతాలకు సులభమైన, సమయపాలనతో కూడిన ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది.ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రారంభించిన ఈ సేవలను ప్రయాణికులు అందరూ సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని ప్రణీత్ ప్రణవ్ ఫ్లోరా అపార్ట్మెంట్ కమిటీ సభ్యులు కోరుతున్నారు.



బుక్ ఫెయిర్‌లో అభ్యుదయ గీతాల ప్రదర్శన

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ 2025లో శ్రీ సాయి సిద్దేంద్ర కళా ప్రాంగణం నుండి సరస్వతి యాదవ్ శిష్యబృందం మాజీ గవర్నర్ బండారి దత్తాత్రేయ సమక్షంలో అభ్యుదయ గీతాల మీద ప్రదర్శన ఇవ్వడం జరిగింది. మాజీ గవర్నర్ బండారి దత్తాత్రేయ అద్భుతమైన వాక్యాలు, ఆయన అమూల్యమైన అనుభవాన్ని భగవద్గీత గురించి భాగవతం, బుక్స్‌తో ఉన్న అనుబంధం చాలా గొప్పగా వివరించారు. ఇలాంటి మంచి మంచి విషయాలు ప్రస్తావించడం జరిగింది. ఇందులో చిన్న పిల్లలు పెద్దలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది

మంచినీటి సమస్యకు చర్యలు

విశాలాంధ్ర - మొయినాబాద్: గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూస్తానని గ్రామ సర్పంచ్ వెంకటేష్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని భాకారం గ్రామంలోని 4వ వార్డులో మంచినీటి పైప్ లైన్ లీకేజీ పనులకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలోని ప్రతివార్డులో సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్తులందరి సహకారం తో గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని చెప్పారు. గ్రామస్తులందరూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ పేరు తొలగింపుపై నిరసన తీర్మానం చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి బిల్లులో చేసిన మార్పులపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో మంత్రులు వివేక్ వెంకట్ స్వామి, అజారుద్దీన్ ఇతర ముఖ్య నేతలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు తమ మొదటి గ్రామ సభలో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ తిరిగి గాంధీజీ పేరు చేర్చాలని అన్ని గ్రామ పంచాయతీల్లో తీర్మానం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. 2004 లో యుపిఎ ప్రభుత్వంలో సోనియా గాంధీ నేతృత్వంలో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి గా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆనాడు ఉన్న పరిస్థితుల్లో 2004 కి ముందు ప్రభుత్వాల పనితీరు వల్ల ఏర్పడిన ఇబ్బందుల వల్ల సరిదిద్దడానికి ఆనాడు అనేక మంది మేధావులు ,సామాజిక వేత్తలతో చర్చలు జరిపి ఈ వారి సలహాలు సూచనలతో గ్రామీణ ప్రాంతాలను బతికించడానికి ఉపాధి హామీ పథకం తీసుకొచ్చిందని గుర్తు చేశారు.ప్రజల ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందులు లేకుండా వలసలు పోకుండా ఉండడానికి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చి ప్రజల జీవితాలు మార్చిన ఈ పథకం దేశ రూపు రేఖలు మార్చిందని అభివర్ణించారు. 2014 ఎన్నికల్లో ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరిస్తామని బీజేపీ ఎన్నికల్లో హామీ ఇచ్చి ఆది చేయకపోగా ఉన్న పథకానికి తూట్లు పొడుస్తుందనీ పేర్కొన్నారు. మహాత్మా గాంధీ పేరు తీసేసి జీ రామ్ జీ పేరు పెట్టీ గతంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించే దీనిని 60:40 నిధులు భరించేలా చేసి రాష్ట్రాల పై మరింత భారం వేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపాధి హామీ పథకంపై చేసిన బిల్లుల మార్పు పై వెనక్కి తగ్గాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించి దేశ అభివృద్ధి నిర్మాణంలో మహోన్నత కార్యక్రమాలతో దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్లిందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం గాంధీ, నెహ్రూ, ఇందిరా గాంధీ ల చరిష్మా చేరిపేయాలని చూస్తోందని వారు చేసిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను ముందుచిందని పేర్కొన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా అన్ని గ్రామాల్లో గాంధీ ఫోటోలతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసనలు తెలిపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

'మా ఇల్లు' అనాధాశ్రమకు మంత్రి సీతక్క సందర్శన

విశాలాంధ్ర - హైదరాబాద్ : జనగామ జిల్లా జాఫర్‌గడ్‌లో ఉన్న మా ఇల్లు అనాధాశ్రమాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క సందర్శించారు. ఈ సందర్భంగా అనాధాశ్రమంలో నివసిస్తున్న చిన్నారులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు, చదువు, వసతుల గురించి తెలుసుకున్నారు. అనాధాశ్రమాన్ని నిర్వహిస్తున్న గాదె ఇన్నయ్యను ఇటీవల ఎన్ ఐఏ అరెస్ట్ చేయడంతో ఆయన సతీమణిని మంత్రి సీతక్క ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొంటూ కూడా అనాధాశ్రమాన్ని కొనసాగిస్తున్న వారి సేవలను మంత్రి ప్రశంసించారు. గాదె ఇన్నయ్యను మిస్ అవుతున్నామని పిల్లలు కన్నీళ్లు పెట్టగా, మంత్రి సీతక్క వారికి ధైర్యం చెప్తుతూ ధైర్యంగా ఉండాలి, క్రమశిక్షణగా మెలగాలి అని సూచించారు. మీరు ఎప్పటికీ నిరాశ చెందవద్దని, అందుకే తాను అడపాదడపా ఈ ఆశ్రమాన్ని సందర్శిస్తున్నానని తెలిపారు. చిన్నారులు బాగా చదువుకోవాలని, వారి చదువు, బసకు అవసరమైన వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి సీతక్కతో చిన్నారులు ఫోటోలు దిగారు. అనంతరం సాగరం గ్రామంలోని గాదె ఇన్నయ్య నివాసానికి చేరుకుని, అనారోగ్యం తో మంచానికే పరిమితం అయిన ఆయన తల్లిదండ్రులను మంత్రి సీతక్క పరామర్శించారు. తమ కుమారుడిని విడుదల చేయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు

జర్నలిస్టులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు : శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర, హైదరాబాద్ : అక్రిడిటేషన్‌ల కోసం నూతనంగా విడుదలైన జీవో 252లో మండ లానికి ఒక్క అక్రిడిటేషన్ నిబంధనతో మేడ్చల్, రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులు ఆందోళకు గురికావాల్సిన అవసరం లేదని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నూతన జీవోలో మండలానికి ఒక్క కార్డు నిబంధన వల్ల గ్రేటర్ పరిధిలో అర్బన్ మండలాలో ప్రధాన పత్రికలలో పని చేస్తున్న జర్నలిస్టులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని మీడియా అకాడమీ చైర్మన్ దృష్టికి ఆదివారం తీసుకెళ్లడం జరిగింది. టియుడబ్ల్యూజె-ఐజేయు, హెచ్‌యూజె, మేడ్చల్, రంగారెడ్డి, జిల్లాల ప్రతినిధుల బృందం ఈ మేరకు కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. అర్బన్ మండలాలో ప్రధాన పత్రికలలో కనీసం ముగ్గురు నుంచి నలుగురు విలేకరులు పనిచేస్తున్నారని ఒకటే కార్డు విధానంతో మిగిలిన వారికి నష్టం జరుగుతుందని వివరించారు. గతంలో మాదిరిగా పని చేస్తూన్న వారికి కార్డులు వచ్చేలా జీవోను సవరించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఇందుకు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. నిజమైన జర్నలిస్టులకు ఇబ్బందులు తలేత్తకుండా చూస్తామని తెలిపారు. తన దృష్టికి వచ్చిన వాటిని పరిశీలించి ఖచ్చితంగా సవరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాం నారాయణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, హెచ్ యు జె అధ్యక్షులు శంకర్ గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీమ్, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కారం : ఎమ్మెల్యే మర్రి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఆదివారం గోపాల్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉత్తమ్‌నగర్ నుంచి జ్యోతినగర్ వరకు ఉన్న వివిధ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి మల్కాజ్‌గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌతమ్ నగర్ పరిసర ప్రాంతాల కాలనీవాసులు తమ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా బాక్స్ డ్రెన్లు, స్పీడ్ బ్రేకర్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ఆర్‌యూబి నిర్మాణం, తాగునీటి సమస్య, రైల్వే ఖాళీ స్థలాల్లో పార్కుల అభివృద్ధి, ఇంకుడు గుంతల నిర్మాణం, మ్యాన్‌హోల్స్‌పై మూతలు వేయడం, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యల నివారణ, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు వంటి అంశాలను వివరించారు. ఎమ్మెల్యే గారు సానుకూలంగా స్పందిస్తూ అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే కాలంలో మల్కాజ్‌గిరిని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘాటించారు. మల్కాజ్‌గిరి అభివృద్ధికి తాను చేసిన కృషిని వివరించారు.జెఎల్ఎస్ఎన్ నగర్‌లో దేవాదాయ భూముల్లో నివసిస్తున్న పేదలకు నోటీసులు జారీ చేయగా, కోర్టు ద్వారా స్టే తెప్పించానని తెలిపారు. గౌతమ్ నగర్ కాలనీవాసుల త్రాగునీటి సమస్య పరిష్కారానికి మహేంద్రహిల్స్‌లో రూ.15 కోట్ల వ్యయంతో 5 ఎంఎల్‌డీ వాటర్ రిజర్వాయర్ నిర్మిస్తున్నామని చెప్పారు.ఏఓసీ అదనపు 100 ఫీట్ల వెడల్పు రోడ్లను రూ.900 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. గౌతమ్ నగర్ ఆర్‌యూబిని రూ.28 కోట్లతో, వాజ్పేయి నగర్ ఆర్‌యూవిని రూ.74 కోట్లతో ఒక ఇల్లు కోల్పోకుండా నిర్మిస్తున్నామని, ఏదైనా భూమి కోల్పోతే గజానికి లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సఫిల్‌గూడ ఆర్‌యూబి నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. విద్యుత్ శాఖ ద్వారా రూ.42 కోట్ల వ్యయంతో 23 కిలోమీటర్ల మేర సింగిల్ ఫేజ్ నుంచి త్రీ ఫేజ్ కన్వర్షన్ చేసి, అదనంగా 72 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆర్‌కే నగర్ బ్రిడ్జి వద్ద సబ్‌స్టేషన్ ప్రతిపాదన చేపట్టామని పేర్కొన్నారు.హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో ఉన్న మీర్జల్‌గూడ 60 ఫీట్ల రోడ్డును ప్రజలకు అనుకూలంగా 33 ఫీట్ల రోడ్డుగా మార్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. జీహెచ్ఎంసీ ద్వారా కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.నేరేడుమెట్‌లో రూ.1.43 కోట్లతో యూపీహెచ్‌సి నిర్మాణం జరుగుతోందని, రూ.46 కోట్లతో కోర్టు భవనం నిర్మిస్తున్నామని చెప్పారు. రాధాకృష్ణనగర్ (ఆర్‌కే నగర్)గా రైల్వే స్టేషన్ పేరు మార్పుకు కృషి చేశామని తెలిపారు. గౌతమ్ నగర్ మెయిన్ రోడ్డును సీఆర్ఎంపీ రోడ్లుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. పలువురు స్థానిక యువకులు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. వారికొ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు కన్నా గారిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, మేకల రాము యాదవ్, మురుగేష్, ప్రభాకర్ గౌడ్, బైరు అనిల్, సిద్ధి రాములు, కిట్టు, నగేష్, హేమంత్ పటేల్, రాజశేఖర్ రెడ్డి, నర్సింగ్ రావు, అలాగే స్థానిక కాలనీవాసులు కృష? కుమార్, నాగేశ్వరరావు, కిరణ్ పాట్నాయక్, వెంకటయ్య, శ్రీనివాస్, నూర్ అహ్మద్ అలీ, డేనియల్, మైసయ్య, సయ్యద్ జానీ, రాము బబుల్ రెడ్డి, కెప్టెన్ సాయికుమార్ పాల్గొన్నారు.

పీజేఆర్ కృషి చిరస్మరణీయం: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మహానగర రాజకీయాల్లో గత యాభై ఏళ్లుగా చెరగని ముద్ర వేసిన ధీశాలి, నిఖార్సైన మాస్ లీడర్ పి. జనార్ధన్ రెడ్డి (పీజేఆర్) అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఖైరతాబాద్ చౌరస్తాలో పీజేఆర్ 18వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉంటూనే, ప్రజల ప్రయోజనాల కోసం సొంత ప్రభుత్వాన్ని నిలదీసిన ధైర్యశాలి పీజేఆర్ అని గుర్తుచేశారు. ముఖ్యంగా "కృష్ణా జలాలు తెచ్చి హైదరాబాద్ దాహార్తి తీర్చాలనే నినాదంతో ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అద్భుత అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఉంటే, పీజేఆర్ గుండె ఆనందంతో పులకించి పోయేదని కేటీఆర్ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరాభివృద్ధిపై పీజేఆర్ కి ఉన్న విజన్ ను బీఆర్ఎస్ ప్రభుత్వం నిజం చేసిందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల నాయకులు ఏ పార్టీకి చెందిన వారైనా, ప్రజా సేవలో పీజేఆర్ చూపిన నిబద్ధతను మరియు శ్రద్ధను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సేవలోనే కన్నుమూసే అరుదైన భాగ్యం పీజేఆర్ కు దక్కిందని ఆయన అన్నారు. పీజేఆర్ ఆశయాలను ఆయన సుపుత్రుడు, మాజీ శాసనసభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని కేటీఆర్ ప్రశంసించారు. ఒకవైపు జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయాన్ని పీజేఆర్ ఆలోచనలకు అనుగుణంగా, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ అభివృద్ధి చేయడంతో పాటు, మరోవైపు హైదరాబాద్ నగర ప్రజల సంక్షేమంలో విష్ణు తనదైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఏ తండ్రికైనా తన సంతానం ఇచ్చే గొప్ప ట్రిబ్యూట్ వారి ఆశయాలను కొనసాగించడమేనని, ఆ విషయంలో విష్ణువర్ధన్ రెడ్డి సఫలమ య్యారని కేటీఆర్ అభినందించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్లు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని జననేతకు నీరాజనాలు అర్పించారు.



కార్మిక రంగానికి మార్గదర్శకుడు పిజెఆర్

విశాలాంధ్ర, పటాన్ చెరువు : కార్మిక రంగానికి, బడుగు బలహీనవర్గాలకు మాజీ మంత్రి, కార్మిక నాయకులు పి. జనార్ధన్ రెడ్డి చేసిన సేవలు మరువలేనివని పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పిజెఆర్ 18 వ వర్ధంతి పురస్కరించుకుని.. పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని పీజెఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బిఆర్టియు కిర్బీ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, కిర్బీ కార్మిక సంఘం నాయకులు మాధవరావు, యాదగిరి, వెంకటేష్, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్పనేత పీజేఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప ప్రజానేత పీజేఆర్ అని, ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన పీజేఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఖైరతాబాద్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజానేత దివంగత పి. జనార్ధన్ రెడ్డి (పీజేఆర్)18వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీజేఆర్ విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అజారుద్దీన్, కార్పొరేటర్ విజయ రెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శతాబ్ధి ఉత్సవాల పతాకావిష్కరణ

విశాలాంధ్ర, ఎల్.బి.నగర్ : మోహన్ నగర్ సీపీఐ పార్టీ శాఖ ఆధ్వర్యంలో, ప్రజ నివాస్ ఎక్స్ రోడ్‌లో సీపీఐ శతాబ్ధి ఉత్సవాలను పురస్కరించుకుని పతాకావిష్కరణ సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమం ఉడుతల మల్లేష్ అధ్యక్షతనలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఐ సినియర్ నాయకులు బొడ్డుపల్లి చిక్కయ్య, ఎల్బీనగర్ జోన్ మున్సిపల్ అండ్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎం.మద్దిలేటి, ఉప్పల మండల పార్టీ సహాయ కార్యదర్శి ఎం.డి బషీర్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ... ప్రపంచ చరిత్రలో లిఖించ బడిన చరిత్ర, భూమి కొరకు, భుక్తి కొరకు, వెట్టి చాకిరి విముక్తి కొరకు జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అన్నారు. వెలకట్టలేని త్యాగాలు, ఉజ్వల పోరాట ఘట్టాలు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఎర్రజెండా, కార్మిక, కర్షక లోకానికి అండ సిపిఐ జండా అని తెలియజేశారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే జాతీయ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. చెరుకు ఈశ్వర్, జంగయ్య, సంతోష్, బాలమణి, లక్ష్మి, బ్రహ్మం, విజయ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు సరైన న్యాయం జరుగుతోందని, స్వాతంత్ర్యానికి ముందు నుండి పని చేస్తుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరంగా కృషి చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, గుండా నిరంజన్, జి.ఎన్.వి.సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, ఎస్.ఆర్.ప్రసాద్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, వినోద్ యాదవ్, సయ్యద్ యూసుఫ్ బాయ్, ఫరీద్, సయ్యద్ మబ్బు, ఇస్తారీ, ఇందిరా ప్రియదర్శిని, ఆశా, రోజా రమణి, బ్రహ్మయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

లౌకిక విలువలు కాంగ్రెస్ పార్టీ లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ అని, ప్రజలకు సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం కల్పించాలనే మహత్తర లక్ష్యాలతో ఆంగ్లేయ పాలకులపై పోరాటం చేసి స్వాతంత్ర్య భారతదేశాన్ని సాధించిన ఘన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన త్యాగాలు అనిర్వచనీయమని, వారి త్యాగాల ఫలితంగానే నేడు దేశం ప్రజాస్వామ్య విలువలతో ముందుకు సాగుతోందని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో రాజ్యాంగాన్ని అమలు చేసి ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టంగా నిలబెట్టడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. దేశ ప్రజలకు సమాన హక్కులు, సామాజిక న్యాయం, లౌకిక విలువలు అందించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును కాపాడేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, అభిమాని క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ భవన్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించగా, గౌరవ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు సేవాదళ్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నాయకులు, యువజన విభాగం, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమమే సమాజ భవిష్యత్తుకు పునాది

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూ ప్రభుత్వ హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థులు చలికాలంలో ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోన కుండా ఉండాలనే సదుద్దేశంతో, రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో బెడ్‌షీట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మహబూబ్‌నగర్ నగరంలోని బోయపల్లి ఎస్సీ హాస్టల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థులకు స్వయంగా బెడ్‌షీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సంస్థ సేవలు ప్రశంసనీయమని అన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, కష్టపడి చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆయన సూచించారు. విద్యే నిజమైన ఆస్తి అని, విద్యార్థుల అవసరాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు ఖాజా పాషా, అజ్మత్ అలి తదితరులు పాల్గొని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి సిద్ధార్థ రెడ్డి కృషి

విశాలాంధ్ర-కొత్తూరు: కొత్తూరు మండలం, పెంజర్ల గ్రామంలోగల ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి మాజీ సర్పంచ్ మామిడి వసుంధరమ్మ తనయుడు మామిడి సిద్ధార్థ రెడ్డి చేసిన కృషి మరువలేనిదని గ్రామస్తులన్నారు. గ్రామ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి మామిడి సిద్ధార్థ రెడ్డి స్వంత నిధులు రూ.6లక్షల 50 వేలతో పాఠశాలలో అనేక అభివృద్ధి పనులు చేయించినట్లు ఆదివారం ఆయన మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ఈ నిధులను వినియోగించామన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం తరగతి గదుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ సహకారం అందించినట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిపై మామిడి సిద్ధార్థ రెడ్డి చూపిన చొరవను గ్రామస్తులు అభినందించారు.విద్యాభివృద్ధికి ఇలాంటి సహకారం ఆదర్శంగా నిలుస్తుందని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేశాల భీమయ్య పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధంకండి

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : జీహెచ్ఎంసీ ఎన్నికలకు బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కార్యకర్తలు సిద్ధంకావాలని బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రామ్ శేఖర్ పిలుపునిచ్చారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ న్యాయవిద్య (ఎల్ ఎల్ బి) పట్టా పొందిన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రామ్ శేఖర్‌ని స్థానిక నాయకులతో కలిసి మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఇబ్రామ్‌శేఖర్ మాట్లాడుతూ న్యాయవిద్య అనేది ఉన్నతమైన విద్య అని బాబా సాహెబ్ అంబేద్కర్‌ని ఆదర్శంగా తీసుకొని న్యాయ కోవిదులుగా పనిచేయాలని ఆకాంక్షించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలలో 300 డివిజన్ లలో బీఎస్పీ పోటీ చేస్తుందని మీ పరిధిలో ఉన్న అన్ని డివిజన్ లలో పోటీకి సిద్ధంగా ఉండాలని అందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం బాబా సాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు పద్దిగళ్ళ బాబు, ఉపాధ్యక్షులు లపంగి రాజు, ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు, కార్యదర్శి అడ్వకేట్ నెమలి సత్యనారాయణ, సోషల్ మీడియా కన్వీనర్ ఏర్పుల రవి కుమార్, మాజీ ఉపాధ్యక్షులు మేతరి కుమార్, మాజీ కార్యదర్శి జంతుక సైదులు, కోహెడవార్డు అధ్యక్షులు శీలం అంగద్ కుమార్, మునుగనూరు వార్డు అధ్యక్షులు అల్వాల జాన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర ఉద్యమంలో కాంగ్రెస్ కీలకపాత్ర

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: స్వాతంత్ర ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు.భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవ దినోత్సవ సందర్భంగా ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 279 డివిజన్ రోడమేస్త్రి నగర్,శ్రీరాం నగర్ బస్టాప్ లలో పార్టీ శ్రేణులతో కలిసి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కొలను హన్మంత్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత పురాతన పార్టీ కాంగ్రెస్,అనేక మంది మహనీయుల సంకల్పంతో ఏర్పడిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు.స్వాతంత్ర్య పోరాటం,దేశ నిర్మాణంలో పార్టీ పాత్ర ఎనలేనిదని,జాతీయ ఉపాధి హామీ చట్టం పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతునదని వ్యక్తం చేశారు.అధికారం ఉందని కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన నిర్ణయలు తీసుకుంది.ప్రతి భారతీయుని గౌరవం దెబ్బ తీసేలా తీసుకున్న నిర్ణయాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని మండిపడ్డారు.అట్టడుగు పేద ప్రజలు కరువు కాటకాల్లో ఉన్నపుడు కాంగ్రెస్ తీసుకున్న గొప్ప పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని,నేషనల్ హెరాల్డ్ కేసులో కేంద్ర ప్రభుత్వం సోనియా గాంధీ,రాహుల్ గాంధీలపై అక్రమంగా కేసులు బనాయిస్తోంద న్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్,సిద్దనోల్ల సంజీవరెడ్డి,పండరి రావు, లయక్,అరుణ్ ,అజయ్,గఫ్ఫార్, మహేష్,లక్ష్మీ, కామేష్, రహీమ్,అహ్మద్, విశాల్,రమేష్ ,శశికళ, సరస్వతి,రాణి,రమేష్,రామచందర్, నరసింహ,తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్‌కి ఘన నివాళి

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: కాంగ్రెస్ పార్టీ మాజీ సీఎల్పీ లీడర్ పి. జనార్ధన్ రెడ్డి =వర్ధంతి సందర్భంగా మసీద్ బండ చౌరస్తా లోని ఆయన చిత్రపటానికి స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పి. జనార్ధన్ రెడ్డి చేసిన సేవలు అమూల్యమైనవని పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారని అన్నారు.. పార్టీకి కష్టకాలం లో అండగా నిలిచి కాంగ్రెస్ పార్టీ బావ జలాన్ని ప్రజల హృదయాల్లో నిలిపిన నాయకుడిగా ఆయన ఎప్పటికీ చిరస్మరణీయులుగా ఉంటారన్నారు.. పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జాకీర్, డివిజన్ అధ్యక్షులు మహేందర్, టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్, మహిళ నాయకులు జయమ్మ, విద్యార్థి నాయకులు, మైనారిటీ నాయకులు ఆజం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తో రవీందర్ యాదవ్ భేటీ

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో చిర్రా రవీందర్ యాదవ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌కి కృష్ణుడి ప్రతిమ అందజేశారు. పార్టీ కోసం శ్రమిస్తున్న చిర్రా రవీంద్ యాదవ్ పై కేసీఆర్ ప్రశంసలు కురిపించారు. శేరిలింగంపల్లిలోని తాజా రాజకీయాలపై కేసీఆర్ కి చిర్రా రవీందర్ యాదవ్ వెల్లడించారు. చిర్రా రవీందర్ యాదవ్ యోగ క్షేమాలు కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, రానున్న అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్దే విజయమని, చిర్రా రవీందర్ యాదవ్ వెల్లడించారు.

మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుదాం.

విశాలాంధ్ర - మొయినాబాద్: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి విజయం ఖాయమని చేవెళ్ల మాజీ శాసనసభ్యులు కెఎస్. రత్నం అన్నారు. మొయినాబాద్ బిజెపి మున్సిపల్ అధ్యక్షులు మాదాపురం శ్రీకాంత్ ఆధ్వర్యంలో సన్నాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ శాసనసభ్యులు కేఎస్. రత్నం , బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్ లు మాట్లాడుతూ.... రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలని తెలిపారు. ప్రతి ఒక్కరు బిజెపి అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. గోపాల్ రెడ్డి , మోహన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నరసింహారెడ్డి, శ్రీరాములు, రాజు, మహేందర్ , మాధవరెడ్డి , ఆనంద్, సుదింద్ర శర్మ, శ్రవణ్ గౌడ్, లక్ష్మీపతి, జిల్లా, రాష్ట్ర , బూత్ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

మెగా పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్

- హైదరాబాద్‌ను మరింత స్వచ్ఛందంగా తీర్చిదిద్దేందుకు జీహెచ్ఎంసీ చర్యలు
- నేటి నుంచి జనవరి 31 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

విశాలాంధ్ర, హైదరాబాద్ : నగర పరిశుభ్రత ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు, దీర్ఘకాలికంగా పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అతిపెద్ద పారిశుధ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాల మేరకు డిసెంబర్ 29 నుంచి జనవరి 31, 2026 వరకు ఈ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ 300 వార్డులను కవర్ చేస్తూ పారిశుధ్య పనులు చేపట్టనున్నారు. వార్డుల పునర్విభజన అనంతరం నిర్వహిస్తున్న తొలి సమగ్ర పారిశుధ్య డ్రైవ్ ఇదే. నగరాన్ని దీర్ఘకాలంగా పోగుబడిన వ్యర్థాల నుంచి విముక్తం చేయడంతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా జీహెచ్ఎంసీ పేర్కొంది. ఈ డ్రైవ్‌కు సూక్ష్మంగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనున్నారు. డిసెంబర్ 29న ఫుట్ ఓవర్ బ్రిడ్జిల శుభ్రతతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం, తదుపరి రోజుల్లో ఫ్లై ఓవర్లు ,రోడ్డు పక్కలు, డివైడర్లు, సెంట్రల్ మీడియన్లు, కర్బ్ స్టోన్లు,చెరువులు, నాలాలు,ఫుట్‌పాత్‌లు, పార్కులు , నిర్మాణ-కూల్చివేత (సి అండ్ డి) వ్యర్థాల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద పేరుకుపోయిన చెత్త తొలగింపు వంటి విభిన్న కార్యకలాపాలను క్రమబద్ధంగా చేపట్టనున్నారు. ఈ డ్రైవ్‌లో చెత్త నిల్వ ప్రాంతాల పూర్తిస్థాయి నిర్మూలన, పచ్చి వ్యర్థాల తొలగింపు, దీర్ఘకాలంగా పోగుబడిన వ్యర్థాల తొలగింపుకు డ్రైవ్‌లో ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నారూ, జీవిపిలను సెల్ఫీ పాయింట్లుగా మార్చి, గోడచిత్రాలు, రంగోలి డిజైన్లు, మొక్కలు నాటడం ద్వారా నగర సౌందర్యాన్ని పెంపొందించనున్నారు. ఈ మెగా సానిటేషన్ డ్రైవ్ కార్యక్రమానికి ప్రజల భాగస్వామ్యం కీలకంగా భావించిన జీహెచ్ఎంసీ, విస్తృత అవగాహన కార్యక్రమాలను చేపట్టనుంది. పిల్లలు, యువత, వృద్ధులతో స్వచ్ఛత ప్రతిజ్ఞలు,ఈ-వేస్ట్ సేకరణ డ్రైవ్‌లు ,గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీల్లో పునర్వినియోగ వస్తువుల సేకరణ, పాఠశాలల్లో తడి, పొడి, హానికర వ్యర్థాల వేర్పాటు, ఆన్‌సైట్ కంపోస్టింగ్‌పై అవగాహన వంటి కార్యక్రమాలు డ్రైన్‌లో భాగంగా అధికారులు పౌర భాగస్వామ్యంతో నిర్వహించనున్నారు. అలాగే బహిరంగ మూత్ర విసర్జన, చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయడం, అక్రమంగా సి అండ్ డి వ్యర్థాలు వేయడం వంటి చర్యలపై తక్షణమే స్పందిస్తూ స్పాట్ లోనే బాధ్యులపై జరిమానాలు విధించనున్నారు. వీటితో పాటు రోడ్లపై ఉన్న స్క్రాప్ వాహనాలు, పాడైపోయిన ప్రజా మరుగు దొడ్లు తొలగించనున్నారు. ప్రజా మరుగుదొడ్ల పరిసరాల్లో శుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టి వినియోగ సౌలభ్యాన్ని మెరుగుపరచనున్నారు. ఈ డ్రైవ్‌ను విజయవంతంగా అమలు చేయాలని కమిషనర్ ఆర్ వి కర్ణన్ జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, వ్యర్థాల నిర్వహణ ఏజెన్సీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ ఘన వ్యర్థాలు (ఎంఎస్‌డబ్ల్యు), సి అండ్ డి వ్యర్థాల తొలగింపును వేగంగా చేపట్టేందుకు సరిపడా జేసిబి, వాహనాలు సమకూర్చుకోవాలన్నారు. ప్రతి రోజు చేపట్టిన పనులపై గూగుల్ షీట్ల ద్వారా నివేదికలు, ఫొటోలు, జియో-కోఆర్డినేట్లతో పర్యవేక్షణ చేపట్టనున్నారు. అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన ప్రాజెక్ట్ అధికారులు ప్రత్యేక రిసోర్స్ పర్సన్లను నియమించి జీవిపిలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. తక్షణ పారిశుధ్య చర్యలు చేపట్టడమే కాకుండా , దీర్ఘకాలికంగా స్థిరమైన పరిశుభ్రత అలవాట్లను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ మెగా డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ స్పష్టం చేశారు. మెగా సానిటేషన్ డ్రైవ్ విజయవంతంకు హైదరాబాద్‌ను దేశానికి ఆదర్శనగరంగా మార్చేందుకు ప్రతి పౌరుడు తనవంతు సహకారం అందించాలని కమిషనర్ కోరారు.

ఉపాధి హామీకి కేంద్రం ఉరి: నీలం

విశాలాంధ్ర, పటాన్ చెరువు : మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారిస్తూ గ్రామీణ పేదల ఉపాధికి కేంద్ర సర్కార్ ఉరి వేసే ప్రయత్నం చేస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ ఆరోపించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే ప్రయత్నాలకు నిరసనగా టీపీసీసీ పిలుపు మేరకు ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గాంధీ విగ్రహం వద్ద ఆ మహాత్ముని జెండా ఎగురవేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పేద ప్రజలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి ప్రధాని డా.మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని మహాత్మా గాంధీ పేరుతో ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 శాతం నిధులు సమకూర్చడం ద్వారా లక్షలాది పేద కుటుంబాలకు ఉపాధి లభించిందని, ఎంతోమంది ఆకలి చావుల నుంచి రక్షించబడడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు సైతం అభివృద్ధి చెందాయన్నారు. అయితే పేద ప్రజల ఉపాధిని ఓర్వలేని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని బలహీనపరిచి, కొత్త పేరుతో ప్రవేశపెట్టడం ద్వారా పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి 90 శాతం నిధులు ఇస్తుండగా, కొత్త చట్టంతో 60 శాతం నిధులు మాత్రమే కేంద్రం ఇస్తుందని 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని అనడం ఉపాధి హామీ పథకానికి సమాధి కట్టడమేనన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ వైఖరితో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైందని ఇప్పుడు ఈ భారం కూడా తోడవడంతో చాలా రాష్ట్రాలు ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్ముడు పేరుతో కాంగ్రెస్ పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ప్రయత్నం చేస్తే ఓర్వలేని బీజేపీ పేద ప్రజలను మళ్లీ ఆకలి చావులకు బలిచేసే విధంగా ప్రవర్తిస్తుందని విమర్శించారు.అదే విధంగా మహాత్ముడి పేరుతో సాగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వ అన్యాయాన్ని ప్రజ క్షేత్రంలో ఎండగడతామన్నారు. నిన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో తీర్మానించినట్టు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించని పక్షంలో జనవరి 5 నుంచి కాంగ్రెస్ పార్టీ పక్షాన దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుంకరి రవీందర్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ నారాయణ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, అజ్జు, ముత్తంగి అశోక్,గోపాల్, గౌరీ శంకర్, అనిల్ కుమార్, కరణ్, సుంకరి యాదయ్య, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయిబాబా మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పిన్నమనేని సాయిబాబా మృతి చెందారు. ఆయన మృతివార్త పార్టీ వర్గాలతో పాటు రాజకీయ వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. దశాబ్దాల పాటు పార్టీ కోసం అంకితభావంతో పని చేశారు. ఆయన మృతి టీటీడిపికి తీరని లోటుగా టీడీపీ నేతలు భావిస్తున్నారు

ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం

సీఎం చంద్రబాబు సంతాపం కాగా పిన్నమనేని సాయిబాబా మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ట్విట్టర్ ద్వారా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సాయిబాబా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీకి, వ్యక్తిగతంగా తీరని లోటు ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు తన సందేశంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతగా, సికింద్రాబాద్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడిగా, దివ్యాంగుల సంస్థ మాజీ చైర్మన్‌గా, ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడిగా సాయిబాబా చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దశాబ్దాల తరబడి పార్టీకి అంకితభావంతో చేసిన సేవలు మరిచిపోలేనివి, ఆయన మృతి పార్టీకి మాత్రమే కాకుండా వ్యక్తిగతంగా తనకు కూడా తీరని లోటు అని పేర్కొన్నారు. అలానే ప్రతి సారి పార్టీ కార్యాలయానికి వెళ్లినప్పుడు ముందుగా ఎదురొచ్చి ఆప్యాయంగా స్వాగతం పలికే సాయిబాబా ఇక లేరనే విషయం ఎంతో బాధ కలిగిస్తోందని సీఎం చంద్రబాబు భావోద్వేగంగా పేర్కొన్నారు. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, నాయకులతో కలుపుకుపోయేతత్వం ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. సాయిబాబా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ఈ కఠిన సమయంలో దేవుడు ధైర్యాన్ని ఇవ్వాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. పార్టీ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

నారా లోకేష్ సంతాపం...

టీడీపీ సీనియర్ నేత, ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు సాయిబాబా మృతిపట్ల సంతాపం తెలియజేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులుగా, దివ్యాంగుల సంస్థ ఛైర్మన్‌గా ఆయన సేవలందించారని, తెలంగాణలో పార్టీ పటిష్టత కోసం విశేష కృషి చేశారన్నారు. సాయిబాబా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నందమూరి బాలకృష్ణ సంతాపం....

తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు మృతికి ఎమ్మెల్యే బాలకృష్ణ సంతాపం తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ మంచి నాయకున్ని కోల్పోవడం జరిగిందని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పలువురి నాయకుల సంతాపం...

సాయిబాబా మృతి పట్ల పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, అరవింద్ కుమార్ గౌడ్‌లు తమ సంతాపాన్ని తెలియజేసారు. వీరి తోపాటు రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన, మాజీ ఉపాధ్యక్షురాలు నందమూరి సుహాసిని, రాష్ట్ర బీసీ సెల్ మాజీ అధ్యక్షులు శ్రీపతి సతీష్, మీడియా కమిటి ఛైర్మన్ ప్రకాశ్ రెడ్డి, మెదక్ పార్లమెంట్ కన్వీనర్ ఇల్లందు రమేష్ తదితతరులు నివాళులర్పించారు.

డెస్క్ జర్నలిస్టులకు న్యాయం చేస్తాం :విరాహత్ అలీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : జర్నలిస్టుల సంక్షేమం కోసం గత 70 ఏళ్లుగా పాటుపడుతున్న తమ సంఘం డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, బస్ పాస్‌లతో సహా అన్ని సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేసేందుకు తాము ప్రభుత్వంతో చర్చించి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ భరోసా ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టులను ఇతర జర్నలిస్టులను తాము వేరుగా చూడడం లేదని, వారికి కూడా బస్ పాస్‌లతో సహా ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని తప్పకుండా వర్తింప చేయిస్తామని అన్నారు.ఆదివారం బషీర్ బాగ్‌లోని యూనియన్ కార్యాలయంలో జరిగిన (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ముఖ్యుల సమావేశానంతరం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్ర నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. 10 ఏళ్ల కాలంలో డెస్క్ జర్నలిస్టులకు కొంత మందికి మాత్రమే అక్రిడేషన్ కార్డులు ఇచ్చారని, కానీ ఇప్పుడు తాము డెస్క్‌లో పనిచేసే జర్నలిస్టు లందరికీ మీడియా కార్డులు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డుతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా కృషి చేస్తామన్నారు. అదేవిధంగా నానాటికి జర్నలిజంలో అడుగంటుతున్న విలువలను పెంపొందించేందుకే కొన్ని కట్టుదిట్టమైన నిబంధన లతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 252 జీవోను తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. ఉనికి చాటుకోవ దానికి కొన్ని సంఘాలు, డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందంటూ గగ్గోలు పెట్టడంలో వాస్తవం లేదని, అబద్ధాలు, కల్పితాలతో వాళ్ళు చేస్తున్న అపోహలు నమ్మవద్దని ఆయన జర్నలిస్టుల ను కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత జర్నలిస్టులకు ఇచ్చిన అక్రిడేషన్ కార్డులు ఎంత వరకు పని చేశాయో, దానికి కారణం ఎవరన్నది ప్రతి జర్నలిస్ట్ కు తెలుసునన్నారు. జర్నలిస్టులను తీవ్ర నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న సంఘాలే నేడు జర్నలిస్టులకు మేలు జరుగుతోందంటే ఓర్చుకోలేకనే రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుంటే పోరాటం చేసే ఏ సంస్థలకైనా, ఏ సంఘాల కైనా టియు డబ్ల్యూజే మద్దతు ఉంటుందని, అయితే ఆ పోరాటం సహేతుకమైనది అయి ఉండాలన్నారు. 252 జీవో తో 13వేల అక్రిడేషన్ కార్డులు తగ్గుతున్నట్లు ఆందోళన చేస్తున్న సంఘానికి ఎవరు చెప్పారని ఆయన ప్రశ్నించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డులు అందేలా చేయడమే టియుడబ్ల్యూజే ప్రధాన ధ్యేయం అన్నారు. 252 జీవో తెచ్చి జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని విమర్శించడం సరైంది కాదన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ ఆధ్వర్యంలో ఏడుగురు ప్రముఖులైన పాత్రికేయులతో కమిటీ ఏర్పాటై, ఐదారుసార్లు సమావేశమై మార్గదర్శకాలు రూపొం దించిన విషయం గగ్గోలు చేస్తున్న మిత్రులకు తెలియదా? అని విరాహత్ ప్రశ్నించారు. సమాచార శాఖ కమిషనర్ తో పాటు ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు కే.శ్రీనివాస్, ది హిందూ పత్రిక పొలిటికల్ ఎడిటర్ రవికాంత్ రెడ్డి, వి6 వెలుగు పత్రిక సీఈవో అంకం రవి, సియాసత్ ఎడిటర్ ఆమెర్ అలీ ఖాన్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ నాయకుడు కె.ఎస్.హరి తదితరులతో వేసిన కమిటీ రూపొందించిన నిబంధనల మేరకే 252 జీవో వచ్చిందన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల నియమ నిబంధనలు రూపొందించేందుకు సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ సూచించిన సిఫార్సులను అప్పటి మీడియా అకాడమీ చైర్మన్ ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. ఆ విషయంలో ప్రెస్ కౌన్సిల్‌ను ఆశ్రయించి, ఆ పత్రికలకు న్యాయం చేసిన ఘనత తమ సంఘానిదే అని ఆయన గుర్తుచేసారు. జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందంటూ ఆందోళనకు దిగిన ఆ సంఘం రాష్ట్ర కీలక నాయకుని కుటుంబ సభ్యులు నలుగురు మీడియా ఏజెన్సీ పేరుతో అక్రిడేషన్ కార్డులు పొందారని, అదే సంఘానికి చెందిన మరో రాష్ట్ర నాయకుని కుమారుడు యాదాద్రి భువనగిరి జిల్లా లోని ఓ గ్రామ సర్పంచ్ గా వ్యవహరిస్తున్నప్పటికీ, అతనికి జర్నలిస్టు అక్రిడేషన్ కార్డు ఇవ్వడంపై తమ సంఘం ఆందోళన చేసి ఆ కార్డును రద్దు చేయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి పద్ధతుల్లో అక్రెడిటేషన్ కార్డులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు, వాటికీ గౌరవం దక్కించే ఉద్దేశంతోనే కొన్ని కట్టుదిట్టమైన నిబంధనలతో 252 జీవోను తెచ్చారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, టీయుడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, ఉపాధ్యక్షుడు గాడిపల్లి మధు, కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వరకాల యాదగిరి, జి. మధు గౌడ్, కోశాధికారి యం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రాజేష్, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధి,సంక్షేమానికి కృషి : కొలను

విశాలాంధ్ర-దుండిగల్: కాలనీల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి సుభాష్‌నగర్ 130 డివిజన్ నందు జేకె నగర్,శ్రీ సాయి వెంకట ఎంక్లేవ్‌లలో మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి కాలనీ ప్రజలతో కలిసి పాదయాత్ర చేసి డ్రైనేజీ, సిసి రోడ్డు వంటి ఇతర సమస్యలను ఆయన గుర్తించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే దశల వారీగా కార్పొరేటర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని వారికీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ,శివాగౌడ్,జహంగీర్,స్థానిక నాయకులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గం నిజాంపేట్ జిహెచ్ఎంసి పరిధి హనుమాన్ టెంపుల్ బస్ స్టాప్ వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి,కొలన్ వీరేందర్ రెడ్డి కలిసి కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కడియాల ఇందిరా, రఫియా బేగం,కొలన్ జీవన్ రెడ్డి,కొలన్ జనార్దన్ రెడ్డి,వరగాని వాసు,ఏలూరి సత్య, కృష్ణంరాజు, చిట్ల దివాకర్, వీరబాబు, శ్రీశైలం యాదవ్,మౌలేశ్వరరావు,మద్ది నారాయణరెడ్డి, రమేష్,వర్మ రాజు,ఎర్రోళ్ల విష్ణు,బిక్కన్ షా,జగదీష్ యాదవ్,ప్రేమ్ కుమార్,జగన్ యాదవ్,అల్లాడి మహేష్, రామచంద్రనాయక్,ప్రభాకర్ రెడ్డి,లక్ష్మణ్,బాలకృష్ణ పాల్గొన్నారు. పి. జనార్దన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సీనియర్ నాయకులు సురేంద్ర యాదవ్ నివాళులర్పించారు.

ఘనంగా జనార్ధన్‌రెడ్డి వర్ధంతి

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి పి. జనార్ధన్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని నాయకులు, కార్యకర్తలు వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా, జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని వెంకటగిరిలో గణేష్ మండపం ప్రక్కన పీజేఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. అంతకు ముందు ఖైరతాబాద్ చౌరస్తా దగ్గర ఉన్న పీజేఆర్ విగ్రహానికి బిఆర్ఎస్ కార్యవర్గ అధ్యక్షుడు కేటీఆర్, పి జె ఆర్ తనయుడు పి.విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి మల్లారెడ్డి ఇంకా ఇతర నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెంగల్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య, సీనియర్ నాయకులు సురేంద్ర యాదవ్ మొదలైన వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, పి. జనార్దన్ రెడ్డి ప్రజాసేవకు అంకితమైన జీవితం గడిపారని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల లో పేద ప్రజల సమస్యలపై ఆయన చూపిన చిత్తశుద్ధి చిరస్మరణీయమని తెలిపారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి, ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయన నిబద్ధతను కొనియాడారు. అనంతరం ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల కోసం నిరంతరం పోరాడతామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అప్పల సురేందర్ యాదవ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్ వర్ధంతి

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : కాంగ్రెస్ పార్టీ మాజీ సీఎల్పీ లీడర్ పి. జనార్దన్ రెడ్డి, 18వ వర్ధంతి సందర్భంగా బోరబండలో నవీన్ యాదవ్ పాల్గొన్నారు. బోరాబండ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పీజేఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన మహానేత పీజేఆర్ సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోమాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫాసియోద్దీన్, సియన్ రెడ్డి, బండారి అశోక్, బాలరాజ్ గౌడ్, బండారి యదయ్య, రమేష్ నాయక్, ఖయ్యూమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డివిజన్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర శేరిలిం గంపల్లి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటైన శేరిలిం గంపల్లి డివిజన్ కార్యాలయం ప్రజలకు అధికారులకు మధ్య వారధిగా నిలుస్తుందని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పేర్కొన్నారు. నూతన హంగులతో ఏర్పాటైన డివిజన్ కార్పొరేటర్ కార్యాలయాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు నిర్వహించి పిఏసీ ఛైర్మెన్, నియోజకవర్గ ఎంఎల్ఏ అరికెపూడి గాంధీ తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ గారు మాట్లాడుతూ.. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు అయిన ప్రజా వేదిక నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని సమస్యల పరిష్కార దశగా పనిచేస్తుందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ నియోజకవర్గం లోని శేరిలింగంపల్లి డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దరమే లక్ష్యమన్నారు. డివిజన్ పునర్విభజనతో మరింత బాధ్యత పెరిగిందని.. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పురప్రముఖులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నాగమణి మృతికి ఎమ్మెల్యే మల్లారెడ్డి సంతాపం

విశాలాంధ్ర-నాగారం : మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి. ఆదివారం మాజీ మంత్రివర్యులు మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి GHMC డివిజన్ 4 దమ్మాయిగూడలో మాజీ సర్పంచ్ మామిళ్ల నాగరంజని దశదినకర్మలో భాగంగా ఆమె కుమారుడు టీఆర్ఎస్ యూత్ లీడర్ మామిళ్ళ పవన్, వారి కుటుంబసభ్యులను కలసి వారిని పరామర్శించారు. మాజీ సర్పంచ్ నాగమణి మృతి పట్ల సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీ మాజీ చైర్పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్.మాజీ వార్డ్ సభ్యులు మామిల అఖిల బాలరాజ్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల పీపీపీ విధానం విరమించాలి

సీఎం చంద్రబాబు విజ్ఞత ప్రదర్శించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పేరుతో రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రైవేటీకరించే యోచనను విరమించుకోవాలని, పీపీపీ విధానానికి స్వస్తి పలికి నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని నూతన వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు సీఎం చంద్రబాబు అత్యుత్సాహం చూపిస్తూ, మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాసంఘాలు, మేధావులు అందరూ ముక్తకంఠంతో రాష్ట్ర ప్రభుత్వ పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా కేంద్ర ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి సుజాతరావు... హిందూ పత్రికలో రాసిన ఆర్టికల్‌లో 'వైద్య కళాశాలలో పీపీపీ విధానం వల్ల రోగులు ఇబ్బందులు పడటమే కాకుండా సామాన్య, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు నష్టపోతారని' చాలా స్పష్టంగా వివరించారన్నారు. నూతన వైద్య కళాశాలల ఏర్పాటు కోసం భూములు, భవనాల నిర్మాణం, వనరులు, మౌలిక సదుపాయాలు ప్రభుత్వమే కల్పించిందని రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటయిన వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించడంతో పాటు రెండేళ్ల పాటు సిబ్బందికి జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమవటం దుర్మార్గమని పేర్కొన్నారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకునేందుకు మాత్రం ప్రైవేటుకు అవకాశం కల్పించడం విచారకరమని, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పీపీపీ విధానం... ప్రభుత్వ ప్రజా ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు దోచి పెట్టడమేనని ఆయన విమర్శించారు. టెండర్లు వేసేందుకు ఎవరూ రాని పరిస్థితులలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ మాత్రం టెండర్లు వేసేందుకు ముందుకు వస్తున్నారని అవాస్తవాలు చెబుతున్నారన్నారు. ఈ నెల 27న హైదరాబాదులో ఎన్టీఆర్ ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాలు ఉన్నత స్థితికి రావాలంటే విద్యని ఆయుధంగా చేసుకోవాలని సూచించారని, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా వందలాది మందికి విద్యను అందించటం అభినందనీయమేనని తెలిపారు. అయితే ప్రభుత్వ రంగంలోని వాటిని ప్రైవేటుకు అప్పగించి, ట్రస్టు ద్వారా మాత్రం కొందరికి చదువులు చెప్పించి మిగిలిన వారిని గాలికి వదిలేయటం సబబేనా?, రాష్ట్రంలోని విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు అప్పగిస్తే పేద సామాన్య మధ్య తరగతి వర్గాలకు అవి అందుబాటులో ఎలా ఉంటాయి? అని ప్రశ్నించారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రాథమిక, ఉన్నత విద్య, ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ప్రైవేటు శక్తుల చేతుల్లో కొనసాగుతున్నాయని వివరించారు. ఇప్పుడు వైద్య కళాశాలలను అప్పగించేందుకు సిద్ధమయ్యారని, రాష్ట్ర ప్రభుత్వ పీపీపీ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని రామకృష్ణ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి పీపీపీ విధానాన్ని విరమించుకోవాలని, వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని డిమాండ్ చేశారు.

సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు

జయప్రదం చేయండి

రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య

విశాలాంధ్ర-మదనపల్లె: సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు జనవరి 18వ తేదీన ఖమ్మం నగరంలో భారీ ఎత్తున జరగబోతున్నాయని, ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో సీపీఐ ఆవిర్భవించి డిసెంబరు 26కు వంద సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. అయితే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నందున ముగింపు ఉత్సవాల సభను జనవరి 18 కి వాయిదా వేశామన్నారు. ఈ ముగింపు ఉత్సవాలకు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి దాదాపు ఐదు లక్షల మంది ప్రజలను సమీకరించి అక్కడ భారీ బహిరంగ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభలో దేశంలోని పాలక వర్గాలకు హెచ్చరిక చేస్తూ... రానున్న రోజుల్లో సీపీఐ తన బలాన్ని మరింత పెంచుకొని వామపక్ష లౌకిక శక్తులను ఏకతాటి పైకి తీసుకువచ్చే దిశగా అడుగులు వేస్తుందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామిక హక్కులను అణిచివేస్తూ... తన ఫాసిస్టు విధానాలతో అన్ని వ్యవస్థలను విధ్వంసం చేస్తున్న నరేంద్ర మోదీ, అమిత్ షా పాలనకు వ్యతిరేకంగా ఇండియా ఐక్య సంఘటనతో పాటు మరిన్ని లౌకిక పార్టీలను కలుపుకుని ఫాసిస్టు ప్రభుత్వాన్ని ఓడించాలని ఖమ్మం సభలో పిలుపునివ్వనున్నామన్నారు. కాగా మదనపల్లె జిల్లా ఏర్పాటుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అన్నమయ్య జిల్లా యధావిధిగా కొనసాగాలని అన్నారు. ప్రజల మనోభావాలు దృష్టిలో పెట్టుకొని సీఎం చంద్రబాబు వ్యవహరించాలన్నారు. అయితే బీజేపీని ఎదురించి ఏ పనీ చేయలేరని, రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. జిల్లాల విభజన మీ రాజకీయ కారణాలతో విధ్వంసం చేయవద్దని, ప్రజల మనోభావాలను గాయపరచవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మహేష్, సహాయ కార్యదర్శి టి.కృష్ణప్ప, కార్యవర్గ సభ్యులు సాంబశివ, వెంకటేష్, మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి పాల్గొన్నారు.

నెహ్రూ లేఖలు ఇవ్వండి

సోనియాకు షెకావత్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, ఇతర పత్రాలను ప్రధాన మంత్రి మ్యూజియానికి తిరిగివ్వాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్.. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి విజ్ఞప్తి చేశారు. అవి ఏ ఒక్క వ్యక్తికి చెందినవి కావని, దేశానికి చెందినవన్నారు. 'నెహ్రూ మరణానంతరం ఆయన పేరుతో స్మారక మ్యూజియం, లైబ్రరీ (ప్రస్తుతం ప్రధానమంత్రి మ్యూజియంగా పేరు మార్చారు)ని ఏర్పాటు చేశారు. ఓ వ్యవస్థ ఏర్పడినప్పటికీ దాని నిర్వహణ సరిగ్గా లేదు. 1970 నుంచి 1990 మధ్యకాలంలో నెహ్రూకు సంబంధించిన అన్ని అనధికార దస్త్రాలను మ్యూజియానికి తీసుకొచ్చారు. ఇందులో పౌరులకు నెహ్రూ రాసిన లేఖలు, అందుకున్న ప్రత్యుత్తరాలున్నాయి. ఇలాంటివి అందరు ప్రధానులకు సంబంధించి 2.5 కోట్ల దస్త్రాలు మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి. వీటిలో 4లక్షలు పండిట్ నెహ్రూకు చెందినవే. ఆ

నాడు పోరాడిందెవరు? నేడు కీర్తిస్తున్నదెవరిని?

సీపీఐ జాతీయ నాయకులు నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: భారతదేశానికి స్వాతంత్ర్యం అనేక త్యాగాలు, పోరాటాల ఫలితమని సీపీఐ జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ తెలిపారు. అనాలోచిత విధానాలకు కేంద్ర ప్రభుత్వం ఇకనైనా స్వస్తి పలకాలని సీపీఐ సూచిస్తున్నదని అన్నారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించినది మహాత్మా గాంధీ అని నారాయణ గుర్తుచేశారు. మాజీ ప్రధాని అతల్ బీహారీ వాజ్‌పేయి 1924 డిసెంబర్ 25న జన్మించారని, స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఆయన వయస్సు 22 సంవత్సరాలు మాత్రమేనన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి బ్రిటిష్ పాలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల్లో వాజ్‌పేయికి ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేశారు. వాజ్‌పేయి విగ్రహాల ఏర్పాటు ఎందుకని ప్రశ్నించారు. రహదారులు, సంస్థలు, పథకాల పేర్ల మార్పు అవసరం ఏమిటంటూ నారాయణ నిలదీశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నాయకులుగా చలామణి అయిన వారిని స్వాతంత్ర్య సమరయోధులుగా చిత్రీకరించే దుస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తంచేశారు. మహాత్మా గాంధీ పేరును సంక్షేమ పథకాల నుంచి కుట్ర పూరితంగా తొలగించడం అహింస, లౌకికత్వం, సామాజిక న్యాయం వంటి గాంధేయ విలువలను బలహీనపరుస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటానికి దూరంగా ఉన్నవారు... దానిని వ్యతిరేకించిన వారు నేడు తమకు అనుకూలంగా చరిత్రను వక్రీకరిస్తున్నారని, ఇది దురదృష్టకరమని నారాయణ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి పరిస్థితి దేశానికి అవమానమన్నారు. ప్రస్తుత రాజకీయ భావజాలాలకు అనుగుణంగా గత చరిత్రను మార్చాలనుకోవటం అవివేకమని దుయ్యబట్టారు. గాంధీని కేవలం విగ్రహాలకు పరిమితం చేసి, ఆయన ఆలోచనలను ఆచరణలో లేకుండా చేయాలనే నేటి పాలకుల విధానం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని నారాయణ తెలిపారు. మోదీ ప్రభుత్వ కుట్రపూరిత వైకరిని సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. మహాత్మా గాంధీని పక్కన పెట్టి, స్వాతంత్ర ఉద్యమంలో పాత్రలేని వారిని కీర్తిస్తే... దేశం తన నైతిక విలువలను, ప్రజాస్వామ్య పునాదులను కోల్పో తుందని, ఇది ప్రమాదకరమని నారాయణ వెల్లడించారు. స్వాతంత్ర్య ఉద్యమం చరిత్ర పరిరక్షించాలని పిలుపునిచ్చారు. పరిపాలనలో, విద్యలో, ప్రజా సంక్షేమ పథకాలలో మహాత్మా గాంధీకి సముచిత స్థానం కల్పించాలని సీపీఐ డిమాండ్ చేస్తున్నదని నారాయణ తెలిపారు. పాలకులు తమ అనాలోచిత విధానాలకు ఇకనైనా స్వస్తి పలకాలని నారాయణ హితవు పలికారు.

ఆరావళి వివాదంపై నేడు విచారణ

సుమోటోగా న్యాయవిచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఆరావళి పర్వతాలకు సంబంధించి సుప్రీంకోర్టు ఆమోదించిన నిర్వచనీయంపై వివాదం చెలరేగిన నేపథ్యంలో ఈ అంశాన్ని పునఃపరిశీలించేందుకు అత్యున్నత న్యాయస్థానం సిద్ధమైంది. ఈ అంశంపై సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. కాజ్‌లిస్ట్ ప్రకారం, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన త్రిసభ్య వెకేషన్ బెంచ్ ఈ కేసును విచారించనుంది. ఈ కేసును 'ఆరావళి కొండలు, శ్రేణుల నిర్వచనం, అనుబంధ అంశాలు'గా పేర్కొన్నారు. వాస్తవానికి, నవంబర్ 20న ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఆరావళి కొండలు, శ్రేణులకు సంబంధించిన ఏకరీతి నిర్వచనాన్ని సుప్రీంకోర్టు ఆమోదించింది. నిపుణుల నివేదికలు వచ్చేంత వరకు ఈ ప్రాంతాల్లో కొత్త మైనింగ్ లీజులపై నిషేధం విధించింది. ప్రపంచంలోనే అత్యంత పురాతన పర్వత వ్యవస్థను రక్షించే క్రమంలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కమిటీ సిఫార్సు చేసిన నిర్వచనాన్ని కోర్టు ఆమోదించింది. దీని ప్రకారం వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కమిటీ నివేదిక ప్రకారం, 100 మీటర్ల కంటే తక్కువ ఉండేవాటిని పర్వతాల్లా పరిగణించరు. ఉపరితలం నుంచి 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న ఏ భూభాగాన్నైనా 'ఆరావళి కొండ'గా పరిగణించాలి. అలాగే, అటువంటి రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండల మధ్య దూరం 500 మీటర్ల లోపు ఉంటే వాటిని 'ఆరావళి శ్రేణి'గా పిలవాలి. కొండ దిగువ అంచు పరిధిలోకి వచ్చే భూభాగం, దాని వాలులు, అనుబంధ భూరూపాలు అన్నీ ఆరావళి కొండల్లో భాగంగానే పరిగణిస్తారు. రెండు కొండల మధ్య దూరాన్ని వాటి దిగువ అంచుల మధ్య ఉన్న కనిష' దూరం ఆధారంగా లెక్కించాలని కమిటీ సూచించింది. గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీలకు సహజసిద్ధ పర్యావరణ రక్షణ కవచం లాంటి ఆరావళి పర్వతాలకు కేవలం 'ఎత్తు' ఆధారంగా కొత్త నిర్వచనం ఇవ్వడాన్ని ప్రతిపక్ష నేతలు, పర్యావరణ ప్రేమికులు తప్పుపట్టారు. ఆరావళి పర్వతాల పరిసరాల్లోని లోతట్టు, దిగువ ప్రాంతాల్లో కొందరి కోసం మైనింగ్ అవకాశాలను స ృష్టించడానికి కేంద్ర ప్రభుత్వం తాపత్రయ పడుతోందని మండిపడ్డారు. ఆరావళి పర్వత శ్రేణుల్లో 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్నదాన్నే ఆరావళి పర్వతంగా పరిగణిస్తాం అనడం సరికాదని వాదిస్తున్నారు. గుజరాత్, రాజస్థాన్‌లలోని 'ఆరావళి' జిల్లాల్లో దీనిపై నిరసనలు జరిగాయి.

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే

ఏఐవైఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఉద్యోగాలు ఇవ్వ కుంటే నిరుద్యోగ యువతకు ఆత్మహత్యలే శరణ్యం అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, నిరుద్యోగభృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ జిల్లా సమితి అధ్వర్యంలో ఆదివారం సీపీఐ కార్యాలయం నుంచి భగత్ సింగ్ సర్కిల్ వరకు ...మెడకు ఉరితాళ్లు బిగించుకొని యువత భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగాలు ఇవ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికల హామీలు గాలికొదిలి, పదవుల పంపకాల్లో కూటమి ప్రభుత్వం మునిగిపోయిందని విమర్శించారు. నిరుద్యోగ భృతి రూ.మూడువేలు ఇవ్వాలని, ఇచ్చిన హామీ మేరకు జనవరి ఒకటిన జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో యువతను మభ్యపెట్టేందుకు హామీలు ఇచ్చి... అధికారంలోకి రాగానే ఆ హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు అయినప్పటికీ నిరుద్యోగ భృతిపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే, తమ పార్టీ నేతలకు డైరెక్టర్, చైర్మన్ వంటి లాభదాయక పదవులు పంచడంలో బిజీగా ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, నిరుద్యోగ యువత దయనీయ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో మెడకు ఉరితాళ్లు బిగించుకొని భిక్షాటన కార్యక్రమం నిర్వహించామన్నారు. జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు, ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు చిన్న బోతుల శ్రీను, అరుణ్, ఖాసీం వలి, ఖాదర్ వలి, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు సాయి, బన్నీ, అజయ్, అమర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు రామరాజ్యమే బెంచ్ మార్క్

అయోధ్య రామాలయానికి సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సుపరిపాలనకు రామరాజ్యమే బెంచ్ మార్క్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. మంచి పరిపాలనను రామరాజ్యంతోనే పోల్చుకుంటామని అన్నారు. ఆదివారం అయోధ్యలో బాలరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అత్యుత్తమ పాలనకు రాముడి పాలనే కొలమానంగా తీసుకుంటామని పేర్కొన్నారు. అయోధ్యలో నిర్మించిన రామమందిరం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఎన్నో వివాదాల అనంతరం ఆలయం నిర్మితమై దేశ ప్రజల కల సాకారమైం దన్నారు. భారత్‌లో ఆధ్యాత్మిక కేంద్రంగా అయోధ్య రామాలయం మారిందని అన్నారు. ఆలయ నిర్మాణంతో పాటు యూపీలో సుపరిపాలన అందిస్తున్న యోగీ ఆదిత్య నాథ్ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. దేశంలోని ఇతర దేవాలయా లకు అయోధ్య రామాలయం మార్గదర్శకంగా నిలవాలని చంద్రబాబు ఆకాంక్షించారు. సాంకేతికంగా ముందుడుగు వేస్తున్న భారత్‌ను ఎవరూ నిలువరించలేరని స్పష్టం చేశారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంలో యూపీ, బీహార్ కూడా కీలక పాత్ర పోషించాలని అన్నారు. శ్రీరాముడి దర్శనం అనంతరం సీఎం ఎక్స్ వేదికగా స్పందించారు. 'శ్రీరాముడు పాటించిన విలువలు కాలానికి అతీతంగా ఎప్పుడూ స్ఫూర్తినిస్తుంటాయి. రాముడు పాటించిన విలువలు సుపరిపాలనకు నిరంతరం మార్గదర్శంగా నిలుస్తాయి. అయోధ్యలో శ్రీరామ దర్శనం నాకు నూతన శక్తిని ఇచ్చింది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. అయోధ్యకు వచ్చిన చంద్రబాబుకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

కేరళలో బీజేపీ ఎదుగుదలకు కాంగ్రెస్ మార్గం: విజయన్

తిరువనంతపురం: రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను కాంగ్రెస్ సులభతరం చేస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. ఇటీవలి రాజకీయ పరిణామాలపై త్రిసూర్ జిల్లాలో మట్టత్తూర్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సంస్థాగత క్షీణత బీజేపీకి మార్గంగా మారిందని అన్నారు. మట్టత్తూర్‌లో ఎనిమిది మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు తమ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీతో చేతులు కలిపారని అన్నారు. అధ్యక్ష పదవికోసం స్వతంత్ర అభ్యర్థికి మద్దతు ఇచ్చారని చెప్పారు. స్థానిక సంస్థల్లో ఎల్‌డీఎఫ్‌కి అధికారం లేకుండా చేశారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఖర్చుతో బీజేపీ అత్యధికంగా లాభపడిందని తెలిపారు. 'మట్టనూర్ మోడల్' లౌకిక, ప్రగతిశీల కేరళకు కొత్తదని అన్నారు. అరుచణా ప్రదేశ్‌లో ఇదే ప్రహసనం కొనసాగిందని, ముఖ్యమంత్రితో సహా 44 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో 43 మందిపార్టీని వీడి బీజేపీలో చేరారని విజయన్ పేర్కొన్నారు. 2019లో గోవాలో, 2021లో పుదుచ్చేరిలో మళ్లీ అరుణాచల్ ప్రదేశ్ మోడల్‌ను పునరావృతం చేసిందని, 2019లో గోవాలో కాంగ్రెస్ పార్టీ బీజేపీలో పూర్తిగా విలీనమైందని అన్నారు. పుదుచ్చేరిలో ఒక్క ఎమ్మెల్యే కూడా లేని బీజేపీ బేరసారాలు నిర్వహించిందని, కాంగ్రెస్ పార్టీని వీడిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కేరళలో ఈ నమూనాను పునరావృతం చేసేందుకు బీజేపీ యత్నిస్తోందని, మట్టనూర్ కేవలం నమూనా మాత్రమేనని అన్నారు. పంచాయతీలో ఎల్‌డీఎఫ్ పాలనను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ... బీజేపీతో జత కట్టింది. ఒక్కదెబ్బకి కేరళలో కాంగ్రెస్... బీజేపీకి లంగిపోయేలా చేసిందని అన్నారు. మట్టనూర్ కేవలం ప్రారంభం మాత్రమేనని అన్నారు. ఎన్నుకోబడిన కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలోకి ఫిరాయించడం త్వరలో ఒక ప్రవాహంలా మారుతుందని చెప్పారు. కాంగ్రెస్‌కు వేసినా బీజేపీకి వేసినా ఓటుగా స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. కాంగ్రెస్‌ను కొనుగోలు చేయగల వస్తువుగా బీజేపీ భావిస్తోందని అన్నారు. ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆర్‌ఎస్‌ఎస్‌లోకి చేర్చుకోవడం ద్వారా ప్రజల తీర్పుని దెబ్బతీయవచ్చని బీజేపీ చూస్తోందని హెచ్చరించారు.

మలేరియాను పూర్తిగా నిర్మూలిస్తాం: అమిత్ షా

అహ్మదాబాద్: భారత్ నుంచి మలేరియాను త్వరలోనే పూర్తిగా తొలగిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. అహ్మదాబాద్‌లో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిర్వహించిన ఆలిండియా మెడికల్ కాన్ఫరెన్స్ - 2025లో ఆయన ప్రసంగించారు. భారత్‌లో మలేరియా కేసులు 97 శాతం తగ్గాయని, అతి త్వరలో దేశం నుంచి పూర్తిగా మలేరియాను తరిమేస్తామని అన్నారు. ఆయుష్మాన్ భారత్, మిషన్ ఇంద్రధనుష్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన చెప్పారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించాలంటే ఆరోగ్యవంతమైన ప్రజలు అవసరమని, అందుకు డాక్టర్లు... ప్రభుత్వ పథకాల లక్ష్యం నెరవేరేలా కలిసి పనిచేయాలని కోరారు.

'అవును... మా నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై దాడి జరిగింది'

పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వెల్లడి

ఇస్లామాబాద్: 'ఆపరేషన్ సిందూర్'తో భారత్ ఏ విధంగా పాకిస్థాన్‌ను దెబ్బతీసిందనే విషయాలను ఇప్పుడిప్పుడే అక్కడి నేతలు ఒప్పుకుంటున్నారు. పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ మాట్లాడుతూ... భారత దాడులు తమ నూర్‌ఖాన్ ఎయిర్ బేస్‌కు నష్టాన్ని కలిగించాయని అన్నారు. దీంతో పాకిస్థాన్ తొలిసారిగా అధికారంగా అంగీకరించినట్లయింది. రాజధాని ఇస్లామాబాద్, పాకిస్థాన్ సైన్యం హెడ్‌క్వార్టర్స్ ఉండే రావల్పిండిలోని ఎయిర్‌బేస్‌ను భారత్ క్షిపణులతో ధ్వంసం చేసింది. ఎయిర్‌బేస్‌ను భారత దాడులు తీవ్రంగా నష్టపరిచాయని, అక్కడ సిబ్బందిని గాయపరిచాయని ఆయన అంగీకరించాడు. భారత సైనిక చర్యల్ని ఇన్నాళ్లు తక్కువ చేసి మాట్లాడిన పాకిస్థాన్ ఇప్పుడు నిజాలను ఒప్పుకుంటోంది. అంతకుముందు, ఆపరేషన్ సిందూర్ దాడుల సమయంలో తనను బంకర్‌లోకి వెళ్లాలని అధికారులు సూచించారని పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ చెప్పిన వీడియో వైరల్‌గా మారింది. ఇషాక్ దార్ మాట్లాడుతూ.. భారతదేశం స్వల్ప వ్యవధిలో పాకిస్థాన్ గగనతలంలోకి పెద్ద సంఖ్యలో డ్రోన్‌లను పంపిందని అన్నారు. 36 గంటల్లో భారత్ దాదాపు 80 డ్రోన్లను ఉపయోగించిందని చెప్పారు. పాక్ దళాలు వాటిలో 79 డ్రోన్లను అడ్డగించారని, ఒక డ్రోన్ సైనిక స్థావరాన్ని ఢీకొట్టిందని ఆయన చెప్పారు. ఈ ఒక్క డ్రోన్ తమ సైనిక స్థావరానికి నష్టం కలిగించి, సిబ్బందిని గాయపరిచిందని చెప్పాడు. పాకిస్థాన్ వైమానిక రక్షణ ప్రతిస్పంద చాలా విజయవంతమైందని చెప్పాడు. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ నేత ృత్వంలోని పాకిస్థాన్ రాజకీయ, సైనిక నాయకత్వం మే తొమ్మిదో తేదీ రాత్రి అత్యవసర సమావేశం నిర్వహించిందని దార్ అన్నారు. ఈ సమావేశంలో భారత్‌పై దాడికి కీలక నిర్ణయాలు ఆమోదించబడ్డాయని, మే 10వ తేదీ తెల్లవారుజామున నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌పై దాడి చేయడం ద్వారా భారత్ తప్పు చేసిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్... పాకిస్థాన్‌లోని 11 ఎయిర్ బేసులపై దాడులు చేసింది. ముఖ్యంగా, పాక్ ఎయిర్ ఫోర్స్‌కు కీలకంగా ఉన్న నూర్ ఖాన్ ఎయిర్ బేస్ భారత దాడితో మంటల్లో చిక్కుకుంది. మురిడ్, రఫికీ, సుక్కూర్, రహీంయార్ ఖాన్, సియాల్ కోట్, సర్గోదా, జకోబాబాద్, పస్రూర్, స్కర్దూ, చునియన్ ఎయిర్ బేస్‌లపై భారత్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో వందకు పైగా పాక్ సైనికులు హతమయ్యారు.

కొత్త ఏడాదిలో ఎలక్ట్రానిక్ వస్తువులు భారం

రూపాయి విలువ పతనం ప్రభావం

న్యూఢిల్లీ: మధ్యతరగతి ప్రజలకు త్వరలో మరో షాక్ తగలనుంది. కొత్త ఏడాది వస్తున్న క్రమంలో అనేక వస్తువులు ధరలు పెరగనున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి భారీగా పతనం కావడంతో అనేక వస్తువుల ధరలు పెరగనున్నాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల ధరల కొత్త ఏడాదిలో ఆశాకాన్నంటనున్నాయి. నూతన సంవత్సరంలో ధరలను పెంచేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. మొబైల్, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషిన్ ధరలతో పాటు ఏసీ ధరలు కూడా భారీగా పెరగనున్నాయి. ఇందుకు అనేక కారణాలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది జనవరి నుంచి ఏసీ ధరలు 3 నుంచి 12 శాతం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. విద్యుత్‌ను ఎక్కువగా ఉపయోగించే 3 స్టార్ ఏసీల ధరలు 3 నుంచి 4 శాతం పెరిగే అవకాశముండగా. . విద్యుత్‌ను తక్కువగా వినియోగించే 5 స్టార్ ఏసీల ధరలు ఏకంగా 12 శాతం పెరగనున్నాయి. ఈ ఏడాది దేశంలోనే విస్త ృతంగా వర్షాలు కురిశాయి. దీని వల్ల ఏసీలను ఎక్కువమంది కొనుగోలు చేయలేదు. దీని వల్ల ఏసీలను తయారుచేయడానికి ఉపయోగించే వస్తువులు కంపెనీల వద్ద అలాగే మిగిలి ఉన్నాయి. కొనుగోళ్లు ఎక్కువగా జరక్కోవడం వల్ల ఏసీల నిల్వలు డీలర్ల వద్ద అలాగే ఉన్నాయి. అలాగే జనవరి నుంచి బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ తెస్తున్న కొత్త నిబంధనలు కూడా ఏసీల ధరలు పెరగడానికి కారణమవుతున్నాయి. జనవరి 1 నుంచి మరింత నాణ్యమైన వస్తువులను మాత్రమే ఏసీ తయారీకి ఉపయోగించాలని బీఈఈ కొత్త రూల్స్ ప్రవేశపెట్టింది. దీని వల్ల ఏసీల తయారీకి ఉపయోగించే లోహాలు, ఇతర ముడి పదార్థాలను నాణ్యతతో కూడుకున్నవి ఉపయోగించాల్సి ఉంటుంది. నాణ్యత గల వస్తువుల ధరలు ఎక్కువగా ఉంటాయి. దీని వల్ల కంపెనీలపై మరింత భారం పడటం వల్ల ఏసీల ధరలను పెంచనున్నారు. ఇటీవల జీఎస్టీ రేట్ల తగ్గింపు క్రమంలో ఏసీల ధరలు కాస్త తగ్గాయి. కానీ కంపెనీలు తమపై పడే భారం తగ్గించుకునేందుకు ప్రజలపై భారం వేసేందుకు సిద్ధమవుతున్నాయి. జనవరి నుంచే ధరలను పెంచేందుకు రెడీ అవుతున్నాయి. ఇక విదేశాల నుంచి దిగుమతి చేసుకునే చాలా వస్తువుల ధరలు భారీగా పెరగనున్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

వైరా ఎమ్మెల్యే ను మర్యాదపూర్వక కలిసిన సిరిపురం బిఆర్ఎస్ కూటమి సర్పంచ్ ..!

విశాలాంధ్ర- వైరా : ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ను ఆదివారం వైరా మండలం సిరిపురం గ్రామ బిఆర్ఎస్ కూటమి సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సిరిపురం గ్రామ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు ఎమ్మెల్యేను కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివ ృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని ప్రతి గ్రామ పంచాయతీని అభివ ృద్ధిలో ముందుకు నడుపుతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కామినేని శ్రీనివాసరావు, పర్చురి రామారావు ,అయినాల కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

రత్నాపూర్‌లో పోచమ్మ బొడ్రాయి దేవాలయాలలో నూతన సర్పంచ్ పూజలు

విశాలాంధ్ర- మంథని : రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని పలు పోచమ్మ దేవాలయాలు వద్ద ఆదివారం నూతనంగా గెలుపొందిన సర్పంచ్ పల్లె ప్రతిమా పివి రావు పూజలు నిర్వహించారు.రత్నాపూర్ లోని బొడ్రయి, రాంనగర్ లోని బొడ్రాయి వద్ద పూజ నిర్వహించి, నూతన వస్త్రాలను అలంకరించడం జరిగింది. రత్నాపూర్ పోచమ్మ దేవాలయం వద్ద, సంజీవనగర్ పోచమ్మ దేవాలయం వద్ద,రాంనగర్ లోని పోచమ్మ దేవాలయం వద్ద కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. గ్రామాన్ని చల్లగా చూడాలని కోరుకోవడం జరిగింది. గ్రామ అర్చకులు సౌమిత్రి కృష?మాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూతన సర్పంచును సన్మానించిన సుందరం ఫౌండేషన్ సభ్యులు

విశాలాంధ్ర- మంథని: రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ నూతన సర్పంచ్ గా ఎన్నికైన పల్లె ప్రతిమ పీవీరావును ఆదివారం కమాన్ పూర్ మండలానికి చెందిన సుందరం ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కమాన్ పూర్ మాజీ ఎంపీటీసీ, సుందరం ఫౌండేషన్ ఫౌండర్ బోనాల వెంకట స్వామి పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రజలకు మరింత చేరువ కావాలని ఆయన ఆకాంక్షించారు. ఎంపీటీసీగా, సర్పంచ్ గా మరోసారి సర్పంచ్ గా గెలవడం ప్రజలలో వారికి ఉన్న పట్టుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చిప్పకుర్తి అరవింద్, చెన్నోజు చంద్రశేఖర్, దండే తిరుపతి, కుక్క వరప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ మంత్రి శ్రీధర్ బాబు

కాంగ్రెస్ నాయకులు ఇందారపు అనిల్

విశాలాంధ్ర, మంథని: మంథని మండలం నాగారం బస్టాండ్ నుండి కన్నాల వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు రహదారి విస్తరణకు 2.50 కోట్లు,కన్నాల నుండి మల్లేపల్లి వరకు నూతన రహదారి కోసం1.80 కోట్ల నిధులు రాష్ట్ర ఐటీ మంత్రి మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు నిధులు మంజూరు చేయడం పై కాంగ్రెస్ నాయకులు ఇందారపు అనిల్ హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ఒకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణ శివారులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మ ృతి చందగా ఒకరికి తీవ్ర గాయాలు అయిన సంఘటన జరిగింది. పెనుబల్లి మండలం సూరయ్య బంజర గ్రామానికి చెందిన పుచ్చ తేజస్విని(20)భర్త తోట మధు, తేజస్విని తమ్ముడు దేవేందర్(13) కలిసి ద్విచక్ర వాహనంపై సత్తుపల్లి నుండి అశ్వరావుపేట వైపు వెళ్తున్న క్రమంలో పట్టణ శివారులోని తమ్మిలేరు వంతెన వద్ద వెనుక నుండి వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే తేజస్విని దేవేందర్ మ ృతిచెందగా, మధు అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలిసిన స్థానిక పోలీసులు ఘటన స్థలికి చేరుకొని మృతదేహాలను ఏరియా వైద్యాలకు తరలించి గాయాలు పాలైన మధును ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు.

చదువితేనే భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చు

వనవాసీకు కానిస్టేబుల్ వితరణ

విశాలాంధ్ర- చర్ల : ప్రతి విద్యార్థి చదువుతో తమ భవిష్యత్ కు బాటలు వేసుకోవాలని కానిస్టేబుల్ తోటపల్లి మురళీ అన్నారు. చర్ల పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విదులు నిర్వహిస్తున్న మురళీ, సింధుకుమారి దంపతుల కుమార్తె నియాన్ని జన్మదిన వేడుకలు ఇక్కడి వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయంకు వితరణ అందించారు. 60 కేజీల బియ్యం, విద్యార్థులకు భోజనం, స్వీట్స్, పండ్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మురళీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ చదువులపై ద ృష్టిసారిస్తేనే భవిష్యత్తులో ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సమయపాలన చాలా ముఖ్యమన్నారు. ఇతర వ్యాపకాలపై ద ృష్టిసారించకుండా చదువులపై మనస్సు నిమగ్నం చేయాలని కోరారు. విద్య అభ్యశించడం వల్లనే అనేక కుటుంబాలు స్థిరపడ్డాయన్నారు. వనవాసీ విద్యార్థులు నిజాయితీ, క్రమశిక్షణ, సంస్కృతీ సంప్రదాయాలకు మారుపేరన్నారు. విద్యార్థిని లయ కార్యదర్శి జవ్వాది మురళీకృష మాట్లాడుతూ సంస్థకు వితరణ అందచేసిన మురళీ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిలయ కమిటి ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు, కమిటి సభ్యులు పాసికంటిశ్రీదేవి, పోలినరమాదేవి, ప్రముఖ్‌గొందిప్రసన్నకుమారి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం అండతో కాంగ్రెస్ దాడులు చేయటం అన్యాయం

మీడియా సమావేశంలో వెంకట వీరయ్య

విశాలాంధ్ర ఖమ్మం: ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని, మధిర నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అండ చూసుకుని కాంగ్రెస్ వారు బిఆర్ఎస్ కార్యకర్తలపై రక్తపాతం స ృష్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వీరయ్య వీరయ్య, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ఆరోపించారు. పోలీసుల పక్షపాత వైఖరిపై వారు ఆదివారం ఖమ్మం లోని తెలంగాణ భవన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మధిర నియోజక వర్గంలో అరాచకాల పర్వం కొనసాగుతోందని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుపై తీవ్ర అసంత ృప్తిని వ్యక్తం చేశారు .రామక ృష?పురంలో బిఆర్ఎస్ కార్యకర్త పై దాడి చేసి కాలు విరగొట్టి, ఇదే గర్వంతో బిఆర్ఎస్ దిమ్మె కు కాంగ్రెస్ రంగులు వేస్తుందని పోలీసులకు దరఖాస్తు ఇచ్చినా కేసు లేదు కానీ, ఇదే మండలం కోడుమూరు గ్రామం బాధితులైన బిఆర్ఎస్ కార్యకర్తలపైనే తెల్లవారు జామున ఇళ్లలోకి చొరబడి అక్రమ కేసులు పెట్టడం ఏ రకమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని వారు ప్రశ్నించారు.బిఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తూ తలలు పగలగొట్టిన కాంగ్రెస్ శ్రేణులు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క అండ చూసుకొని ఇలాంటి భౌతిక దాడులకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు. బోనకల్ మండలం ఆళ్లపాడులో గెలిచిన సంతోషంలో ర్యాలీ చేస్తుంటే, కుంకుమ పడిందనే నెపంతో కాంగ్రెస్ గూండాలు బిఆర్ఎస్ కార్యకర్తల తలలు పగలగొట్టారని వారు తెలిపారు. సర్పంచ్‌లను గౌరవించాల్సింది పోయి, బెదిరింపులకు గురిచేయడం సిగ్గుచేటన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క బెదిరింపులకు మధిర ప్రజలు భయపడరని, అధికారం శాశ్వతం కాదు, ప్రజల పక్షాన బిఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుంది" అని వారు స్పష్టం చేశారు.ఈ మీడియా సమావేశంలో ఖమ్మం నగర పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, ముదిగొండ మండల అధ్యక్షులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, వైరా నియోజకవర్గం నాయకులు ముత్యాల వెంకటాప్పరావు, పోట్ల శ్రీనివాస రావు, మధిర మండల రైతు నాయకులు చావా వేణుబాబు, చింతకాని మండల రైతు నాయకులు మంకెన రమేష్, మాజీ ఎంపీపీ గురజాల హనుమంతరావు, చింతకాని మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ సర్పంచ్ కన్నెబోయిన కుటుంబరావు, ముదిగొండ ఎస్సీ సెల్ అధ్యక్షులు పాము సిల్వరాజు, బోనకల్ బిఆర్ఎస్ నాయకులు వడ్డే నరేష్, మధిర నియోజకవర్గ యువజన అధ్యక్షులు కోన నరేందర్ రెడ్డి, పిన్నెల్లి శ్రీనివాస్, కొదమూరు బిఆర్ఎస్ పార్టీ నాయకులు బొగ్గవరపు రాంబాబు, ఉద్యమకారులు గుండ్లపల్లి శేషగిరి రావు, నాయకులు చిట్టి మోతు రాంబాబు, మహమ్మద్ రఫీ, నెమలి కిషోర్, తదితర బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే మైనారిటీలకు రక్షణ

మొహమ్మద్ ఖాన్

విశాలాంధ్ర - కొత్తగూడెం : కాంగ్రెస్ ప్రభుత్వం తోనే మైనారిటీలకు దేశంలో రక్షణ ఉంటుందని ఆ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ కార్యాలయంలో ఆదివారం సమీక్ష కొత్త కొత్తగూడెం టౌన్ అధ్యక్షులు ఎండి ఖాజా బక్ష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో జిల్లా వ్యాప్తంగా ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ముస్లిం మైనారిటీ ఉపసర్పంచులు వార్డు సభ్యులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ దేశంలో తెలంగాణ రాష్ట్రంలోనూ తమ ప్రాంతాల్లోనూ ముస్లింలు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అన్ని మతాలను కులాలను సమానంగా చూస్తూ సమాంతర అభివృద్ధి కోరుకునే ఏకైక జాతీయ పార్టీ కాంగ్రెస్ అన్నారు. నేడు దేశంలో ప్రధాని సరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వ దుష్ట విధానాలు, అదేవిధంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ముస్లింలు, దళితులు, ఆదివాసీలు, క్రిస్టియన్ వర్గాలపై జరుగుతున్న హింస, దౌర్జన్యాలు ప్రపంచానికంతా తెలిసింది అన్నారు. అందుకే ముస్లిం సోదరులు ఈ పరిణామాలను గమనిస్తూ ఐక్యంగా ముందుకు రావాలని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని కోరారు. అలాగే రాబోవు జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో మైనార్టీ నాయకులు అవకాశం వున్న చోట పార్టీ టికెట్ పొంది పోటీకి నిలబడే ప్రయత్నం చేయాలని కాంగ్రెస్ అభ్యర్థులు నిలబడ్డచోట వారి గెలుపుకు క ృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కరీమ్ పాషా, అసెంబ్లీ ప్రెసిడెంట్ ఎండి. గౌస్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ ఎస్ కే. జానీ పాషా, ఉప సర్పంచ్ గౌరె బాబా, వార్డ్ మెంబర్లు ఎండి ఆఫ్రిన్ లను శాలువా కప్పి సత్కరించారు. ఎండి కమర్, ఎండి ఆరిఫ్, ఎండి ఖలీల్, ఖైరుల్లా ఖాన్, ఖాదర్ బాబా, ఎండి. అబ్బాస్, ఎండి రహీం,ఎండి తాసిద్దీన్, అల్లాబక్ష్, పాల్వంచ మండలం అధ్యక్షురాలు హసీనా, షాహిన్, షాజహాన్ బేగం, సవానా కౌసర్ ఫర్జానా, చంద్రుగొండ అధ్యక్షులు అన్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భావాలతో అమరుల ఆశయాలు కొనసాగిద్దాం

డాక్టర్ భాను ప్రసాద్

విశాలాంధ్ర - భద్రాచలం : తరాల నుంచి సమాజంలో నెలకొన్న ప్రజా సమస్యలపై సమాజ సంస్కరణ కోసం అనేకమంది అమరులు తమ ప్రాణాలను ప్రాణంగా పెట్టారని డాక్టర్ భాను ప్రసాద్ అన్నారు.భద్రాచలం టీఎన్జీవో కార్యాలయంలో అదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ద్రవిడ ఉద్యమ యోధులు, సామాజిక విప్లవకారులు పెరియర్, రావులపల్లి నరసింహమూర్తి మాదిగ వీరి యాది సభ నిర్వహించారు. ఈ సభలో డాక్టర్ భాను ప్రసాద్ మాట్లాడుతూ ఆత్మగౌరవ పోరాటల తోపాటు మూఢనమ్మకాల నిర్మూలన, సమాజంలోని వివక్ష, అసమానతలపై ఉద్యమించిన ఆ యోధుల సేవలు కొనియాడారు. ఉద్యమ వారసులను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. వారి ఆశయాలలో ముందుకు తీసుకెళ్లాలని సంకల్పం చేసుకోవటమే కాక బాధిత ప్రజల కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పెరియర్ ద్రవిడ ఉద్యమ స్థాపన కోసం ఎలా క ృషి చేసారో, రావులపల్లి నరసింహామూర్తి మాదిగ బ్రతికున్నన్ని రోజులు మహనీయుల ఆశయ సాధన కోసం ఎలా పోరాడి త్యాగాలు చేశారో ఈ సందర్భంగా వివరించారు. ఎం.ఆర్.పి.ఎస్ ఉద్యమాన్ని రాజకీయ పార్టీలకు దీటుగా ప్రజల హక్కుల ఉద్యమంగా మలచిన మహనీయుడు, ఆశయ సాధకుడు నరసింహమూర్తి మాదిగ అన్నారు. ఈ మానవీయుడి ఉద్యమాలకు సూర్తి తోనే మహాజన నేత పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ అస్థిత్వం, ఆత్మ గౌరవం, హక్కుల పోరాటాలు చేసారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గ్రామ గ్రామాన దండోరా జెండాలను ఎగరేసేందుకు మందకృష్ణ శ్రమించిన స్ఫూర్తి ఇక్కడి నుంచి వచ్చిందన్నారు. నరసింహమూర్తి సామాజిక ఉద్యమ బాటలో పయనిస్తున్న సమయంలోనే అనారోగ్య కారణంతో మనందరికి భౌతికంగా దూరమైనట్లు భాను ప్రసాద్ వివరించారు. చివరి క్షణాల్లో కూడా ఉద్యమంతోనే అనుబంధం కలిగి ఉన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అవులూరి సత్యనారాయణ, డి.ఎస్.పి కోఆర్డినేటర్ కోట రమణ, కిషోర్ మహారాజ్, యువతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, 13వ వార్డు నెంబర్ తాటి ఉదయ్, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షురాలు పోడియం సావిత్రి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పథకంలో మహాత్మా గాంధీ పేరుని తొలగిస్తే ఊరుకోము

ప్రధాన రహదారిపై కాంగ్రెస్ శ్రేణులతో ఎమ్మెల్యే పాయం నిరసన

గాంధీ పేరును సంక్షేమ పథకం నుంచి తొలగించడందుర్మార్గం:ఎమ్మెల్యేపాయం

విశాలాంధ్ర- పినపాక : దేశాన్ని పాలిస్తున్న నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం జాతి పితా మహాత్మా గాంధీ పేరును దేశం నుంచి చేరిపోయారని కుట్రలు పన్నుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆరోపించారు. అందులో భాగంగానే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును తొలగించి తమ ఆర్ఎస్ఎస్, బిజెపి భావజాలం ప్రకారం పార్లమెంట్ సాక్షిగా మరో పేరును ఖాయం చేయటం కాంగ్రెస్ పార్టీ సహించబోదని హెచ్చరించారు. మహాత్మా గాంధీ పేరును తొలగిస్తే దేశవ్యాప్తంగా బిజెపి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున మరో జాతీయ ఉద్యమం తప్పదని ఎమ్మెల్యే పాయం హెచ్చరించారు. టిపిసిసి పిలుపుమేరకు ఆదివారం మండల అధ్యక్షులు రామనాథం ఆధ్వర్యంలో పినపాక మండలంలోని ఈ- బయ్యారం క్రాస్ రోడ్ లో కాంగ్రెస్ శ్రేణులతో ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గాంధీ ఫోటోలు చేతపట్టుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ఆందోళనకు దిగారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ, పియం మోడీ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్ డి ఏ, బీజేపీ ప్రభుత్వం పేదలు, రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం, ఐక్యంగా ఉన్న భారతదేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రతిసారి దేశవ్యాప్తంగా ఏదో ఒక వివాదాన్ని స ృష్టించి తద్వారా అక్రమంగా లబ్ధి పొందాలని బిజెపి నాయకులు పీఎం నరేంద్ర మోడీ చూస్తుంటారని విమర్శించారు. ఆ క్రమంలో భాగమే ఉపాధి పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించేందుకు కుట్ర పన్నారని విమర్శించారు. తన దేశ మహాత్మా గాంధీ ఇక్కడే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా గౌరవం, ఆదరణ వున్న భారత ఆత్మ లాంటివారని ఎమ్మెల్యే వివరించారు. పథకాల్లో ఆయన పేరు పెట్టుకోవడం దేశానికి గర్వకారణం అన్నారు. గాంధీని శత్రువుగా చూసే భావజాలం ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు, క్యాడర్ లొ ఉందన్నారు. అందుకే పార్లమెంట్ లొ మెజారిటీని అడ్డుపెట్టుకొని గాంధీ పేరును, ప్రతిష్టను దేశంలో శాశ్వతంగా చెరిపేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాలను దేశ ప్రజలు ఎన్నటికీ అంగీకరించాలని జాతీయస్థాయి ఉద్యమాలకు నాంది పలుకుతారని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సర్పంచ్ లు మట్ట బాబు రావు, పోతినేని శివశంకర్, ససప అనిత, ఈసం భవతి, ఉప సర్పంచులు కొడం రాంమోహన్, ఆరె స్రవంతి, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పేదలతో పాటు అన్ని వర్గాల అభివృద్ధి చేసేది కాంగ్రెస్ మాత్రమే : ఎమ్మెల్యే జారే

విశాలాంధ్ర - దమ్మపేట : దేశంలో స్వాతంత్రం వచ్చాక అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకోవడమే కాకుండా పేదల కోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టి సంక్షేమాన్ని అందించేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని ఎమ్మెల్యే ఆదినారాయణ స్పష్టం చేశారు. ? తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిరావ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గండుగులపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి, నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా పేదల పక్షాన నిలబడి వారి అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల లోపే రాష్ట్రంలో రైతులు, మహిళలు, యువత, కూలీల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు మంజూరు చేసి ప్రజల జీవితాల్లో ఆర్థిక వెసులుబాటు కల్పించిందని వివరించారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వం చేయలేని పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పలు కీలక పథకాలను అమలు చేస్తున్న ప్రజలందరికీ తెలిసిందే అన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నియోజకవర్గంలొ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహార కొవ్వులు, గుండె ఆరోగ్యంపై అవగాహన సదస్సు

హైదరాబాద్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ నాట్‌కాన్ 2025) 100వ జాతీయ సమావేశంలో, కార్డియాలజిస్టులు ఆహార కొవ్వులు, హ ృదయ సంబంధ ఆరోగ్యం గురించి మరింత ఆధారాల ఆధారిత అవగాహన కోసం పిలుపునిచ్చారు. అభివ ృద్ధి చెందుతున్న శాస్త్రీయ ఆధారాల వెలుగులో దీర్ఘకాలిక అంచనాలను సమీక్షించాలని నొక్కి చెప్పారు. ఎంఏ నాట్‌కాన్ శతాబ్ది ఎడిషన్ భారతదేశం అంతటా వేలాది మంది వైద్యులు, పరిశోధకులు, ఆరోగ్య సంరక్షణ నాయకులను ఒకచోట చేర్చింది. క్లినికల్, ప్రజారోగ్య ద ృక్పథాలను రూపొందించడంలో కీలక వేదికగా దాని పాత్రను బలోపేతం చేసింది. డాక్టర్ వరుణ్ బన్సాల్ మరియు డాక్టర్ కేతన్ మెహతా నిర్వహించిన రెండు నిపుణుల నేత ృత్వంలోని సెషన్‌లు తరచుగా తప్పుడు సమాచారంతో కప్పబడిన అంశాలపై క్లినికల్ స్పష్టతను అందించాయి, క్లినికల్ ఆధారాలు, ప్రపంచ పరిశోధనల లెన్స్ ద్వారా ఆహార కొవ్వులు, పామాయిల్, ఉదవీస్తున్న కార్డియోమెటబోలిక్ జోక్యాల పాత్రను పరిశీలించాయి. "అథెరోస్క్లెరోసిస్, డైటరీ సాచురేటెడ్ ఫ్యాట్స్, పామాయిల్: అవి నిజంగా అనుసంధానించబడి ఉన్నాయా?" అనే తన ప్రెజెంటేషన్‌లో, డాక్టర్ బన్సల్ సంత ృప్త కొవ్వులను గుండె జబ్బులకు నేరుగా అనుసంధానించే దీర్ఘకాల అంచనాలను సవాలు చేశారు. బహుళ దేశాల అధ్యయనాల నుండి తీసుకోబడిన ఈ అధ్యయనంలో, సంత ృప్త కొవ్వులు పోషకాహారపరంగా ఏకరీతిగా లేవని, మొత్తం ఆహార విధానాలు, జీవనశైలి, మొత్తం కేలరీల తీసుకోవడం ద్వారా హ ృదయనాళ ప్రమాదం ప్రభావితమవుతుందని ఆయన హైలైట్ చేశారు. కొన్ని కొవ్వు ప్రత్యామ్నాయాలు కొలెస్ట్రాల్‌ను తగ్గించవచ్చు, కానీ అవి స్థిరంగా హ ృదయనాళ మరణాలను తగ్గించవు, ట్రాన్స్ ఫ్యాట్‌లతో పోలికలు పామాయిల్‌కు అనుకూలమైన ఫలితాలను చూపుతాయని ఆయన గుర్తించారు. అతని సెషన్ డబ్ల్యుహెచ్‌ఓ (హూ), ఐసీఎంఆర్-ఎన్‌ఐఎన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉంది. ఇవి నియంత్రణ, నూనెల వైవిధ్యం, సమతుల్య తీసుకోవడంపై ద ృష్టి పెడతాయి."పోషకాహార శాస్త్రాన్ని సరళమైన లేబుల్‌లకు తగ్గించలేము. భయంతో నడిచే ఎగవేత కాదు, సమతుల్యత, వైవిధ్యం, సమాచారంతో కూడిన ఎంపికలు ముఖ్యం" అని డాక్టర్ వరుణ్ బన్సల్ అన్నారు

దేశంలో పేద ప్రజల గొంతుక సిపిఐ : శ్రీరామ్

విశాలాంధ్ర -వనపర్తి : దేశంలోని పేద ప్రజల గొంతుక సిపిఐ అని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ అన్నారు. సిపిఐ ఆవిర్భవించి 1925 , డిసెంబర్ 26 కు వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో పానుగల్ మండలం కేతేపల్లిలో శతజయంతి వారోత్సవాలను నిర్వహించారు. గ్రామపంచాయతీ వద్ద సిపిఐ జెండాను సీనియర్ నేత కమ్మావుల పెంటయ్య ఆవిష్కరించగా శ్రీరామ్ మాట్లాడుతూ.. శ్రమజీవుల కష్టాలను కడగళ్లను చట్టసభల్లో ప్రజా పోరాటాల్లో వినిపించి పరిష్కారం సాధించిందన్నారు. ప్రతి క్షణం పేదవాడి రక్షణ అభివ ృద్ధే ధ్యేయంగా సిపిఐ పనిచేస్తోందన్నారు. 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్ కాన్పూర్ లో ఆవిర్భవించిన సిపిఐ స్వాతంత్ర సమరంలో దూకి,సంపూర? స్వాతంత్రం ఇవ్వాలని తొలిసారిగా పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. వందేళ్ళ ప్రయాణంలోకార్మిక కర్షక బడుగు బలహీన వర్గాల కు అనుకూల చట్టాల నుపోరాడి సాధించిందన్నారు. కష్టమొచ్చినా అన్యాయం జరిగినా పేదలకు మొదట కనిపించేది ఎర్రజెండా సిపిఐ మాత్రమే అన్నారు. దున్నే వాడికి భూమి, గూడు లేని వారికి నీడ అప్పుల్లో ఉన్న వారికి పోరాటాల ద్వారా రుణ విముక్తి కలిగించిందన్నారు.ఆకలితో అలమటిస్తున్న గ్రామీణకూలీలకుఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల పని సిపిఐ కల్పించిందన్నారు. బిజెపి ఈ పథకం పేరు మార్చి నిధులు తగ్గించి నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని తిప్పి కొట్టాలన్నారు. నైజాం నవాబు ఉక్కు పాదాల కింద తెలంగాణ నలిగిపోతున్న తెలంగాణలో సాయుధరైతాంగ పోరాటం సాగించిందని,4500 మంది పోరాటంలో అమరులయ్యారన్నారు. బాంచన్ నీకాల్మొక్త అనే సామాన్యులచే బంధూకులు పట్టించి దొరలు భూస్వాములను తరిమి కొట్టిందన్నారు. దొరల పీడన నుంచి 3000 గ్రామాలను దొరల నుంచి విముక్తం చేసి ఎర్రజెండాలు పాతిన మొనగాడు సిపిఐ అన్నారు. 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిందన్నారు.

దేశంలో బిజెపి మతత్వాన్ని రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటోందని, సంపన్నులు అనుకూల పేదల వ్యతిరేక పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు.హామీలను విస్మరించి, వాటి నుంచి ప్రజల ద ృష్టి మళ్లించే కుట్ర చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు కావటం లేదన్నారు. ఉపేక్షిస్తే ప్రజలతో తిరస్కరణ తప్పదు అన్నారు. పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమని, ప్రజలు ఎర్రజెండా కింద సంఘటితమై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కేతేపల్లి గ్రామ ఉపసర్పంచ్ కృష్ణవేణి,సిపిఐ మండల కార్యదర్శి దంగు కురుమయ్య, మాజీ వార్డు సభ్యులు లక్ష్మీనారాయణ పెంటయ్య, గ్రామ శాఖ కార్యదర్శి కాకం చిన్న నారాయణ, నేతలు కాకం కాశన్న, పరశురాముడు, సంతోష్, రామాంజనేయులు, ఎలగొడ్డు రాముడు, నరసింహ, బోయ చిన్న కురుమయ్య, వెంకటమ్మ, శంకరమ్మ, అంజనమ్మ, దేవమ్మ, బాలపీరమ్మ, ఎల్లమ్మ, దొడ్డ బీరయ్య, ఎజ్జు బీరయ్య తదితరులు పాల్గొన్నారు.